PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 153 | విజయవాడ, శుక్రవారం 5 జనవరి 2024 | 6 + 8 పేజీలు | వెల : 5.50

Vol No | Vijayawada, Friday 5 January 2024 | Rs

గాజా, ఉక్రెయిన్‌లపై

పశ్చిమ దేశాల కపటత్వం

- టర్కీ విదేశాంగ మంత్రి

లోపలి పేజీలో..

రెండోటెస్ట్ రెండు రోజుల్లోనే..

- 642 బంతుల్లోనే టెస్ట్ ఫలితంతో టీమిండియా రికార్డు
- దక్షిణాఫ్రికాపై ఏడు వికెట్ల తేడాతో గెలుపు
- సిరీస్ 1-1తో సమం

6

కెసిఆర్‌కు వైఎస్ జగన్ పరామర్శ

కెసిఆర్‌ను ఆయన నివాసంలో కలిసి పరామర్శిస్తున్న జగన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎడమ కాలు తుంటికి శస్త్రచికిత్స అనంతరం విశ్రాంతి తీసుకుంటున్న తెలంగాణ మాజీ సిఎం, బిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్‌ను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరామర్శించారు. గురువారం ఉదయం 11.30గంటలకు ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్న వైఎస్ జగన్‌కు మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, దానం నాగేందర్ స్వాగతం పలికారు. అక్కడ నుంచి ప్రత్యేక వాహనంలో బంజారాహిల్స్ నందినగర్‌లోని కెసిఆర్ నివాసానికి చేరుకున్న సిఎం వైఎస్ జగన్‌ను కెటిఆర్, తదితరులు ఆహ్వానించారు. అనంతరం కెసిఆర్ బెడ్ రూంకు చేరుకున్న జగన్.. పుష్పగుచ్ఛం అందజేసి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పూర్తిస్థాయిలో కోలుకోవడానికి మరో రెండు మాసాలు పడుతుందని తెలిపిన కెసిఆర్... ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ పరిస్థితులపై వాకబు చేశారు. అంతా సవ్యంగానే ఉందని జగన్ బదులిచ్చారు. జగన్ వెంట ఎంపి మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఎమ్మెల్సీ రఘురాం ఉన్నారు. కెసిఆర్ ఇంటి నుంచి బయల్దేరే ముందు వైఎస్ జగన్‌తో కెటిఆర్ కాసేపు ఏకాంతంగా చర్చలు జరిపినట్టు తెలిసింది.

రాహుల్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న షర్మిల

కాంగ్రెస్‌లో షర్మిల

- కాంగ్రెస్‌లో వైఎస్ఆర్ టిపి విలీనం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ(వైఎస్ఆర్ టిపి) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తన పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేశారు. కాంగ్రెస్ పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఆమెకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గురువారం భర్త అనిల్, పార్టీ ముఖ్య నేతలతో కలిసి ఆమె ఎఐసిసి కార్యాలయానికి వెళ్లి అక్కడ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గే, మాజీ అధ్యక్షులు రాహుల్ గాంధీ, ఎఐసిసి జనరల్ సెక్రటరీ(సంస్థాగత) కెసి వేణుగోపాల్, ఏపి ఇంచార్జి మాణిక్కం ఠాకూర్, ఏపి పిసిసి అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు తదితరులు హాజరయ్యారు. అనంతరం జన్ పథ్ 10లో భర్త బ్రదర్ అనిల్ తో కలిసి షర్మిల సోనియా గాంధీని కలుసుకుని పది నిమిషాల సేపు ముచ్చటించారు. మాజీ సిఎం రాజశేఖర్ రెడ్డి వారసత్వాన్ని అందిపుచ్చుకొని, దక్షిణాదిన కాంగ్రెస్ బలోపేతం కోసం పని చేయాలని సోనియా సూచించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకునేందుక షర్మిల భర్త బ్రదర్ అనిల్ విముఖత వ్యక్తం చేశారు. షర్మిలకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఖర్గే, అనిల్‌కు కూడా కండువా వేయబోతే ఆయన సున్నితంగా తిరస్కరించారు.

పార్టీ ఆదేశిస్తే అండమాన్ లోనైనా పని చేస్తా: షర్మిల

2

రుణాల రీషెడ్యూల్‌కు చెల్లుచీటీ

- విపత్తు రైతుల వెసులుబాటుకు రాం రాం
- ఇంట్రస్ట్ పెట్టుకొనేందుకు కేంద్రం, రాష్ట్రం నిరాకరణ
- సున్నావడ్డీ సాకు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

విపత్తుల రైతులకు తక్షణం కాస్తంత తాత్కాలిక ఉపశమనం కలిగించే బ్యాంక్ రుణాల రీషెడ్యూల్ పథకానికి ప్రభుత్వాలు, బ్యాంక్‌లు చెల్లుచీటీ ఇచ్చేశాయి. సున్నావడ్డీ, పావలా వడ్డీలు వచ్చాక రుణాల వాయిదాను పట్టించుకోవట్లేదు. టిడిపి హయాంలోనే అన్నదాతల అప్పుల రీషెడ్యూల్‌కు నిరాదరణ ఎదురుకాగా ప్రస్తుత వైసిపి ప్రభుత్వం ఆ విషయాన్ని పూర్తిగా వదిలేసింది. ఈ సంవత్సరం ఖరీఫ్‌లో కరువు, తుపాన్ వచ్చి భారీగా పంటలను దెబ్బతీశాయి. రైతులను ఆర్థికంగా కుదేలు చేశాయి. కేంద్ర బృందాలు రాష్ట్రంలో పర్యటించాయి. కానీ రుణాల వాయిదాపై కేంద్రానికి, రిజర్వ్‌బ్యాంక్‌కు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలేమీ పంప లేదని తెలుస్తోంది. బ్యాంకులు సైతం నిర్లిప్తత పాటిస్తున్నాయి. పంటలు నష్టపోయిన రైతులు తిరిగి వంటలేనుకోడానికి, వ్యవసాయం సాగించడానికి పెట్టుబడులు అవసర మవుతాయి. తీసుకున్న రుణాల చెల్లింపులను వాయిదా వేసి, కొత్త అప్పులిప్పించాల్సిన తరుణంలో రీషెడ్యూల్‌ను మర్చిపోవడం రైతులకు ఆందోళన కలిగిస్తోంది.

రూ.40 వేల కోట్లు!

ఖరీఫ్‌లో తీవ్ర వర్షాభావంతో లక్షల ఎకరాల్లో రైతులు పంటలు వేయలేదు. వేసిన లక్షల ఎకరాల్లో పంటలు దారుణంగా దెబ్బతిన్నాయి. రైతుల ఆందోళనలను వినిపించుకోకుండా ప్రభుత్వం ఏడు జిల్లాల్లోని 103 మండలాల్లోనే కరువును ప్రకటించి ంది. ఆ ప్రాంతాల్లోనైనా రైతుల ఖరీఫ్ రుణాలను రీషెడ్యూల్ చేయాల్సి ఉండగా ఆ వైపు సర్కారు ఆలోచించట్లేదు. మిచౌంగ్ తుపాన్ కోస్తాలోని పలు జిల్లాల్లో పంటలను కబళించింది. రాయలసీమలోనూ అక్కడక్కడ పంటలపై ప్రభావం చూపించింది. తుపాన్ మండలాలను గుర్తించి రైతు రుణాలు రీషెడ్యూల్ చేయాలని కేంద్రానికి, ఆర్‌బిఐకి వినతులు పంపలేదు. ఖరీఫ్‌లో రాష్ట్రంలోని అన్ని బ్యాంకులూ కలుపుకొని రూ.87 వేల కోట్ల పంట రుణాలివ్వాలని లక్ష్యంగా నిర్ణయించారు. రూ.80 వేల కోట్ల వరకు పంపిణీ జరిగిందని చెబుతున్నారు. ఇచ్చిన రుణాల్లో రూ.40 వేల కోట్ల వరకు కరువు, తుపాన్ ప్రాంతాల్లోని రైతులవని, వాటన్నింటినీ వాయిదా వేయాల్సి ఉంటుంది.

భారంగా భావించే...

బ్యాంకులు రైతులకు ఏడు శాతం వడ్డీపై పంట రుణాలిస్తున్నాయి. సకాలంలో తిరిగి చెల్లిస్తే మరో మూడు శాతం రిబేటు ప్రకటించాయి. గడువులోపు చెల్లిస్తే తతిమ్మా నాలుగు శాతం వడ్డీని రాష్ట్ర ప్రభుత్వం పెట్టుకుంటామంది. ఉత్తరోత్తర సున్నా వడ్డీ అంటోంది. రైతులు సకాలంలో తిరిగి కట్టలేకపోవ డం, ఆధార్, ఇ-క్రాప్ వంటి ఆంక్షల కారణంగా రైతులకు సున్నావడ్డీ అమలు కావట్లేదు. కేంద్రం ఇస్తామన్న 3 శాతం, రాష్ట్రం ఇస్తామన్న 4 శాతం వడ్డీ రాయితీలు రాక పూర్తిగా ఏడు శాతం వడ్డీ కడుతున్నారు. రుణాల రీషెడ్యూల్ విషయానికొస్తే విపత్తుల సమయంలో రైతుల అప్పులపై ఒక ఏడాది మారటోరియం విధిస్తారు. అంటే మొదటి సంవత్స రం అప్పు కట్టకుండా వెసులుబాటు దొరుకుతుంది. రెండో ఏడాది నుంచి మూడేళ్లలో సంవత్సరానికి ఇంత అని మూడు సమాన వాయిదాల్లో వడ్డీతో సహా చెల్లించాలి. రీషెడ్యూల్ రుణాలపై వడ్డీ 10-12 శాతం పడుతుంది. సున్నా వడ్డీ అంటున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విపత్తులతో రీషెడ్యూల్ చేసిన రుణాలపై బ్యాంకులు వేసే వడ్డీని భరించడానికి నిరాకరిస్తున్నాయి. ఈ వాస్తవం నుంచి రైతులను దృష్టి మళ్లించేందుకు సున్నావడ్డీని ముందుకు తెచ్చి గడువులోపు కట్టుకుంటే వడ్డీ భారం ఉండదని ఉచిత సలహా ఇస్తున్నాయి. బ్యాంకులు కూడా రీషెడ్యూల్‌ను పక్కనపెట్టి రుణాల పునరుద్ధరణ (రెన్యువల్)కు పాల్పడుతున్నాయి. కొత్తగా రుణాలిచ్చినట్లు పుస్తకాల్లో రాసుకుంటున్నాయి. విపత్తు రైతులకు కొత్తగా రూపాయి కూడా ఇవ్వట్లేదు.

అంగన్‌వాడీ ఉద్యోగుల శిబిరం వద్ద మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

రాష్ట్రంలో పరిపాలన ఉందా..!

- ఉద్యోగులు రోడ్డెక్కి ధర్నాలు చేస్తున్నా ప్రభుత్వానికి పట్టదా ?
- ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయమనడం నేరమా ?
- పది నుంచి ఏలూరులో సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు
- సమ్మె శిబిరాలకు వెళ్లి మద్దతు తెలిపిన వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, ఏలూరు అర్బన్

రాష్ట్రంలో పరిపాలన ఉందా.. లేక స్తంభించిపోయిందా అనే అనుమానం నెలకొందని, వివిధ తరగతుల ప్రజలు, ఉద్యోగులు రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నా ఏమీ పట్టనట్లు ప్రభుత్వం వ్యవహరించడం అత్యంత దుర్మార్గమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. ఈ నెల 10, 11న ఏలూరులో జరగనున్న సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు, జిల్లా సమాగ్రాభివృద్ధి సదస్సుకు సంబంధించి ఏర్పాట్లపై గురువారం పరిశీలనకు విచ్చేసిన ఆయన స్థానిక సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలోనూ, కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీ, సమగ్రశిక్ష ఉద్యోగుల సమ్మె శిబిరాల వద్ద మాట్లాడారు. అంగన్‌వాడీలు, మున్సిపల్ వర్కర్లు, సమగ్ర శిక్ష ఉద్యోగులతోపాటు అనేక తరగతుల ఉద్యోగులు తమ సమస్యలపై రోడ్డెక్కి పోరాడుతున్నా తమకు తెలియనట్లు ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. ప్రభుత్వ యంత్రాంగం జగన్ చుట్టూ, జగన్ ఎన్నికల చుట్టూ తిరుగుతున్నారని విమర్శించారు. అంగన్‌వాడీలను పిలిపించి చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుండా బెదిరించి భయపెట్టే పరిస్థితి కన్పిస్తోందని, ఇది ఏమాత్రం సమంజసం కాదన్నారు. ఐదో తేదీ తర్వాత ఉద్యోగాల్లో చేరకపోతే టెర్మినేట్ చేస్తామంటున్నారని.. మరో రెండునెలలు ఆగితే వైసిపి ప్రభుత్వాన్ని ప్రజలే టెర్మినేట్ చేస్తారన్నారు. సచివాలయ ఉద్యోగులతో అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే కిట్లు పంపిణీ చేయాలని చూస్తున్నారని, దీన్ని తల్లులు వ్యతిరేకించాలన్నారు. మహిళలు, యువత, విద్యార్థి సంఘాలు, సర్పంచులంతా అంగన్‌వాడీల సమ్మెకు మద్దతు తెలపాలని కోరారు. జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయమని ఉద్యోగులంతా కోరుతున్నారని, ఇది నేరమా? అంటూ ప్రశ్నించారు. సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల పట్ల ఆ శాఖ రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు బెదిరించినట్లు మాట్లాడాన్ని సిపిఎం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఆయన వెంటనే ఉద్యోగులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ల్యాండ్ టైటిల్ యాక్ట్‌తో రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. ఆ చట్టం ద్వారా రైతులు శాశ్వత భూహక్కును కోల్పోతారన్నారు. బడాబాబు లకు భూసేకరణకు ఇబ్బంది లేకుండా చేసేందుకు ఈ చట్టం తెచ్చారని విమర్శించారు. రాష్ట్ర సమస్యల పై బిజెపి నాయకులకు మాట్లాడే హక్కు లేదన్నారు. రెవెన్యూ లోటు, పోలవరానికి నిధులు, ప్రత్యేక హోదా రాష్ట్రానికి ఏ ఒక్కటీ బిజెపి ఇవ్వలేదన్నారు. విశాఖ ఉక్కును ప్రయివేటు పరం చేయాలని చూస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర హక్కులపై పోరాడాల్సిన ప్రధాన పార్టీలైన వైసిపి, టిడిపి, జనసేన కేంద్రంలోని బిజెపికి దాసోహమంటూ రాష్ట్రానికి అన్యాయం చేస్తున్నాయని తెలిపారు.

2019 ఎన్నికల్లో బిజెపికి వ్యతిరేకంగా మాట్లాడిన వీరంతా ఇప్పుడు భజన చేస్తున్నారన్నారు. బిజెపికి మద్దతు ఇచ్చే పార్టీలతో ఎన్నికల్లో పొత్తులు ఉండవని, బలం ఉన్న స్థానాల్లో సిపిఎం పోటీ చేస్తుందని, బిజెపి వ్యతిరేక శక్తులతో మాట్లాడతామని చెప్పారు.

రాష్ట్రకమిటీ సమావేశాలను జయప్రదం చేయండి

ఈ నెల 10, 11న ఏలూరులో జరిగే సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు, జిల్లా సమగ్రాభివృద్ధి సదస్సు జయప్రదం చేయాలని శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశాల్లో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు, ఎంఎ.బేబి పాల్గొంటారన్నారు. రాష్ట్రంలో వివిధ జిల్లాల నుంచి దాదాపు 80 మంది ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. బిజెపిని, మిత్రపక్షాలను ఓడించడం, వామపక్షశక్తుల ఐక్యత, రానున్న ఎన్నికల్లో అనుసరించాల్సిన ఎత్తుగడలు, ప్రజా సమస్యలపై చర్చలు వంటివి జరగనున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే

సంక్రాంతి తరువాత సమ్మె

- ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల హెచ్చరిక
- పంచాయతీరాజ్ కమిషనరు కార్యాలయం వద్ద మహా ధర్నా

పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న 'ఉపాధి' ఫీల్డ్ అసిస్టెంట్లు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలని, ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని, లేనిపక్షంలో సంక్రాంతి తరువాత సమ్మెలోకి వెళతామని ఎపి ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు కె ఉమామహేశ్వరరావు హెచ్చరించారు. వేతనాలు పెంచాలని, మ్యాన్‌డేస్ పని విధానం రద్దు చేయాలని, ఎఫ్‌టిఇ అమలు చేయాలని, విలీన పంచాయతీల్లో అసిస్టెంట్లను యథావిధిగా కొనసాగించాలని కోరుతూ గురువారం ఉదయం పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయం దగ్గర్లో మహాధర్నాకు దిగారు. ముందుగానే అక్కడకు చేరుకున్న అసిస్టెంట్లను పోలీసులు మోహరించడంతో గుంపులు గుంపులుగా చేరి ఒక్కసారిగా ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షులు కె ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. ఎనిమిదేళ్లుగా ఫీల్డ్ అసిస్టెంట్లకు ఒక్క రూపాయి కూడా పెంచలేదని అన్నారు. అలాగే మ్యాన్‌డేస్ పేరుతో వేధింపులకు దిగుతున్నారని తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు ఎఫ్‌టిఇ అమలు చేయాలని కోరారు. ముఖ్యంగా మండలస్థాయిలో బదిలీలకు అవకాశం కల్పించాలన్నారు. వీటిపై ఎన్నికల ముందు ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టమైన హామీనిచ్చారని, దాన్ని నిలబెట్టుకోవాలని కోరారు. సంక్రాంతి లోపు సమస్యలు పరిష్కరించకపోతే జనవరి 18 నుండి సమ్మెలోకి వెళతామని హెచ్చరించారు. కనీస వేతనం రూ.26 వేలు లేదా, నాలుగో తరగతి ప్రభుత్వ ఉద్యోగికి చెల్లించిన విధంగా రూ.20 వేలు వేతనం చెల్లించాలని కోరారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం పరంధామయ్య మాట్లాడుతూ.. మిగతా 2లో

మీడియాతో మాట్లాడుతున్న అంగన్‌వాడీ సంఘాల నాయకులు

నేటి నుంచి నిరాహార దీక్షలు

- అంగన్‌వాడీ సంఘాలు

లోపలి పేజీలో..

మున్సిపల్ కార్మికులపై బైండోవర్ కేసులు

- పోటీ కార్మికులను రాష్ట్రవ్యాప్తంగా అడ్డగింత
- కొనసాగుతున్న సమ్మె

బిసి నేతలకు టిడిపి విశ్వవిద్యాలయం

- జయహో బిసి వర్క్‌షాప్‌లో చంద్రబాబు

లోపలి పేజీలో..

నవరత్నాల ఇళ్లు అందేదెప్పుడు ?

- నత్తనడకన 13 లక్షల ఇళ్ల పురోగతి

ఎన్నికల ప్రచారంలో పాల్గొనకుండా

నన్ను అడ్డుకోవాలని చూస్తున్నారు

- బిజెపిపై కేజ్రీవాల్ ధ్వజం

న్యూఢిల్లీ : వచ్చే లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో పాల్గొనకుండా తనను అడ్డుకోడానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుట్ర పన్నిందని, అందుకే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ విచారణకు పిలిచి అరెస్టు చేయాలని చూస్తోందని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ విమర్శించారు. గురువారం న్యూఢిల్లీలో విలేకరుల సమావేశంలో కేజ్రీవాల్ మాట్లాడుతూ, ఇడి సమన్లు రాజకీయ దురుద్దేశంతో కూడినవి కాబట్టి ఇడి విచారణకు మూడవసారి కూడా తాను వెళ్లలేదని చెప్పారు. ఇడి సమన్లు చట్ట విరుద్ధమని, కాబట్టి వెళ్లక్కర్లేదని న్యాయవాదులు తనతో చెప్పారని అన్నారు... సమన్లపై ఇడికి లేఖ రాశానని, సమన్లు చట్టవిరుద్ధమని ఇడికి కూడా తెలుసుకాబట్టే వారు సమాధానం ఇవ్వలేదని కేజ్రీవాల్ తెలిపారు. చట్ట విరుద్ధంగా సమన్లు జారీ చేశారు కాబట్టే వాటిని అనుసరించడం లేదని, చట్టబద్ధంగా సమన్లు జారీ చేస్తే వాటిని అనుసరిస్తానని కేజ్రీవాల్ తెలిపారు. ఎనిమిది నెలల క్రితం సిబిఐ తనను విచారణకు పిలిచినప్పుడు, తాను సిబిఐ ముందు విచారణకు హాజరైన విషయాన్ని కేజ్రీవాల్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. మనీష్ సిసోడియా, సంజయ్ సింగ్, విజయ్ నాయర్‌లను బిజెపితో చేతులు కలపనందుకే అరెస్టు చేశారని కేజ్రీవాల్ ఆరోపించారు. ఈ కేసు విచారణ రెండేళ్లుగా సాగుతున్నా.. లోకసభ ఎన్నికలకు ముందే తనకు సమన్లు ఎందుకు ఇచ్చారని ప్రశ్నించారు. 'గత రెండేళ్లుగా ఈ 'మద్యం కుంభకోణం' వార్త వింటున్నాం. రెండేళ్లల్లో అనేక ప్రాంతాల్లో సోదాలు జరిపారు. పలువుర్ని అరెస్టు చేశారు. కానీ, ఈ తనిఖీల్లో అవినీతి సొమ్ము అంటూ ఒక్క పైసా కూడా బయటపడలేదు. ఒకవేళ నిజంగానే అవినీతి జరిగితే ఆ రూ.కోట్లన్నీ ఎక్కడికి వెళ్లాయి?' అని కేజ్రీవాల్ ప్రశ్నించారు.

మళ్లీ రుణ సంక్షోభంలో కాఫీ డే

రూ.434 కోట్లకు చేరిక.. అప్పులు తీర్చలేక డీఫాల్ట్

3

తొలగింపుతో బెదిరింపులు

సమగ్ర శిక్ష డైరెక్టర్ నిర్వాకం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సమ్మెలో ఉన్న సమగ్ర శిక్ష, కెజిబివి ఉద్యోగులపై రాష్ట్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు దిగింది. సమస్యలు పరిష్కరించడానికి బదులుగా ఉద్యోగులను విధుల నుండి తొలగించడం ప్రారంభించింది. విధులకు గైర్హాజరవుతున్నారన్న సాకుతో ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేస్తోంది. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్న పి జయంతి,కెజిబివిలో పిఇటిగా పనిచేస్తున్న దేవరపు బేబిరాణిలను తొలగిస్తూ గురువారం సాయంత్రం ఉత్తర్వులు జారీ అయ్యాయి. సమగ్ర శిక్ష అనకాపల్లి అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ఈ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఇద్దరని కాదని, సమ్మెలో ఉన్న మిగిలిన వారిని కూడా ఇదే రీతిలో ఉద్యోగాల నుండి తొలగిస్తామని ఉన్నతాధికారులు అంటున్నారు.

డైరక్టర్ ఆదేశాల మేరకే...

ఇప్పటికే షోకాజ్ నోటీసు ఇచ్చిన ఉద్యోగులను విధుల నుండి తొలగించాలంటూ సమగ్ర శిక్ష డైరెక్టర్ బి శ్రీనివాసరావు ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ తొలగింపుల పర్వం ప్రారంభమైనట్లు తెలిసింది. బుధవారం నిర్వహించిన ఆన్‌లైన్ సమావేశంలో ఆయన ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. తనపై ఇప్పటికే చాలా కోర్టు ధిక్కరణ కేసులున్నాయని, మరో కేసుకు భయపడేది లేదని ఆయన అన్నట్లు సమాచారం. హైకోర్టులో కేసు అయితే తాను చూసుకుంటానని. నిండమునిగిన వాడికి పెద్ద చలి ఉండదని ఆయన వ్యాఖ్యానించినట్లు తెలిసింది. సమ్మెలో ఉన్నవారికి పెండింగ్ వేతనాలు చెల్లించవద్దని, ఎక్కడైన ప్రిన్సిపాళ్లు వారికి అండగా నిలిస్తే వారినికూడా తొలగించాలని ఆయన ఆదేశించినట్లు తెలిసింది. కెజిబివి నాన్ టీచింగ్ సిబ్బందిని చర్చలకు కూడా పిలవకుండా తొలగించాలని ఆయన చెప్పారు. సమ్మెలో ఉన్న వారిని ఉద్దేశించి ఆయన అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు సమాచారం.

భగ్గుమన్న ఉద్యోగులు

- నేడు డైరక్టర్ కార్యాలయ ముట్టడికి పిలుపు

విధుల నుండి తొలగించడం పట్ల సమగ్ర శిక్ష, కెజిబివి ఉద్యోగులు మండిపడ్డారు. ఇటువంటి చర్యలకు భయపడేది లేదని ప్రకటించారు. డైరక్టర్ ఆదేశాలకు నిరసనగా, సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం సమగ్ర శిక్ష డైరెక్టర్ కార్యాలయం ముట్టడికి పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్షా కాంట్రాక్టు అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్(జెఎసి) ఆధ్వర్యంలో ఉద్యోగులు ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు.

ఏలూరులో ఉద్యోగుల సమ్మె శిబిరాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు బుధవారం సందర్శించి సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించకపోగా సమగ్ర శిక్ష అభియాన్ రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ ఉద్యోగులను తొలగిస్తామని బెదిరింపులకు దిగడం సరికాదన్నారు రాష్ట్ర వ్యాప్తంగా కుటుంబసభ్యులతో కలిసి బుధవారం సమగ్రశిక్ష ఉద్యోగులు నిరసనలు కొనసాగించారు.

తక్షణమే చర్యలు: సిపిఎం డిమాండ్

సర్వశిక్ష అభియాన్ ఉద్యోగుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన ప్రాజెక్టు డైరెక్టర్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఉద్యోగుల చేస్తున్న మిగతా 2లో

బెదిరింపులకు భయపడం

- సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె విరమించం
- రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగిన అంగన్‌వాడీల సమ్మె

ప్రజాశక్తి-యంత్రాంగం

సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం చేస్తున్న బెదిరింపులకు, జారీ చేస్తున్న జిఒలకు భయపడేది లేదని అంగన్‌వాడీలు పేర్కొన్నారు. సమస్యలు పరిష్కరించకుండా తమపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం దారుణమని మండిపడ్డారు. విధుల్లోకి చేరాలంటూ కలెక్టర్ జారీచేసిన మెమో కాపీలను రాష్ట్ర వ్యాప్తంగా దగ్ధం చేశారు. అంగన్‌వాడీల సమ్మె గురువారానికి 24వ రోజుకు చేరుకుంది. ప్రభుత్వం దిగివచ్చి తమ సమస్యలు పరిష్కరించేంత వరకు ఆందోళనలు విరమించబోమని స్పష్టం చేశారు.

తూర్పుగోదావరి జిల్లా సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద సమ్మె శిబిరాన్ని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు సందర్శించి మాట్లాడారు. అంగన్‌వాడీల శాంతియుత పోరాటాన్ని అణచివేయాలని చూడొద్దని హెచ్చరించారు. కాకినాడలో ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నెల్లూరులో సమ్మె శిబిరాన్ని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు సందర్శించి మాట్లాడారు. కార్మిక వర్గంతో పెట్టుకున్న ప్రభుత్వాలు మనుగడ సాగించలేవని, కాలగర్భంలో కలిసిపోవాల్సిందేనని హెచ్చరించారు. విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద అంగన్‌వాడీలు శవాసనం వేసి నిరసన తెలిపారు. అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరంలో భిక్షాటన చేశారు. అల్లూరి జిల్లా డుంబ్రిగుడలో కబడ్డీ

బాపట్లలో దీక్షా శిబిరంలో పడుకొని అంగన్‌వాడీల నిరసన

ఆడుతూ నిరసన చేపట్టారు. కర్నూలు జిల్లా తుగ్గలి, మద్దికెర మండల కేంద్రాల్లో అంగన్‌వాడీ కేంద్రం వద్ద బాలామృతం ప్యాకెట్లను వాహనాల నుండి దింపడాన్ని సిఐటియు నాయకులు, అంగన్‌వాడీలు అడ్డుకున్నారు. మద్దికెరలో ఐసిడిఎస్ అధికారులకు, అంగన్‌వాడీలకు మధ్య జరిగిన తోపులాటలో అంగన్‌వాడీ టీచర్ స్పృహ కోల్పోయారు.

వెంటనే ఆమెను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. గుంటూరు కలెక్టరేట్ ఎదుట సమ్మె శిబిరంలో ఆవుకు వినతిపత్రం ఇచ్చి నిరసన తెలిపారు. మంగళగిరిలో అంగన్‌వాడీ దీక్షలకు మద్దతుగా సిపిఎం సీనియర్ నాయకులు పి మధు ప్రసంగించారు. నోటీసుల పేరుతో ప్రభుత్వం చేసే తాటాకు చప్పుళ్లకు బెదిరేది లేదని అన్నారు. పల్నాడు జిల్లాలో ఆందోళనలు కొనసాగాయి. ఎన్‌టిఆర్ జిల్లాలో సమ్మె శిబిరాన్ని కాంగ్రెస్ సీనియర్ నాయకులు తులసిరెడ్డి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు సందర్శించి మద్దతు తెలిపారు. ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బేబిరాణి, కె సుబ్బరావమ్మ పాల్గొని మాట్లాడారు. కృష్ణాజిల్లా బంటుమిల్లిలో ఆర్‌టిసి బస్సులు తుడుస్తూ నిరసన కొనసాగించారు. బాపట్లలో సమ్మె శిబిరంలో పడుకొని నిరసన తెలిపారు. చిత్తూరు జిల్లా పుత్తూరులో సమ్మె విరమించాలని ఇచ్చిన నోటీసులను దగ్ధం చేశారు. చిత్తూరు జిల్లా కార్వేటినగరం ప్రాజెక్టు పరిధిలోని ఆరు మండలాల అంగన్‌వాడీలు చెరువులో దిగి నిరసన తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకులో మోకాళ్లపై నిల్చొని, పాలకొల్లు, భీమవరం, పోడూరులో ఒంటికాళ్లపై నిలబడి, పాలకోడేరులో క్రికెట్ ఆడి, గణపవరంలో దున్నపోతుకు వినతిపత్రం అందించి నిరసనలు చేపట్టారు. ఏలూరు కలెక్టరేట్ వద్ద, పెదపాడులో మోకాళ్లపై నిలబడి, కొయ్యలగూడెంలో పచ్చగడ్డి తింటూ నిరసన తెలిపారు. కుక్కునూరులో జగన్ ఫొటోతో భిక్షాటన చేశారు. విజయనగరం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. గజపతినగరం, ఎస్.కోటలో 24 అంకె ఆకారంలో కూర్చొని, కొత్తవలసలో మెడకు ఉరితాళ్లు వేసుకొని నిరసన తెలిపారు.

పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడలో వాహనాలను శుభ్రం చేస్తూ, సీతంపేట, సీతానగరం, పార్వతీపురంలో మోకాళ్లపై నిల్చొని, సాలూరులో దండాలు పెడుతూ నిరసనలను కొనసాగించారు. శ్రీకాకుళంలో ఒంటి కాలిపై నిల్చొని నిరసన తెలిపారు. కోటబొమ్మాళి, కొత్తూరులో అధికారులు ఇచ్చిన మెమోల ప్రతులను దగ్ధం చేశారు. కడప, అన్నమయ్య, ప్రకాశం, అనంతపురం, శ్రీ సత్యసాయి, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో ఆందోళనలు కొనసాగాయి.

సమ్మెలపై నిర్బంధం ఆపాలి

- సిఐటియు రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ప్రజాస్వామ్య బద్ధంగా నోటీసులిచ్చి సమ్మె చేపట్టినా ప్రభుత్వం నిర్బంధాన్ని ప్రయోగించడం ప్రజాస్వామ్యం కాదని సిఐటియు రాష్ట్ర కమిటీ పేర్కొంది. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎవి నాగేశ్వరరావు, సిహెచ్ నరసింగరావు గురువారం విడుదల చేసిన ప్రకటనలో నిర్బంధాన్ని తక్షణం ఆపాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల సమ్మె 24వ రోజు, మున్సిపల్ కార్మికుల సమ్మె పదవ రోజు, ఎస్ఎస్ఎ ఉద్యోగుల సమ్మె 16వ రోజుకు చేరుకున్నాయని, వారి డిమాండ్లను పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టరేట్ల ముందు శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తామని అంగన్‌వాడీలు చెప్పినప్పటికీ వారు కలెక్టరేట్ల ముందుకు చేరుకోకముందే పోలీసులు నిర్బంధాన్ని ప్రయోగించారని తెలిపారు. దాడిచేసి అనేక మందిని గాయపరిచారని, వాహనాలను ఎక్కడికక్కడ నిలిపేశారని పేర్కొన్నారు. మహిళల వస్త్రాలు చించేశారని, కొంతమంది మహిళలు సొమ్మసిల్లి పడిపోయారని అన్నారు. మున్సిపల్ కార్మికులు శాంతియుతంగా చేస్తున్న సమ్మెను భగ్నం చేసేందుకు పోటీ కార్మికులను రంగంలోకి దింపి వారి మధ్య తగాదాలు సృష్టించడం, కొన్నిచోట్ల విధంగా వ్యవహరించడం వంటి చర్యలకు దిగారని తెలిపారు. దీనికి ప్రభుత్వ ప్రతినిధులు ప్రయత్నించడం శ్రేయస్కరం కాదని విమర్శించారు. సమ్మె రాజ్యాంగ హక్కని, ఇప్పటికే కొత్తగా చేస్తున్నట్లు తమకు సహించలేమన్నట్లు వ్యవహారాలు నడిపిస్తున్నారని అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అధికారంలో ఉన్న పార్టీ కార్మికుల సమ్మెను బలపరిచిందని, ఇప్పుడు ఒక్కసారిగా మోపడం సరికాదని పేర్కొన్నారు. సమగ్రశిక్షా అభియాన్, జెబివిల్లో పనిచేస్తున్న కొంతమంది ప్రిన్సిపల్స్.. సిఆర్‌టిలను బెదిరిస్తున్నారని, విధుల్లో చేరాలని ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవమని చూడకుండా మహిళలను దూషిస్తున్నారని పేర్కొన్నారు. నంద్యాలలో అధికారుల ఒత్తిడి మరీ ఎక్కువగా ఉందని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా మంకుపట్టు విడనాడాలని, కార్మికులు, ఉద్యోగుల కోర్కెలను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వ స్పందన రాకపోతే కార్మిక సంఘాలన్నీ ఐక్యంగా సమ్మెకు మద్దతుగా నిలబడి సంఘీభావం ప్రకటించాల్సి వస్తుందని, ఆ పరిస్థితి ప్రభుత్వం కల్పించొద్దని కోరారు.

అంటువ్యాధులు ప్రబలితే బాధ్యత ప్రభుత్వానిదే..

పట్టణాలు, నగరాల్లో చెత్త పేరుకుపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని తెలిపారు. అదే జరిగితే ప్రభుత్వమే బాధ్యత వహించాలని పేర్కొన్నారు. కార్మిక చట్టాల మీద, సుప్రీంకోర్టు తీర్పుల మీద ఏ మాత్రం గౌరవం ఉన్నా, వారి కోర్కెలను పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కాత్యాయనీ

పోరాటయోధురాలు సుధా భరద్వాజ

- ప్రముఖ రచయిత్రి కాత్యాయనీ

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

జాతీయస్థాయిలో స్త్రీల హక్కుల కోసం, సామాన్యుల కోసం పోరాడిన ధీరవనిత సుధా భరద్వాజ అని ప్రముఖ రచయిత్రి కాత్యాయనీ విద్మహే అన్నారు. 34వ విజయవాడ పుస్తకమహోత్సవం ఎనిమిదో రోజు గురువారం కేతు విశ్వనాథ రెడ్డి సాహిత్యవేదికపై నిర్వహించిన కార్యక్రమంలో ప్రజాశక్తి బుక్‌హౌస్ ప్రచురించిన 'సుధా భరద్వాజ' రచన 'ఉరి గది నుండి' పుస్తకాన్ని ఆమె ఆవిష్కరించారు. భారతీయ ప్రజల కోసం ఆమె అమెరికన్ పౌరసత్వం వదులుకుని మన దేశ పౌరసత్వం తీసుకున్నారనీ, ఇక్కడ న్యాయవాద వృత్తి చేపట్టారని తెలిపారు. ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాడి ఉరికి సమాన కారాగార శిక్షకు సిద్ధపడిందని ఆమె వివరించారు. ఒక న్యాయవాదిగా నేరస్థులను కాకుండా, నేరాల వెనుక కారణాలను తెలుసుకుని సమాధానాలకు నిరంతరం ప్రయత్నం చేశారని పేర్కొన్నారు. 'ఉరిగది నుండి' పుస్తకం పూర్తిగా మహిళల కోణంలో విశ్లేషిస్తుందని ఆమె చెప్పారు. సుధా భరద్వాజ్ ఏ విలువలకు ప్రాతినిధ్యం వహించారో.. ఆ విలువను అర్థం చేసుకుని కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆమె తెలిపారు. న్యాయవాది సుంకర రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ విచారణ ఖైదీలతో భారతీయ జైళ్లు నిండిపోతున్నాయన్నారు. వీరిలో అధిక శాతం దళితులు, బహుజనులు ఉన్నారని వివరించారు. అలాంటి ఖైదీల వెతలను సుధా భరద్వాజ్ తన రచనల్లో ప్రతిఫలించారన్నారు. మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మహిళా ఖైదీల బాధలను హృదయం ద్రవించేలా అక్షరరూపం ఇచ్చిన రచయిత్రిని, అలాంటి రచనను అనువాదం చేయించి ప్రచురించి ప్రజాశక్తి బుక్ హౌస్‌ను అభినందించారు. బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యదర్శి కె.లక్ష్మయ్య అధ్యక్షతన జరిగిన సభలో ప్రజాశక్తి బుక్‌హౌస్ పూర్వ సంపాదకులు కె.ఉషారాణి, స్వరూపరాణి పాల్గొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు
పంపవచ్చు.

మున్సిపల్ కార్మికులపై బైండోవర్ కేసులు

- పోటీకార్మికులను రాష్ట్రవ్యాప్తంగా అడ్డగింత
- కొనసాగుతున్న సమ్మె

ప్రజాశక్తి- యంత్రాంగం

మున్సిపల్ కార్మికుల డిమాండ్ల పరిష్కారంపై దృష్టి పెట్టాల్సిన ప్రభుత్వం ఆ పని చేయకుండా సమ్మెలో ఉన్న వారిని బెదిరించి లొంగదీసుకుంటుంది. పోటీ కార్మికులతో పనులు చేయిస్తూ..వారిని అడ్డుకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని బెదిరిస్తోంది. జిల్లాల్లో పోలీసులు దగ్గరుండి పోటీ కార్మికులతో పనులు చేయిస్తున్నారు. అడ్డుకుంటున్న వారిని అరెస్టు చేసి బైండోవర్ కేసులు పెడుతున్నారు. తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో ఐదుగురిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. విశాఖలో 30 మందిని అరెస్టు చేశారు. ప్రభుత్వం దిగొచ్చి తమ డిమాండ్లు పరిష్కరించేంత వరకూ పోరాటం సాగిస్తామని మున్సిపల్ కార్మికులు తేల్చి చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా కార్మికులు చేపట్టిన సమ్మె గురువారంతో పదవరోజుకు చేరింది.

తిరుపతి జిల్లా సూళ్లూరుపేట బజారువీధిలో పేరుకుపోయిన చెత్తను ఎంపిపి సభ్యులు అల్లూరు అనీల్‌రెడ్డి, కమిషనర్ నరేంద్రకుమార్ ఆధ్వర్యంలో వైస్ చైర్మన్ చిన్ని సత్యనారాయణ, కౌన్సిలర్లు కలిసి పోలీసు బలగాలతో తొలగించే కార్యక్రమం చేపట్టారు. 'మా సమస్యలు పరిష్కరించకుండా, మా పొట్ట కొట్టే చర్యలు చేపట్టొద్దు' అంటూ వారిని మున్సిపల్ కార్మికులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో అధికారులు, వైసిపి ప్రజా ప్రతినిధులు, పోలీసుల మధ్య తోపులాట చోటు చేసుకుంది. సిఐటియు కార్యదర్శి కె.లక్ష్మయ్య, మరో నలుగురి నాయకులను బలవంతంగా స్టేషన్‌కు తరలించారు. వీరిపై బైండోవర్ కేసు నమోదు చేశారు.

విశాఖలోని ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియం వద్ద చెత్త తరలించడానికి అధికారులు చేసిన ప్రయత్నాన్ని మున్సిపల్ కార్మికులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో బోనా అనిత, పులమరశెట్టి పైడమ్మ, చిట్టిబోయిన రమణ, బేసబోయిన హేమలత, ఎల్లమ్మ సహా 25 మందిని

నెల్లూరులో నిరసన ర్యాలీ చేపట్టిన కార్మికులు

పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం విడిచిపెట్టారు. జివిఎంసి ఏడో వార్డు కారుషెడ్ కూడలి వద్ద మనస్తాపానికి గురైన కార్మికుడు యజ్జల చిన్నా పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తోటికార్మికులు స్పందించి సమీపంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. విజయవాడ రాణిగారితోట 18వ డివిజన్‌లో క్లాప్ ఆటో డ్రైవర్ అత్యుత్సాహం ప్రదర్శించి పారిశుధ్య కార్మికురాలు మరియమ్మను ఆటోతో ఢీ కొట్టాడు. దీంతో ఆమెకు గాయలవ్వడంతో ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

విజయనగరంలో ఎఐటియుసి అనుబంధ సంఘం కార్మికులు కూడా సమ్మెలోకి రావడంతో నగరంలో పూర్తి స్థాయిలో పారిశుధ్య సేవలు నిలిచిపోయాయి. ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.జగన్‌మోహన్ మద్దతు తెలిపారు. పార్వతీపురంలో డప్పు వాయిద్యాలతో, పాలకొండలో చేతికి సంకెళ్లు వేసుకొని నిరసన తెలిపారు. శ్రీ సత్యసాయి, ఉమ్మడి కర్నూలులో నిరసన దీక్షలు కొనసాగాయి. కడపలో ప్రభుత్వ శవయాత్రతో నిరసన తెలిపారు. ఒంగోలులో పొర్లుదండాలు పెట్టి నిరసన తెలిపారు. బాపట్ల జిల్లా చీరాలలో భిక్షాటన చేశారు.

గుంటూరు నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయం నుంచి జిన్నా టవర్ సెంటర్ వరకూ ప్రదర్శన నిర్వహించారు. పల్నాడు జిల్లా దాచేపల్లిలో పోటీ కార్మికులను అడ్డుకోవడంతో మున్సిపల్ కార్మికులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం విడుదల చేశారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకులో పనిముట్లతో కార్మికులు నిరసన తెలిపారు. తాడేపల్లిగూడెంలో పోటీ కార్మికులను పెట్టి పనులు నిర్వహిస్తున్న మున్సిపల్ అధికారులను మున్సిపల్ కార్మికులు నిలదీశారు. ఏలూరులో వెహికల్ డిపో వద్ద చెత్తసేకరణ వాహనాలు బయటకు రాకుండా కార్మికులు అడ్డుకున్నారు. కోనసీమ, తూర్పుగోదావరి,కాకినాడ జిల్లాల్లో మున్సిపల్ కార్యాలయం వద్ద సమ్మె శిబిరాలను కొనసాగించారు. నెల్లూరులో జలకన్య విగ్రహం నుంచి పప్పుల వీధి మీదుగా ఎబిఎం కాంపౌండ్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస మెయిన్ రోడ్డులో మానవహారం చేపట్టారు. పలాసలో అర్ధనగ్న ప్రదర్శన, ఇచ్ఛాపురంలో రాస్తారోకో నిర్వహించారు.

నేటి నుంచి 'రా.. కదలిరా'!

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు శుక్రవారం నుంచి జిల్లాల పర్యటనలు చేయనున్నారు. 'రా.. కదలిరా' కార్యక్రమం పేరుతో ఈ పర్యటన నిర్వహించనున్నారు. 5న ఒంగోలు పార్లమెంటు నియోజకవర్గంలో తొలి సభ నిర్వహించనున్నారు. ఈ నెల 29 వరకు 22 పార్లమెంటు నియోజకవర్గాల్లో భారీ బహిరంగ సభలు జరపనున్నారు. రోజుకు 2 పార్లమెంటు నియోజకవర్గాల్లో జరిగే సభల్లో చంద్రబాబు పాల్గొంటారు. ఈ సభల కోసం ప్రత్యేక హెలికాప్టర్‌ను సిద్ధం చేసుకున్నారు. కొన్ని సభలకు చంద్రబాబుతోపాటు పవన్‌కళ్యాణ్ కూడా హాజరవుతారని అంటున్నారు.

టిడిపిలోకి పాడేరు వైసిపి నేతలు

పాడేరు నియోజకవర్గానికి చెందిన వైసిపి సర్పంచులు, ఎంపిటిసిలు, ఆ పార్టీ నేతలు టిడిపిలో చేరారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఉండవల్లిలోని తన నివాసంలో వారికి టిడిపి కండువా కప్పి గురువారం పార్టీలోకి ఆహ్వానించారు. పంచాయతీలకు మరలా మహర్దశ రావాలంటే టిడిపితోనే సాధ్యమని చంద్రబాబు ఈ సందర్భంగా అన్నారు. టిడిపిని గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు. వినుకొండకు చెందిన పారిశ్రామిక వేత్త బోడేపూడి సుబ్బారావు వెబ్‌సైట్‌ను చంద్రబాబు ఆవిష్కరించారు.

సమస్యలు పరిష్కరించకుంటే సంక్రాంతి తరువాత సమ్మె

(మొదటిపేజీ తరువాయి)

ప్రతిపక్షంలో ఉండగా జగన్ తాను అధికారంలోకి వస్తే కనీస వేతనం రూ.26 వేలు చెల్లిస్తామని, రెగ్యులరైజ్ చేస్తామని, మ్యాన్‌డేస్ విధానాన్ని రద్దు చేస్తామని తెలిపారని, అయినా చేయలేదని అన్నారు. మాట తప్పను, మడమ తిప్పను అన్నమాట నిలబెట్టుకోవాలని ఆయన కోరారు.

వేతనాలు పెరిగేట్లు చూస్తాం కమిషనర్ సూర్యకుమారి హామీ

మహాధర్నా సందర్భంగా నాయకులను పంచాయతీరాజ్ కమిషనర్ సూర్యకుమారి చర్చలకు ఆహ్వానించారు. వినతిపత్రం సమర్పించిన అనంతరం నాయకులు ఉమామహేశ్వరరావు తదితరులు సమస్యలు వివరించారు. దీనికి స్పందించిన కమిషనర్ వేతనాల పెంపుపై రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి పెరిగేటట్లు చూస్తామని తెలిపారు. మ్యాన్‌డేస్ విధానాన్ని సవరిస్తామని, ఎఫ్‌టిఇ పరిధిలోకి తీసుకొస్తామని అన్నారు. పట్టణాల్లో కలిసిపోయిన గ్రామాలకు సంబంధించిన అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చి ప్రత్యామ్నాయ ఉపాధి చూపిస్తామని పేర్కొన్నారు.

ప్రమాదంలో చనిపోయిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు ఉద్యోగం కల్పించే అంశాన్ని చూస్తామన్నారు. ఈ విషయాలన్నీ ధర్నా దగ్గరకు వచ్చిన డైరెక్టర్ చినతాతయ్య, ఎంఎస్ శ్రీవారెడ్డి, జెసి జ్యోతి ఫీల్డ్ అసిస్టెంట్లకు కమిషనర్ తరపున వివరించారు. సానుకూలంగా స్పందించిన కమిషనర్, అధికారులకు యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం పరంధామయ్య, బి నరసింహులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖాదర్ బాషా, మహేష్, వీరేష్, హరిప్రసాదు, గణేష్, శివప్రసాదు, రవి, భవానీ తదితరులు పాల్గొన్నారు. తాడేపల్లి సిపిఎం నాయకులు వెంకటరెడ్డి తదితరులు ధర్నాకు మద్దతు తెలిపారు.

మరో అవకాశం ఇవ్వండి

- హయ్యర్ పెన్షన్ పై ఆర్‌టిసి ఉద్యోగుల విజ్ఞప్తి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులకు ఇచ్చే ఇపిఎఫ్ఓ హయ్యర్ పెన్షన్ విధానానికి దరఖాస్తు చేసుకునేందుకు గడువును తమకు కూడా పెంచాలని ఆర్‌టిసి ఉద్యోగులు కోరతున్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం హయ్యర్ పెన్షన్ కోసం దరఖాస్తులను చేసుకున్న ఉద్యోగుల డాటాను ఈపిఎఫ్ఓకు నివేదించేందుకు యజమాన్యాలకు మే 31వ దాకా గడువు పెంచింది. అదే విధంగా తమకు కూడా పెంచాలని వీరు కోరుతున్నారు. రాష్ట్రంలో ఆర్‌టిసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసినా పాతపెన్షన్ విధానాన్ని అమలు పరిచేది లేదని ప్రభుత్వం తేల్చిచెప్పడంతో చాలా మంది ఉద్యోగులు ఈపిఎఫ్ఓ పెన్షన్‌కు దరఖాస్తు చేసుకునేందుకే మొగ్గు చూపారు. ఆర్‌టిసిలో మొత్తం 49వేల మంది ఉద్యోగుల్లో 41వేల మంది హయ్యర్ పెన్షన్ కోసం గత ఏడాది జూలై నాటికి దరఖాస్తులను చేసుకున్నారు. ఈ మేరకు హయ్యర్ పెన్షన్‌లోకి మారేందుకు ఉద్యోగుల వాటాను చెల్లించాలని దాదాపు 13వేల మందికి డిమాండ్ నోటీస్‌లను పంపారు.

వున్న ఆర్థిక ఇబ్బందులతో చాలా మంది ఉద్యోగులు తమ ఈపిఎఫ్ ఖాతాలనుండి డబ్బును వెనక్కుతీసుకున్న వారే ఎక్కువ వుండటంతో ఉద్యోగులు గడువును పెంచాలని కోరుతున్నా కేంద్ర ప్రభుత్వం ఏ మాత్రం స్పందించిన పరిస్థితి వుంది. మరోవైపు చాలా సంస్థల్లోని కార్మికులు, ఉద్యోగులకు హయ్యర్ పెన్షన్ కోసం దరఖాస్తులను చేసుకున్నా ఆయా సంస్థలు ఫార్ములా సరిగా లేదనే సాకుతో ఇన్నాళ్లూ ఉద్యోగుల డాటాను యజమాన్యాలు అప్‌లోడ్ చేయని పరిస్థితి వుంది. డిసెంబర్ 31లోపు డాటాను తమకు చేర్చాలని ఈపిఎఫ్ఓ నుండి సర్క్యులర్‌లను పంపినా ఫలితం లేకపోవడంతో మే 31 దాకా గడువును పెంచుతూ ఇటీవల ఉత్తర్వులు జారీ అయ్యాయి, యజమాన్యాలకు గడువును పెంచినట్లు ఉద్యోగులకు కూడా కొత్తగా ఈపిఎఫ్ఓ హయ్యర్ పెన్షన్‌కు దరఖాస్తులను చేసుకునేందుకు అవకాశం కల్పించాలని ఆర్‌టిసి ఉద్యోగ సంఘాలు కోరుతున్నాయి.

గుంటూరు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

భగ్గుమన్న ఉద్యోగులు

(మొదటిపేజీ తరువాయి)

ఆందోళనకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం 16 రోజులుగా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు సమ్మె చేస్తున్నారని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టకుండా వారిని నిందించే విధంగా మాట్లాడడం గర్హనీయమని తెలిపారు.

మహిళా ఉద్యోగులను అవమానిస్తూ వ్యాఖ్యానించిన వ్యక్తి ఆ పదవికి అనర్హుడని పేర్కొన్నారు. కాబట్టి తక్షణం డైరెక్టర్‌పై చట్టపరమైన, శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పార్టీ ఆదేశిస్తే ఆంధ్రలోనే కాదు, అండమాన్ లోనైనా పని చేస్తా: వైఎస్ షర్మిల

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

వైఎస్ఆర్ తెలంగాణ పార్టీని కాంగ్రెస్ పార్టీలో విలీనం చేసిన అనంతరం షర్మిల విలేకరులతో మాట్లాడుతూ,కాంగ్రెస్ పార్టీ ఏ బాధ్యతలు ఇచ్చినా స్వీకరిస్తాననన్నారు. పార్టీ ఆదేశిస్తే ఆంధ్రప్రదేశ్ కాదు, అండమాన్ లోనైనా పని చేస్తానని అన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ ఎక్కడ పోటీ చేయమంటే అక్కడ పోటీ చేస్తానని చెప్పారు.. పార్టీలో తనకు ఏ బాధ్యత ఇస్తారనేది రెండు రోజుల్లో తెలుతుందని చెప్పారు. రాహుల్ గాంధీని ప్రధానిగా చూడాలన్నది తన తండ్రి రాజశేఖర్ రెడ్డి ఆశయమన్నారు. రాహుల్ గాంధీని ప్రధాని చేయడం కోసం పార్టీలో చేరానని, అందుకోసం పని చేస్తానని పేర్కొన్నారు. ఒక క్రిస్టియన్ గా మణిపూర్ లో చర్చిల కూల్చివేత తనను తీవ్రంగా బాధించిందని, సెక్యులర్ పార్టీ అధికారంలో లేకపోతే ఏం జరుగుతుందనడానికి ఇదొక నిదర్శనమని బిజెపిపై పరోక్షంగా విమర్శలు గుప్పించారు. భారత్ జోడో యాత్ర తనతో పాటు ప్రజలందరిలో రాహుల్ గాంధీ పై నమ్మకాన్ని పెంచిందన్నారు.

ఎపిలో జగన్ ఓటమి ఖాయం: మాణిక్కం ఠాకూర్

ఏపిలో సిఎం జగన్ ఓటమి ఖాయమని ఏపి కాంగ్రెస్ ఇంచార్జ్ మాణిక్కం ఠాకూర్ అన్నారు. వైసిపి గ్రౌండ్ కోల్పోతుందని, ఆ పార్టీని జగన్ పార్టీగా మాత్రమే పిలుస్తున్నారని చెప్పారు.

ఏపిలో ఇండియా ఫోరమ్‌లో ఉన్న పార్టీలతో పొత్తులు ఉంటాయని సూచాయగా వెల్లడించారు. చంద్రబాబు నాయుడు పాలనకు కాంగ్రెస్ వ్యతిరేకమని, వైఎస్ఆర్ పేరును వచ్చే ఎన్నికల్లో ఉపయోగించుకుంటామని చెప్పారు.

పార్టీ కోసం పిసిసి పదవిని వదులుకునేందుకు సిద్ధం: గిడుగు రుద్రరాజు

పార్టీ కోసం తన పిసిసి పదవిని వదులుకునేందుకు సిద్ధంగా ఉన్నానని ఎపిసిసి అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు అన్నారు. గాంధీ కుటుంబం త్యాగం ముందు తన త్యాగం ఓ లెక్కా అని అన్నారు. షర్మిల చేరిక కాంగ్రెస్ పార్టీకి బలం ఇస్తుందన్నారు. రాష్ట్రంలో జగన్‌ను, కేంద్రంలో మోడీని ఓడించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.

కాంగ్రెస్‌లో చేరిన అనంతరం యుపిఎ అధినేత్రి సోనియాగాంధీతో వైఎస్ షర్మిల

ఇడిఎక్స్, ఎల్‌ఎల్‌సితో ఒప్పందం అమల్లోకి..

- ఉత్తర్వులు విడుదల చేసిన ఉన్నత విద్యాశాఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉన్నత విద్యాశాఖ ఇటీవల అమెరికా కంపెనీతో చేసుకున్న ఒప్పందం అమల్లోకి వచ్చింది. ఆగస్టు 17న ఇడిఎక్స్ ఎల్ఎల్‌సి సంస్థతో వాణిజ్యేతర ఒప్పందం కుదుర్చుకుంది. ఉన్నత విద్యలో నాణ్యత పెంపుదలకు, విద్యానైపుణ్యం ప్రోత్సాహకంలో భాగంగా ఈ ఒప్పందం చేసుకున్నట్లు పేర్కొంది. ఈ ఒప్పందం అమలు చేస్తూ విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి జె శ్యామలరావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నత విద్యను అభ్యసిస్తున్న 12 లక్షల మంది విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునేలా ఎడ్యుకేషన్ సబ్ స్క్రిప్షన్ కేటలాగ్ పేరుతో ఒప్పందం కుదుర్చుకుంది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్, డేటామైనింగ్, డేటా అనలటిక్స్, వర్చువల్ రియాలిటీ, క్లౌడ్ కంప్యూటింగ్‌లో శిక్షణ ఇచ్చేలా ఈ కంపెనీతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. నామినేషన్ ప్రాతిపదికన ఈ సంస్థకు 6 మిలియన్ యూఎస్ డాలర్లు (సుమారు రూ.49.94 కోట్లు) చెల్లించనుంది. ఏడాది పాటు ఈ ప్రాజెక్టు ఉంటుంది. ఉన్నత విద్యామండలి ఈ ప్రాజెక్టుకు నోడల్ ఏజెన్సీగా వ్యవహరించనుంది.

లుక్ ఔట్ రద్దు చేయండి

- హైకోర్టులో ఎన్ఆర్ఐ యశస్వి

ప్రజాశక్తి-అమరావతి

సిఐడి జారీ చేసిన లుక్ ఔట్ సర్క్యులర్‌ను రద్దు చేయాలని కోరుతూ తెనాలికి చెందిన ఎన్ఆర్ఐ బొద్దులూరి యశస్వి దాఖలు చేసిన కేసులో కౌంటర్ దాఖలు చేయాలని సిఐడికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఈ నెల తొమ్మిదికి వాయిదా వేస్తున్నట్లు జస్టిస్ బిఎస్ భానుమతి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా, ప్రభుత్వ ప్రతిష్టకు భంగం కలిగించేలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారనే అభియోగాలతో యశస్వికి సిఐడి 41ఎ నోటీసు జారీ చేసింది. లుక్ ఔట్ సర్క్యులర్‌ను కూడా జారీ చేసింది. పిటిషనర్ తరపున న్యాయవాది వివిజి ఉమేష్‌చంద్ర వాదిస్తూ.. ఇప్పటికే పిటిషనర్‌ను సిఐడి అధికారులు అరెస్టు చేశారని, 41ఎ నోటీసు కూడా ఇచ్చారని చెప్పారు. లుక్ ఔట్ సర్క్యులర్‌ను ఎత్తివేయాలని కోరారు. దీనిపై సిఐడి వాదనల తర్వాతే తగిన ఉత్తర్వులు జారీ చేస్తామని హైకోర్టు ప్రకటించింది.

జగన్ వెంటే మేము : పెద్దిరెడ్డి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

రాజకీయాల్లో మార్పులు, చేర్పులు సహజమని, తమ నేత జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని, వచ్చే ఎన్నికల్లో ఆయన్ను సిఎం చేయడమే లక్ష్యంగా పని చేస్తామని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. చిత్తూరు జిల్లా కేంద్రంలోని నాగయ్య కళాక్షేత్రంలో గురువారం నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జగన్ సోదరి షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరినా వైఎస్ఆర్‌సిపి నుంచి వెళ్ళేవారు లేరని స్పష్టం చేశారు. కాంగ్రెస్, టిడిపి పార్టీలు ఎన్ని వచ్చినా తాము ముఖ్యమంత్రి వెంటే నడుస్తామని స్పష్టం చేశారు. కుటుంబాలను చీల్చి రాజకీయం చేసే నైజం సోనియా గాంధీ, చంద్రబాబుదని విమర్శించారు. పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు పార్టీపై చేసిన వ్యాఖలపై స్పందిస్తూ జడ్‌పిటిసిగా ఓడిపోయిన ఎంఎస్ బాబుకు పూతలపట్టు టికెట్ ఇచ్చి గెలిపించేందుకు ఎంతో కృషిచేశామని, అలాంటిది ఆయన పార్టీకి విశ్వాసంగా ఉండాల్సింది పోయి అనుచితంగా మాట్లాడడం సరికాదని అన్నారు. ఇప్పటికైనా పార్టీపై విశ్వాసం చూపితే ఆదరిస్తామని తెలిపారు. ఆయన వెంట ఎంపి రెడ్డప్ప, ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు ఉన్నారు.

ఆ ఖాతాలపై కనీస నిల్వ ఛార్జీలు వద్దు :ఆర్‌బిఐ

ముంబయి : రెండేళ్లకు పైగా ఎలాంటి లావాదేవీలు లేకుండా ఇన్‌ఆపరేటివ్‌గా ఉన్న ఖాతాల్లో కనీస నిల్వలు లేవంటు జరిమానా ఛార్జీలు వేయవద్దని బ్యాంక్‌లకు ఆర్‌బిఐ ఆదేశాలు జారీ చేసింది. అదే విధంగా స్కాలర్‌షిప్ నగదును పొందడం కోసం లేదా ప్రత్యక్ష నగదు బదిలీల కోసం తీసుకున్న ఖాతాల్లో రెండేండ్లకుపైగా ఎలాంటి లావాదేవీలు జరగకుంటే వాటిని ఇన్‌ఆపరేటివ్ ఖాతాలుగా పేర్కొనరాదనీ స్పష్టం చేసింది. అన్‌క్లెయిమ్డ్ బ్యాంక్ డిపాజిట్లను తగ్గించే చర్యల్లో భాగంగా ఇన్‌ఆపరేటివ్ ఖాతాలపై విడుదల చేసిన తాజా సర్క్యులర్‌లో ఆర్‌బిఐ ఈ సూచనలు చేసింది. ఏప్రిల్ 1 నుంచి ఈ కొత్త మార్గదర్శకాలు అమల్లోకి రానున్నాయి.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE AND JMFC AT ANEKAL

O.S. No. 873/2019

BETWEEN: Mrs. Sandhya Anthraper Kurishingal ...Plaintiff
AND : Mr. Vinod Vijaykumar and Others ...Defendants

NOTICES / SUMMONS UNDER ORDER V RULE 20 (1-A) OF THE CODE OF CIVIL PROCEDURE, 1908 TO DEFENDANT No.2

Defendant No.1 : Mr. Vinod Vijaykumar, (erstwhile Partner of M/s Windsor Wings Developers), Residing at 44A Aspern Grove, London NW32BX

Defendant No.2 : Mrs. Manju Kathuria, (erstwhile Partner of M/s Windsor Wings Developers), W/o Mr. Virendra Kathuria, Sompur Gate, Sarjapur Road, Bengaluru - 562 125.

Defendant No.5 : Mr. M. Shivananda (Partner), M/s Fortune Projects, The Fortune Group, #67 Queens Road, Tasker Town, Bengaluru - 560 051

Defendant No.6 : Mr. D.V. Bhuvanesh (Partner), M/s Fortune Projects, The Fortune Group, #67 Queens Road, Tasker Town, Bengaluru - 560 051.

Defendant No.37 : Haritha Chandaluri, W/o Mr. Satyanarayana Gupta Chandaluri, Residing at House No. 1-3-220, Near 4 Electric Poles, Vidyadhara Puram, Vijayawada-12, Andhra Pradesh.

Defendant No.38 : Mr. Jemil Cheriyan, S/o Mr. C Cheriyan, Residing at No.203, Brigade Vista, Gowdanapalya, Uttarahalli Road, BSK-III Bengaluru - 560 061.

Defendant No.39 : Mrs. Anupa Thomas, W/o Mr. Jemil Cheriyan, Residing at No.203, Brigade Vista, Gowdanapalya, Uttarahalli Road, BSK-III Bengaluru - 560 061.

Defendant No.40 : Mr. Dharmendra Kumar, S/o Mr. Narayan Rajan Kumar, Flat No. 623B, Ranka Colony, Bannerghatta Road, Bilekahalli, Bengaluru - 560 076.

Defendant No.41 : Mr. Shivprashant Sood , S/o Mr. Sh. Gopal Sood, No. 56, 7th B Cross, 4th B Block, Koramangala, Bengaluru - 560034.

Whereas the above named Plaintiff has filed the above suit against you for Partition and securing mense profits and other reliefs in respect of the Schedule 'A' Property before the II Additional Senior Civil Judge & JMFC at Anekal in O.S. No. 873/2019. The above case is posted for your appearance.

You are hereby summoned to appear in person or through an advocate / pleader before this Hon'ble Court **on the 07th day of February 2024 at 11 a.m.** to answer the case made out as against you. Failing which the above case will be heard and determined as ex-parte.

SCHEDULE 'A' PROPERTY

All that piece and parcel of converted land being portion of land bearing Sy. No. 24/1 measuring 8 guntas, Sy. No. 24/4 measuring 2 acres 30 guntas and Sy. No. 29 measuring 4 acres 10 guntas all situated at Gopasandra Village, Sarjapura Hobli, Anekal Taluk, and bounded as follow:
East by : Land belonging to Lakshmaiah Reddy
West by : Land belonging to Narayana Reddy
North by : Land belonging to Chikkapullappa
South by : Land belonging to Rajappa

SCHEDULE 'B' PROPERTY

All that piece and parcel of contiguous converted lands including Schedule 'A' Property measuring an extent of 50 acres all situated at Gopasandra Village, Sarjapura Hobli, Anekal Taluk, Bangalore Urban District.

Given under my hand and seal of the Court on the 3rd day of January 2024 at Anekal.

By order of the Court, Chief Ministerial Officer, Senior Civil Judge & JMFC at Anekal.
Mr. Ajesh Kumar Shankar, Advocate
Having office at 301, Sunrise Chambers #22, Ulsoor Road, Bengaluru - 560042.

19న యుఇఇయు గ్రేడ్ -2 జెఎల్‌ఎం మహాధర్నా

- జయప్రదం చేయండి : సిహెచ్ నర్సింగరావు

ప్రజాశక్తి-నెల్లూరు

ఈ నెల 19న తిరుపతిలో జరగనున్న యుఇఇయు గ్రేడ్ 2 జెఎల్ఎంల (ఎనర్జీ అసిస్టెంట్లు) మహాధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు కోరారు. నెల్లూరు జిల్లా డాక్టర్ జెట్టిశేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో రసూల్ అధ్యక్షతన రాష్ట్ర ముఖ్య కార్యకర్తల సమావేశం గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిహెచ్ నర్సింగరావు మాట్లాడారు. ఎనర్జీ అసిస్టెంట్లు విద్యుత్తు ఉద్యోగులేనని తెలిపారు. డిస్కంల నోటిఫికేషన్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 7329 మంది రిక్రూట్‌మెంట్ అయ్యారని తెలిపారు. వీరికి జీతభత్యాలు డిస్కంలు చెల్లిస్తున్నాయన్నారు. ఎస్ఆర్‌లు డివిజన్ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కంట్రోల్‌లో ఉంటాయని, వీరు సెక్షన్ ఆఫీసర్ కంట్రోల్‌లో పనిచేస్తుంటారన్నారు. అందువల్ల డిపార్ట్‌మెంట్లు జూనియర్ లైన్‌మెన్లకు వర్తించు అన్నీ అలవెన్స్‌లు, బేసిక్ వీరికి వర్తింప చేయాలని, రెండేళ్లకే ప్రొబిషనరీ డిక్లరీ చేయాల్సి ఉండగా నాలుగున్నర సంవత్సరమైనా చేయకపోవడం విద్యుత్తు అధికారుల నిర్లక్ష్యమని విమర్శించారు. ఎనర్జీ అసిస్టెంట్లకు ప్రొబిషనరీ డిక్లర్ చేసి ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. యుఇఇయు రాష్ట్ర అధ్యక్షులు దుగ్గిరాల సూరిబాబు మాట్లాడుతూ గ్రేడ్ 2 జెఎల్‌ఎంలు విధి నిర్వహణలో రాష్ట్ర వ్యాప్తంగా 212 మంది చనిపోయారన్నారు.

వారందరికీ వర్క్‌మెన్ కాంపెన్‌జేషన్, కుటుంబంలో ఒకరికి జెఎల్‌ఎం ఉద్యోగం ఇవ్వాలని కోరారు. పై డిమాండ్ల సాధన కోసం జనవరి 19వ తేదీ తిరుపతిలోని ఎస్‌పిడిసిఎల్ ఆఫీసు ఎదుట మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం రాష్ట్ర కన్వీనింగ్ కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్లుగా నెల్లూరు జిల్లాకు చెందిన పి పెంచల ప్రసాద్, అంబటి సుధీర్, ఎస్‌కె రసూల్, వై సునీల్‌కుమార్, కడపకు చెందిన సి అశోక్‌కుమార్, ఎం వెంకటరమణ, విజయవాడకు చెందిన పూర్ణ చంద్ర, సత్యనారాయణ, పి రాజశేఖర్ (ఎన్‌టిఆర్ జిల్లా), డి నారాయణరావు (గుంటూరు), జి అప్పలరాజు (విశాఖపట్నం), పి హరి (ఆత్మకూరు), శ్రావణ్‌కుమార్ (కావలి), ఎం వెంకటేశ్వర్లు (కోవూరు) వీరిని జిల్లాల వారీగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో యుఇఇయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి సుదర్శన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు

నవరత్నాల ఇళ్లు అందేదెప్పుడు ?

నత్తనడకన 13 లక్షల ఇళ్ల పురోగతి

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

నవరత్నాల్లో భాగంగా చేపట్టిన పేదలందరికీ ఇళ్లు ఎప్పటికి పూర్తవుతాయో తెలియని స్థితి నెలకొంది. రాష్ట్రంలో మొత్తం 30.65 లక్షల ఇళ్లను నిర్మించేందుకు నవరత్నాల్లో భాగంగా ప్రభుత్వం నిర్ణయించింది. దీనికోసం రూ. 83,455 కోట్ల రూపాయలను ఖర్చు చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగానే తొలి రెండు దశల్లో 19.13 లక్షల ఇళ్ల నిర్మాణానికి అనుమతులు కూడా ఇచ్చారు. వీటికి రూ. 41,142 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేశారు. ఈ మొత్తం ఇళ్లను త్వరగా పూర్తిచేసి లబ్ధిదారులకు అందించాలని ప్రభుత్వం భావిస్తోంది. అయితే క్షేత్ర స్థాయిలో మాత్రం ఇళ్ల నిర్మాణం నత్తనడకన సాగుతున్నట్లుల విమర్శలు వస్తున్నాయి. రెండు దశల నిర్మాణాల్లో కనీసం 30 శాతం కూడా పూర్తికాలేదని నివేదికలు చెబుతున్నాయి. ఆరు లక్షల ఇళ్ల పనులు మాత్రమే పూర్తయినట్లు ఈ నివేదికలు స్పష్టం చేస్తుండగా, గత అక్టోబర్‌లో 7.43 లక్షల ఇళ్లను నేరుగా ముఖ్యమంత్రి ప్రారంభించినట్లు ప్రభుత్వం ప్రకటించింది. అలాగే వచ్చే నెలలో ఇంకో ఐదు లక్షల ఇళ్లను కూడా ప్రారంభించి, లబ్ధిదారులకు అందించాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. పూర్తయినట్లు చెబుతున్నవే ఆరు లక్షల ఇళ్లయితే 12 లక్షలకు పైగా ఎలా ప్రారంభిస్తున్నారన్నది చర్చనీయాంశంగా మారింది.

గృహ నిర్మాణశాఖ చెబుతున్న లెక్కలమేరకు తొలి రెండు దశల్లో 19,13,604 ఇళ్లను మంజూరు చేశారు. ఇందులో కేవలం 6,28,406 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. మరో 1,02,884 ఇళ్లు రూఫ్ స్థాయిలో, మరో 3,87,091 ఇళ్లు పునాది స్థాయిలో, ఇంకో 6,66,980 ఇళ్లు పునాదికి దిగువ స్థాయిలో ఉన్నాయని లెక్కలు చెబుతున్నారు. 1,28,243 ఇళ్లు ఇంకా ప్రారంభంకాలేదని అధికారులు చెబుతున్నారు.

సాధారణ ఎన్నికల నిర్వహణపై పటిష్ట కార్యాచరణ : సిఎస్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రానున్న సాధారణ ఎన్నికలను పటిష్టంగా, సక్రమంగా నిర్వహించేందుకు వీలుగా సంబంధిత శాఖలు ఇప్పటి నుండే తగిన కార్యాచరణ సిద్ధం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి అన్నారు. ఎన్నికల సన్నద్ధతపై గురువారం వెలగపూడి సచివాలయంలో ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులతో సహా ఎన్నికల విధుల్లో నేరుగా సంబంధం ఉన్న వివిధ అధికారుల ఖాళీల భర్తీతోపాటు రాష్ట్ర, సిబ్బంది భర్తీపై రాష్ట్ర ఎన్నికల అధికారితో చర్చించారు. వెంటనే సంబంధిత ప్రతిపాదనలు పంపాలని, కొత్తవారికి పోస్టింగు ఇవ్వడంపైనా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో డబ్బు, మద్యం వంటి అక్రమ రవాణా నియంత్రణకు సంబంధిత శాఖల అధికారులు సిబ్బందితో అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని అన్నారు. ముఖ్యంగా ఎపి, ఒడిశా సరిహద్దులపై త్వరలో సమన్వయ సమావేశం నిర్వహించాలని సూచించారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా మాట్లాడుతూ.. సన్నాహకాలపై చర్చించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ఈ నెల 9, 10 తేదీల్లో రాష్ట్రానికి రానుందని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రావత్, సేల్స్ ట్యాక్స్ చీఫ్ కమిషనర్ గిరిజా శంకర్, అదనపు పిసిసిఎఫ్ గోపీనాథ్, ఎస్ఇబి డైరెక్టర్ ఎం రవి, రవాణాశాఖ కమిషనర్ మనీష్‌కుమార్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు బి రాజశేఖర్, రజత్ భార్గవ, ప్రిన్సిపల్ సెక్రటరీ శ్యామలరావు తదితరులు పాల్గొన్నారు.

బిసి నేతలకు టిడిపి విశ్వవిద్యాలయం

- జయహో బిసి వర్క్‌షాప్‌లో చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బిసి నాయకులను ఎందరినో తెలుగుదేశం పార్టీ తయారుచేసిందని ఆ పార్టీ అధినేత చంద్రబాబునాయుడు అన్నారు. టిడిపి కార్యాలయంలో గురువారం జరిగిన 'జయహో బిసి' కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ బిసిలకు తెలుగుదేశం పార్టీ ఒక విశ్వవిద్యాలయం లాంటిదని అన్నారు. బిసిలను ఎంఎల్‌ఏలుగానూ, ఎం.పిలుగానూ తయారు చేసిన ఫ్యాక్టరీగా టిడిపిని ఆయన అభివర్ణించారు. ఉన్నత స్థాయిలో ఉండే ప్రతి వందమందిలో 50 మంది బిసిలే ఉండేలా చేసే బాధ్యత తనదని అన్నారు. పన్నుల రూపంలో జగన్ బలహీన వర్గాల రక్తం తాగుతున్నారని విమర్శించారు. వైసిపి పాలనలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, విజయ సాయిరెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి, వైవి సుబ్బారెడ్డి బాగుపడ్డారని, జగన్ కంపెనీలే లబ్ధిపొందాయని ఆరోపించారు. బుద్ధి, జ్ఞానం లేకుండా విద్యుత్ ఛార్జీలు పెంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ పనైపోయిందని, మరలా గెలిచే అవకాశం లేదన్నారు. జనాభాలో 50శాతం ఉన్న బిసిలకు రాజకీయ ప్రాధాన్యత, ఆర్థిక వెసులుబాటు కల్పించి న్యాయం చేసిన వ్యక్తి ఎన్టీఆర్, టిడిపి మాత్రమే అని చెప్పారు. స్థానిక సంస్థల్లో 20శాతం రిజర్వేషన్లు ఎన్టీఆర్ ప్రవేశపెడితే తాను 34శాతానికి పెంచానని తెలిపారు. వైసిపి ప్రభుత్వం 24శాతానికి తగ్గించి అన్యాయం చేసిందని విమర్శించారు. బిసిలు టిడిపి వెంట ఉన్నారనే అక్కసుతో వారిపై జగన్ దండయాత్ర చేస్తున్నారని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు విమర్శించారు. జగన్ ఇచ్చిన కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు నాలుక గీసుకోడానికి కూడా పనికిరావని, ఒక్కరికి కూడా రుణాలు ఇచ్చిన్నట్లు నిరూపిస్తే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని అన్నారు. టిడిపి అధికారంలోకి వస్తేనే బిసిలకు అభివృద్ధి ఉంటుందని పొలిట్ బ్యూరోసభ్యులు యనమల రామకృష్ణుడు అన్నారు. జగన్ వచ్చాక నిధులు, విధులు లాక్కున్నారని టిడిపి బిసి సాధికార సమితి అధ్యక్షులు కొల్లు రవీంద్ర అన్నారు. పార్టీ నాయకులు కాల్వ శ్రీనివాసులు, గౌతు శిరీష, దువ్వారాపు రామారావు, కొనకళ్ల నారాయణ, గణబాబు, పితాని సత్యనారాయణ, కె శివబాల తదితరులు ఈ కార్యక్రమంలో ప్రసంగించారు. అనంతరం జయహో బిసి ప్రచార రథాలను జెండా ఊపి చంద్రబాబు ప్రారంభించారు. 175 నియోజకవర్గాల్లో బిసి నేతలు పర్యటించి టిడిపి ఏం చేసింది, మరలా అధికారంలోకి రాగానే ఏం చేయబోతోంది, బిసిలకు జగన్ చేసిన అన్యాయం గురించి క్షేత్రస్థాయిలో వివరించాలని చంద్రబాబు చెప్పారు.

జయహో బిసి ప్రచార రథాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న చంద్రబాబు

మళ్లీ రుణ సంక్షోభంలో కాఫీ డే

- రూ.434 కోట్లకు చేరిక.. అప్పులు తీర్చలేక డీఫాల్ట్
- నోటీసులిచ్చిన రుణ దాతలు

న్యూఢిల్లీ : కాఫీ డే ఎంటర్‌ప్రైజెస్ రుణాల చెల్లింపుల్లో మరోమారు విఫలం అయ్యింది. 2023 డిసెంబర్ త్రైమాసికంలో పలు అప్పులు చెల్లించలేకపోవడంతో మొత్తంగా రూ.434 కోట్ల రుణాలు డీఫాల్ట్ అయ్యింది. నగదు లభ్యత సమస్యల వల్ల రుణాల చెల్లింపుల్లో జాప్యం జరిగిందని రెగ్యూలేటరీ సంస్థలకు కాఫీ డే సమాచారం ఇచ్చింది. బ్యాంక్‌లు, విత్త సంస్థల నుంచి పొందిన అప్పుల్లో గడిచిన డిసెంబర్ త్రైమాసికంలో రూ.183.36 కోట్ల అసలు (ప్రిన్సిపల్ అమౌంట్) చెల్లించలేకపోయినట్లు వెల్లడించింది. మరోవైపు రూ.5.78 కోట్ల వడ్డీ చెల్లించడంలో కూడా విఫలం అయినట్లు తెలిపింది. 2023 డిసెంబర్ 31 నాటికి నాన్ కన్వర్టేబుల్ డిబెంచర్లు, నాన్ కన్వర్టేబుల్ రీడిమెబుల్ ప్రిఫరెన్స్ షేర్స్ (ఎన్‌సిఆర్‌పిఎస్)లకు సంబంధించిన డెట్ సెక్యూరిటీలకు సంబంధించి రూ.200 కోట్ల చెల్లింపులు చేయాల్సి ఉందని తెలిపింది. వీటికి సంబంధించిన రూ.44.77 కోట్ల వడ్డీలు చెల్లించడంలో విఫలం అయినట్లు తెలిపింది.

వడ్డీ, అసలు తిరిగి చెల్లించడంలో విఫలం కావడంతో రుణదాతలు కంపెనీకి నోటీసులు పంపడం ద్వారా చట్టపరమైన చర్యలకు దిగారని తెలుస్తోంది. 2019 జులైలో కాఫీ డే వ్యవస్థాపకుడు, ఛైర్మన్ విజి సిద్ధార్థ మరణించిన తర్వాత ఆస్తుల విక్రయాల ద్వారా అప్పులను తీర్చడానికి ఆయన సతీమణి ప్రయత్నించింది. మార్చి 2020లో తన టెక్నాలజీ బిజినెస్ పార్కును విక్రయించడానికి బ్లాక్‌స్టోన్ గ్రూప్‌తో ఒప్పందం కుదుర్చుకున్న తర్వాత 13 మంది రుణదాతలకు రూ.1,644 కోట్లను తిరిగి చెల్లించారు. అయినా ఇంకొన్ని అప్పులు అలాగే మిగిలి పోయి ఉన్నాయి.

మంత్రి రజనీ ఓటు హక్కుపై వివాదం

- దరఖాస్తులో తప్పుడు చిరునామా పేర్కొన్నారని ఆరోపణ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులో మంత్రి విడదల రజనీ ఓటు దరఖాస్తు వివాదంలో చిక్కుకుంది. శ్యామలానగర్‌లో నివాసం ఉంటున్నట్టు చిలకలూరిపేట నుంచి గుంటూరు కార్పొరేషన్‌కు ఓటు బదిలీ కోసం ఆమె దరఖాస్తు చేశారు. ఆమె ఇచ్చిన చిరునామాలో అపార్ట్‌మెంట్ ఉన్నట్లు పేర్కొన్నారు. దీనిపై టిడిపి నాయకులు అభ్యంతరం తెలిపారు. ఆమె నమోదు చేసిన డోర్ నెంబరులో ఖాళీ స్థలం ఉందని, మంత్రికి గుంటూరులో ఓటు హక్కు కల్పించొద్దని అధికారులకు ఫిర్యాదు చేశారు. అయితే, మంత్రి పేర్కొన్న 9-2-98 డోర్‌నెంబరులో సాయి గ్రాండ్ అపార్ట్‌మెంట్ ఉందని మంత్రి తరుపున పలువురు కార్పొరేటర్లు తెలిపారు. డోర్ నెంబరు తప్పుగా నమోదు అయిందని చెప్పారు. మంత్రి రజనీ ఈ ప్లాట్‌ను కొనుగోలు చేసి గృహ ప్రవేశం కూడా చేశారని చెప్పారు. ఫిర్యాదుపై విచారిస్తున్నామని అధికారులు తెలిపారు.

1,506 మంది బాల కార్మికులకు విముక్తి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా ఎపి సిఐడి సోషల్ వింగ్ గతేడాది చేపట్టిన స్వేచ్ఛా కార్యక్రమం ద్వారా 1,506 బాల కార్మికులకు విముక్తి కల్పించింది. ఈ మేరకు ఎపి సిఐడి ఉమెన్ ప్రొటక్షన్ సెల్ ఎస్‌పి కెజివి సరిత 2023 వార్షిక నివేదికను విడుదల చేశారు. 2023లో ఎపి సిఐడి సోషల్ వింగ్ ద్వారా నాలుగు విడతలుగా రాష్ట్ర వ్యాప్తంగా దాడులు నిర్వహించి బాల కార్మికులకు విముక్తి కల్పించామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు ఇటుకల బట్టీలు, 39 వర్క్‌షాప్‌లు, రెండు పెయింటింగ్ వర్క్‌లో, 62 మెకానిక్ వర్క్‌షాప్‌లు, 10 హోటల్స్, 18 ఫ్యాక్టరీలతోపాటు 140 ఇతర సంస్థలపై ఆకస్మిక దాడులు నిర్వహించి 1,506 మంది బాలలకు విముక్తి కల్పించినట్లు పేర్కొన్నారు. ఇందులో బాలికలు 204, 1,302 మంది బాలురుకు విముక్తి కల్పించామని తెలిపారు. వీరిలో ఎక్కువ మంది ఆర్థిక పరిస్థితుల వల్లే చదువులు మానేసి పనులకు వెళుతున్నట్లు పేర్కొన్నారు. 897 మంది పిల్లలను బడుల్లో చేర్పించామని తెలిపారు. ఈ దాడుల్లో మొత్తం 49 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

నేటి నుంచి నిరాహార దీక్షలు

- అంగన్‌వాడీ సంఘాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అంగన్‌వాడీ సంఘాల సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం నుంచి నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు అంగన్‌వాడీ సంఘాలు ప్రకటించాయి. గురువారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి కె సుబ్బరావమ్మ, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఎఐటియుసి) ప్రధాన కార్యదర్శి జె లలితమ్మ, ఎపి ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (ఐఎఫ్‌టియు) ప్రధాన కార్యదర్శి విఆర్ జ్యోతి మాట్లాడారు. డిసెంబరు 12 నుంచి జరుగుతున్న సమ్మెకు కొనసాగింపుగా శుక్రవారం రాష్ట్ర కేంద్రంలో నిరాహార దీక్ష చేపడతామని తెలిపారు. శనివారం నుంచి అన్ని జిల్లా కేంద్రాల్లోనూ దీక్షలు ఉంటాయని వెల్లడించారు. నిర్దిష్టమైన డిమాండ్లతో 24 రోజులుగా సమ్మె జరుగుతోందని, మంత్రుల బృందంతో గానీ, సిఎస్‌తో గానీ చర్చలు జరిగినప్పటికీ వేతనాల పెంపు, గ్రాట్యుటీ అమలుకు సంబంధించి నిర్దిష్టమైన హామీ ఏదీ ఇవ్వలేదని పేర్కొన్నారు. మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా మారుస్తున్నామని హామీ ఇచ్చినప్పటికీ జిఒ ఇవ్వలేదని తెలిపారు. ఫేస్ యాప్ రద్దు, సంక్షేమ పథకాల అమలుపైనా ఎటువంటి స్పష్టతా ఇవ్వలేదని పేర్కొన్నారు. అంగన్‌వాడీ ప్రధాన డిమాండ్ల కోసం ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని వేతనాల పెంపు ప్రకటన చేయాలని కోరారు. లేనిపక్షంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో సిఐటియు అనుబంధం అంగన్‌వాడీ యూనియన్ నాయకులు జి బేబీరాణి, ఎన్‌సిహెచ్ సుప్రజ, ఎఐటియుసి అనుబంధ నాయకులు మంజుల, ఐఎఫ్‌టియు అంగన్‌వాడీ నాయకులు శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు... అండగా ఉంటాం

- బాధిత కుటుంబాలకు భువనేశ్వరి పరామర్శ

ప్రజాశక్తి - బూర్జ, ఆమదాలవలస

సాంబమూర్తి భార్యకు చెక్కును అందజేస్తున్న భువనేశ్వరి

తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు ఎప్పుడూ అండగా ఉంటామని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. నిజం గెలవాలి యాత్రలో భాగంగా చంద్రబాబు అరెస్టు సమయంలో మృతి చెందిన శ్రీకాకుళం జిల్లా జి.సిగడాం మండలం ధవళపేట, బూర్జ మండలం తోటవాడ, ఆమదాలవలస మండలం దన్నానపేట, నిమ్మతొర్లాడలోని టిడిపి కార్యకర్తల కుటుంబాలను ఆమె గురువారం పరామర్శించి ఓదార్చారు. మృతుల కుటుంబాలకు రూ.మూడు లక్షల చొప్పున చెక్కులు అందజేశారు. ఆయా కుటుంబాల స్థితిగతులు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కష్టకాలంలో పార్టీకి, తమ కుటుంబానికి అండగా నిలిచినందుకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా పర్యటనకు వచ్చిన భువనేశ్వరికి జి.సిగడాం, కొత్తూరు, ఆమదాలవలసలో టిడిపి నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపి కింజరాపు రామ్మోహన్ నాయుడు, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కిమిడి కళా వెంకట్రావు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY
Lenin Center, Governerpet, VIJAYAWADA -520002 (A.P)

E Procurement Tender Notice

NIT No.01/MAU61-USI0US(CW)/1/2024-HB, Dated: 02/01/2024.
Name of Work: "Construction of CC Drain from Anjaneya Swamy temple to New SC colony of Uddandarayuni palem village of Thullur Mandal" - Estimate Cost Rs.50.00 Lakhs.

The bid can be downloaded on AP e-procurement portal from **05.01.2024** to **19.01.2024** up to **14.00 Hrs.** Due date for submission of Bid **19.01.2024** up to 15.00 Hrs, Technical bid opening **19.01.2024 @ 16.00 Hrs.** For further details please refer to www.apeprocurement.gov.in and www.crda.ap.gov.in

Sd/- Commissioner, APCRDA

Karur Vysya Bank Smart way to bank
ది కరూర్ వైశ్యాబ్యాంకు లిమిటెడ్
తెనాలి బ్రాంచ్, 7-11-129, గోపాలరెడ్డి వీధి, గంగానమ్మపేట, తెనాలి, ఆంధ్రప్రదేశ్-522201. ఫోన్ : 08644-229060

బంగారు నగల వేలము ప్రకటన

ఈ క్రింది ఉదహరించిన ఖాతాదారుడు బంగారు నగలపై మా శాఖలో అప్పు తీసుకొని సకాలంలో తమ బకాయిలు చెల్లించని కారణంగా బ్యాంక్ నిబంధనలు ప్రకారం **తేది.17.01.2024 అనగా బుధవారం సాయంత్రం 3.00 గం॥లకు** మా బ్రాంచ్ ఆవరణలో వేలం వేసి బాకీలు వసూలు చేసుకుందామని ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

షరతులు నిబంధనలు : **1)** వేలంలో పాల్గొనదలచినవారు **రూ.5,000/-లు** ధరావత్తు కట్టి వేలంలో పాల్గొనవలెను. **2)** హెచ్చు పాటదారుడు మొత్తం సొమ్ము అదేరోజు చెల్లించి వస్తువులను పొందవలెను. **3)** నగలు బరువునకు, నాణ్యతకు బ్యాంకు వారి పూచీ ఏమాత్రం లేదు. **4)** ఏ విధమైన కారణం చూపకనే వేలం షరతులు మార్చుకొనుటకు గానీ, వాయిదా వేయుటకు గానీ, వేలం ఆపుటకు గానీ, రద్దు చేయుటకు గానీ బ్యాంకు వారికి పూర్తి అధికారం కలదు. **5)** అడ్రస్ నిర్ధారించు ఆధార్ కార్డు కాపీని గానీ, పాన్‌కార్డు కాపీని జతచేయవలెను. **6)** ఈ ఖాతాదారులలో ఎవరైననూ మరణించిన యెడల వారి వారసులకు ఈ ప్రకటన పూర్వకముగా తెలియపరచినట్లుగా భావించవలెను. **7)** అప్పు వసూలు నోటీసు అందనివారు మరియు నోటీసులు తిరస్కరించినవారు ఈ ప్రకటన తుది నోటీసుగా భావించి వేలం తేదీలోగా సొమ్ము చెల్లించవలెను. **8)** జి.ఎస్.టి. వర్తించబడును., **9)** ఆన్‌లైన్ బిడ్స్ కూడా స్వీకరించబడును.

ఖాతా నెం.	ఋణగ్రస్తుని పేరు మరియు చిరునామా	బంగారం బరువు గ్రా॥లో
1437953000014347	**తోటకూర మణికంత,** 7-1, నందివెలుగు, గుంటూరు జిల్లా, ఆం.ప్ర. -522306	8.500

తేది : 04.01.2024
ప్రదేశం : తెనాలి
సం/- అధీకృత అధికారి,
ది కరూర్ వైశ్యా బ్యాంక్ లిమిటెడ్, తెనాలి

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) సిండికేట్ Syndicate A Government of India Undertaking
విజయవాడ మెయిన్ బ్రాంచ్ (13340), విజయవాడ, ఆంధ్రప్రదేశ్.
0866-2567779, 9440905155

ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు డిమాండ్ నోటీసు

దిగువ వారికి:
(1) శ్రీ చంద్ర శేఖర్‌రావు పుప్పాల (ఋణగ్రహీత & తనఖాదారు), తండ్రి: రామజోగి, డి.నెం. 1-65-1, పరిటాల, ఎన్‌టిఆర్ జిల్లా-521180. **రెండవ చిరునామా: శ్రీ చంద్ర శేఖర్ రావు పుప్పాల, తండ్రి: రామజోగి,** సమీప డి.నెం. 9-158/2, శాంతి డ్రీమ్స్, జిఎఫ్-1, ప్రసాదంపాడు. **(2) శ్రీమతి పద్మజ పుప్పాల, భర్త: శ్రీ చంద్ర శేఖర్ రావు,** డి.నెం 11-26-14/2, పుల్లబావి వీధి, సామరంగ్‌చౌక్, విజయవాడ-1. **రెండవ చిరునామా: శ్రీమతి పద్మజ పుప్పాల, భర్త: శ్రీ చంద్ర శేఖర్ రావు,** సమీప డి.నెం. 9-158/2, శాంతి డ్రీమ్స్, జిఎఫ్-1, ప్రసాదంపాడు. **(3) ఋణగ్రహీత: శ్రీ రామ జోగి పుప్పాల, తండ్రి: కోటయ్య,** డి.నెం. 1 66, పరిటాల, కంచికచర్ల, ఎన్‌టిఆర్ జిల్లా-521180. **(4) శ్రీ బాలపిల్లి సుధాకర్ (హామీదారు), తండ్రి: ఉమా మహేశ్వరరావు,** డి.నెం. 11 19 6, మకాని వారి వీధి, పూలబావి సందు, వన్‌టౌన్, విజయవాడ-520001.

డియర్ సర్ / మేడమ్,
విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 లోని సెక్షన్ 13(2) ప్రకారం డిమాండ్ నోటీసు.

మా కెనరా బ్యాంక్, విజయవాడ మెయిన్ బ్రాంచ్ నుండి శ్రీ చంద్ర శేఖర్‌రావు పుప్పాల, శ్రీమతి పద్మజ పుప్పాల మరియు శ్రీ రామ జోగి పుప్పాల పొందిన లోన్స్ / ఋణ సౌకర్యాల వివరములు:

లోన్ స్వభావం & లోన్ అకౌంట్ నెం.	లోన్ మొత్తం మరియు లోన్ తేది	ఈ తేది నాటికి వడ్డీతో కలుపుకొని బకాయి మొత్తం	వడ్డీ రేటు
హౌమ్ లోన్ అకౌంట్ నెం. 33409740000106	రూ.26,00,000/- తేది: 26-05-2017	రూ. 26,86,271.74/-	10.70%
HL అకౌంట్ నెం. 33409350000060	రూ.50,000/- తేది: 16-04-2020	రూ. 15,634.87/-	13.85%

మాకు తనఖా పెట్టిన వ్యక్తి / వ్యక్తులచే వ్రాసి ఇవ్వబడిన సంబంధిత డాక్యుమెంట్ల ద్వారా ఈ నోటీసును షెడ్యూలులో వివరించిన ఆస్తుల తనఖా ద్వారా పైన తెలిపిన ఋణాలు / ఋణసౌకర్యాలకు తగు విధంగా హామీ కల్పించబడినది. పేర్కొన్న నియమ నిబంధనల ప్రకారం తమ ఋణాలను చెల్లించడంలో పైన తెలిపిన మీరు విఫలమైనందున బ్యాంక్ **సదరు ఋణాన్ని తేది 02.12.2023 న నిరర్ధక ఆస్తి (ఎన్.పి.ఎ) గా వర్గీకరించింది.** అందువలన ఈ నోటీసు తేది నుండి 60 రోజులలోగా **రూ.27,01,906.61/- (అక్షరాల ఇరవై ఏడు లక్షల ఒక వెయ్యి తొమ్మిది వందల ఆరు రూపాయలు మరియు అరవై ఒక్క పైసలు మాత్రమే)** + తదుపరి వడ్డీ, ఖర్చులు కలిపి మొత్తమును చెల్లించవలసిందిగా కోరుతూ సంబంధిత చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద మీకు ఇందుమూలముగా ఈ నోటీసు జారీ చేయుచున్నాము. చెల్లించడంలో విఫలమైతే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అన్ని లేదా ఏవేని హక్కును మేము వినియోగించుకుంటాము. ఇంతే కాకుండా మా ముందస్తు సమ్మతి లేకుండా ఏ విధంగానూ షెడ్యూలులో తెలిపిన ఏ సెక్యూర్డ్ ఆస్తులతో ఏ రకంగానూ వ్యవహరించకుండా మీరు నిరోధింపబడుచున్నారు. సదరు చట్టం మరియు/ లేదా అమలులో ఉన్న చట్టం క్రింద లభించే ఏవేని ఇతర హక్కుకు ఎటువంటి ప్రతికూల అభిప్రాయం లేకుండా ఈ నోటీసు ఇవ్వబడింది.

SARFAESI చట్టం నందలి సెక్షన్ 13, సబ్ సెక్షన్ (8) ప్రకారము మీరు తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరని సూచించడమైనది. మా బ్రాంచ్ రికార్డులో అందుబాటులో ఉన్న మీ చిరునామాకు తిరుగు రశీదుతో కూడిన రిజిష్టర్డ్ పోస్టు ద్వారా డిమాండ్ నోటీసు పంపించడం జరిగింది.

తనఖా / తాకట్టు వుంచిన ఆస్తి యొక్క నిర్దిష్ట వివరాలు దిగువ పేర్కొనబడినవి

ఎ-షెడ్యూల్: కృష్ణా జిల్లా, గన్నవరం సబ్-రిజిస్ట్రీ, విజయవాడ రూరల్ మండలం, ప్రసాదంపాడు గ్రామపంచాయితీ మరియు గ్రామం, సమీప డి.నెం. 9-158/2, ఆర్.ఎస్. నెం.79/14 నందు మొత్తం 438 చ॥గ॥ లేదా 366.21 చ॥మీ॥లలో అవిభాజ్యపు మరియు అనిర్దేశపు 27.37 చ॥గ॥ లేదా 22.884 చ॥మీ॥ వాటా స్థలం. **హద్దులు:** తూర్పు: సిహెచ్. పూర్ణచంద్రరావు మరియు వై. రాంబాబు ఆస్తి, దక్షిణం: వి. దుర్గా సౌజన్య ఆస్తి, పడమర: పీటర్ సింగ్ చర్చి రోడ్డు, ఉత్తరం: జి. సీతారామయ్య మరియు జి. నాగేశ్వరరావు ఆస్తి.

బి-షెడ్యూల్: పైన తెలిపిన ఎ-షెడ్యూల్ మొత్తం స్థలంలో నిర్మించిన గ్రూప్ హౌస్ "శాంతి డ్రీమ్స్", అపార్ట్‌మెంట్ గ్రౌండ్‌ఫ్లోర్‌లో 850 చ.అ.ల ప్లింత్ ఏరియా, 150 చ.అ.ల ఉమ్మడి ఏరియా మరియు 70 చ.అ.ల పార్కింగ్ ఏరియా కలిగిన **ఫ్లాట్ నెం. జిఎఫ్-1. హద్దులు:** తూర్పు: ఉమ్మడి మెట్లు మరియు ఉమ్మడి వరండా, దక్షిణం: శూన్యాకాశం, పడమర: శూన్యాకాశం, ఉత్తరం: షెడ్యూల్ ఫ్లాట్ మరియు ఫ్లాట్ నెం. జిఎఫ్-2 మధ్య ఉమ్మడి గోడ.

తేది:21.12.2023,
ప్రదేశం: విజయవాడ
సం/- అధీకృత అధికారి,
కెనరా బ్యాంక్

సంపాదకీయం

చావుల్లేని చదువులు కావాలి!

ఎంతో వెలుగుల భవితవ్యాన్ని చూడాల్సిన విద్యార్థులు అర్థాంతరంగా జీవితాలను ముగించుకోవడం అత్యంత బాధాకరం. నయా ఉదారవాద ఆర్థిక విధానాలు ప్రభుత్వ విద్యకు గండి కొట్టి, కార్పొరేటుకు పట్టం కట్టి, సమిష్టి భావన స్థానే వ్యక్తివాదానికి పాదులు తీసిన పరిణామాల అన్నింటి పర్యవసానమే ఇది. నిన్నగాక మొన్న బెంగళూరులో ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడింది. దానికి కొద్ది రోజుల ముందు ఢిల్లీలో ఐఐటి విద్యార్థి రైలు కింద పడి, ప్రాణాలు తీసుకున్నాడు. నీట్, ఐఐటి వంటి కోర్సుల్లో సీట్ల కోసం శిక్షణ ఇచ్చే రాజస్థాన్‌లోని కోటా కోచింగ్ సెంటర్లలో ఆత్మహత్యలు పరిపాటి అయ్యాయి. ఒక్క 2023లోనే అక్కడ 26 మంది విద్యార్థులు బలవన్మరణానికి పాల్పడ్డారు. జాతీయ నేర గణాంకాల సంస్థ (ఎన్‌సిఆర్‌బి) సమాచారం ప్రకారం... 2022లో దేశం మొత్తమ్మీద 13,044 మంది విద్యార్థులు బలవంతంగా ప్రాణాలు తీసుకున్నారు.

నవ్వుతూ తుళ్లుతూ చదువుల పర్వాన్ని సాగించాల్సిన తరుణం నేటితరం విద్యార్థులకు ఎందుకని చీకటి కుహరంగా మారుతుంది? ఇరవై ఏళ్ల క్రితం ఇంతగా లేని ఆత్మహత్యలు ఇప్పుడెందుకు ఏడాదికి వెయ్యికి పైబడి చోటు చేసుకుంటున్నాయి? దేశంలో వేళ్లూనుకున్న నయా ఉదారవాద ఆర్థిక విధానాలు విద్యారంగాన్ని పూర్తిగా వ్యాపారమయం చేశాయి. సమాజ ఉత్థాన పతనాలను, చరిత్ర ఆటుపోట్లను వివరించి, ఆత్మస్థైరాన్ని పెంచే సామాజిక శాస్త్రాల బోధన అవసరమే లేదని తేల్చి పడేశాయి! తీవ్రమైన పోటీ, ఒత్తిడి గొప్ప ఫలితాలను ఇస్తాయన్న యాంత్రిక ధోరణిని విద్యార్థులపై మోపాయి. దీనికితోడు సందట్లో సడేమియాలా జొరబడుతున్న విద్య కాషాయీకరణ విద్యార్థుల్లో ప్రశ్నించే స్వభావాన్ని నిర్వీర్యం చేస్తోంది. నవోత్తేజంతో ఉరకలు వేయాల్సిన విద్యార్థిలోకం వీటన్నిటి మూలంగా నిస్తేజితమవుతోంది. ఒత్తిడిని తట్టుకోలేని, వైఫల్యాన్ని అంగీకరించలేని నీరస గళంగా మారుతోంది. కోటాలో ఆత్మహత్యల నేపథ్యంలో నియమించిన భవానీ సింగ్ దేథా కమిటీ కూడా అదే విషయాన్ని నొక్కి వక్కాణించింది.

సమాజంలో చదువులు ఎప్పటినుంచో ఉన్నప్పటికీ- ఈ ఇరవై ఏళ్లలోనే ఇలాంటి విపరీతాలు చోటు చేసుకుంటున్నాయి. దీనిని లోతుగా విశ్లేషిస్తే- విద్య, వైద్యం తదితర రంగాలకు నూతన ఆర్థిక విధానాలు చేసిన చేటు ఏమిటో అర్థమవుతుంది. ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేయడం; కార్పొరేటు విద్యాసంస్థలు విచ్చలవిడిగా విస్తరించే అవకాశాలు కల్పించటం; ప్రయివేటు, కార్పొరేటు చదువులతోనే భవిష్యత్తు వెలిగిపోతుంది అన్న భావనను పెంపొందించటం గడిచిన మూడు దశాబ్దాల్లో విపరీతంగా జరిగిపోయింది. లక్షలు పోసి పిల్లలను చదివిస్తున్న సగటు మధ్య తరగతి కుటుంబాల ఆకాంక్షలు పిల్లల మీద క్షణ క్షణం ఒత్తిడిని రాజేస్తున్నాయి. దీనికితోడు అత్యధిక ప్రయివేటు, కార్పొరేటు విద్యాసంస్థల్లో పిల్లలను నిరంతర ఒత్తిడితో నలిబిలి చేయడం తప్ప ఎక్కడా ఉత్తేజాన్నిచ్చే ఆటపాటల జాడ లేదు. సాధించి తీరాలనే పోటీ ఉపదేశాలు తప్ప వినోద వికాసాలకు విలువ లేదు. మార్కులూ ర్యాంకుల లెక్కలతోనే విద్యాసంస్థల మూలమూలలూ పిక్కటిల్లుతున్నాయి. ఇలాంటి ఊపిరి సలపని పీడన వాతావరణంలో నిర్దేశిత లక్ష్యాలను చేరలేదనో, చేరలేమనో విద్యార్థులు తల్లడిల్లిపోతున్నారు. బతకటానికి అనేక దారులు, అవకాశాలూ ఉన్నాయన్న భరోసా, సాంత్వన వారికి లభించకుండా పోతోంది.

ఈ అసహజ, అమానవీయ చదువుల చిత్రాన్ని సమర్పించిన ఉదారవాద ఆర్థిక విధానాల చట్రాన్ని బద్దలు కొట్టాలి. అప్పుడే ఊపిరి సలపని చదువుల నుంచి విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఉపశమనం లభిస్తుంది. దీనికోసం విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, విద్యార్థి, యువజన సంఘాలూ, మేధావులూ పూనుకోవాలి. ప్రభుత్వాలు తక్షణం స్పందించి, ఇప్పటివరకూ వివిధ కమిటీలు చేసిన సిఫార్సులను అమలు చేయాలి. ఆటలూ పాటలతో కూడిన చదువు; తలకు, తనకూ బరువు కాని చదువూ విద్యార్థికి అందించాలి. పిల్లల శక్తిని, ఆసక్తిని అంచనా వేసి, తదనుగుణమైన విద్యనే అందించటానికి తల్లిదండ్రుల వైపు నుంచీ ప్రయత్నం జరగాలి. గొప్ప గొప్ప చదువులు, స్థానాలూ, సాధనలూ అవసరమైనవే! కానీ, జీవితం వాటన్నిటికన్నా ముఖ్యమైనది. అందుకనే మన విద్యావ్యవస్థను ఆమూలాగ్రం పునర్నిర్మించుకోవాలి. చావులూ, సంక్షోభాలూ లేని చదువులు నాగరిక, మానవీయ సమాజానికి నాందీవాచకాలు.

మహనీయుల మాట



"సమాజ పరివర్తనకు, దారిద్ర్య నిర్మూలనకు, ఆకలిని అంతం చేయడానికి విద్య ఒక విప్లవాత్మకమైన సాధనం. అదే విధంగా విద్య...మనిషి వ్యక్తిత్వ వికాసం, వ్యక్తి సామర్థ్యాలను పెంచే సాధనం కావాలి.

- పాలో ఫ్రీరీ,

మూఢవిశ్వాసాలు అభివృద్ధికి ఆటంకం!

కామన్ సెన్స్

డా|| దేవరాజు మహారాజు

దేవుడు ఉంటే పాలస్తీనా ఇజ్రాయిల్ మధ్య జరుగుతున్న రక్తపాతాన్ని, నరమేధాన్ని ఆపలేదు ఎందుకూ? తమ కుమారులు కొట్టుకుని చావడం దేవుడికి ఇష్టమా? యుద్ధం జరగడంలో గానీ శాంతి స్థాపనలో గానీ దేవుడి ప్రమేయం ఉండదని తెలుసుకోవాలి. దేవుడు లేడన్న సత్యాన్ని ప్రజలు తెలుసుకోలేనంత కాలం, తమ సమస్యలు తామే పరిష్కరించుకోవాలని తెలుసుకోలేనంత కాలం, 'మనుషుల్లో స్థాయీ భేదాలు లేవు, అందరిదీ ఒకే జాతి'- అని గ్రహించనంత కాలం-ప్రపంచంలో ఈ నరమేధం జరుగుతూనే ఉంటుంది.

అందువల్ల మూఢనమ్మకాలను పాటించే వారిని, ప్రచారం చేసే వారిని ఆయా మతాల సంబంధీకులు నిర్దాక్షిణ్యంగా తమ తమ మతాల నుండి బహిష్కరించాలి. అప్పుడు గానీ మతాల మీద ప్రజలకు నమ్మకం కలగదు. అప్పుడే అవి నిజమైన మతాలు అవుతాయి. లేదా చిల్లర మతాలుగా మిగిలిపోతాయి. ఈ పని చేయాల్సింది మన భారతదేశ రాజ్యాంగ స్ఫూర్తిని నిలుపుకోవడానికే! మరి మతాలే అంధవిశ్వాసాల్ని వ్యాప్తి చేస్తుంటే ఏం చేయాలి? తప్పదు-మతాల్నే త్యజించాలి. ఇంతకీ మతాలెందుకు ఏర్పడ్డాయి? అవి ఎవరి కోసం పని చేస్తున్నాయో వాటి అంతరార్థం ఏమిటో చూడండి. పురుషుడు పురుషుడి కోసం ఏర్పాటు చేసుకున్నదే మతం. వేర్వేరు మతాల్లో స్త్రీ పురుషులకు ఉన్న విలువ ఏ పాటిదో చూడండి. క్రైస్తవం ప్రకారం పురుషుడికి ఉన్న విలువలో స్త్రీ విలువ అరవై శాతమే-అని లివిటికస్ 27-3-7 చెపుతోంది. ఇస్లాం ప్రకారం (4-24) అంతకు ముందే వివాహమైన స్త్రీలను పురుషులు పెళ్ళి చేసుకోరాదు. బానిసలైతేనో లేక యుద్ధంలో గెలుచుకున్న వారైతేనో చేసుకోవచ్చు. హిందూ మతం ప్రకారం (తిన్న-9/93) పురుషులు 24-30 ఏళ్ళ వయసులో 8-12 ఏళ్లున్న బాలికల్ని పెళ్లి చేసుకోవాలని మనుస్మృతి చెప్తోంది. జుడాయిజం (తల్‌మడ్) స్త్రీ- అనుభవిస్తూ ఆనందించాల్సిన ఒక తిత్తి (వస్తువు). జైనమతం లోని దిగంబర శాఖ ప్రకారం స్త్రీలు తమ తదుపరి జన్మలో పురుషుడిగా పుడితే గాని, నిర్వాణ స్థాయికి చేరుకోరు! మార్పులు చెందుతూ వచ్చిన ఒక బుద్ధ శాఖ ప్రకారం-పురుష భిక్షులకన్నా, స్త్రీ సన్యాసులకు నిబంధనలు ఎక్కువ! జీవితంలో విఫలమైన, పురుషులు-తర్వాతి జన్మలో స్త్రీలుగా పుడతారు.

తమకు పనికొచ్చేది ఏది ఉన్నా వెంటనే దాన్ని తమ మతంలో విలీనం చేసుకోవడం బ్రాహ్మణిజానికి అలవాటు. ఇది శతాబ్దాలుగా జరుగుతూ ఉన్న విషయమే. బుద్ధుడి విగ్రహాలు మార్చి, హిందూ దేవతా విగ్రహాలుగా మార్చుకోవడం లోగడ చూశాం. ఇప్పుడు మరిన్ని కొత్త ప్రయత్నాలు జరుగుతున్నాయి. అంబేద్కర్ రెండో భార్య సవిత బ్రాహ్మణ మహిళ కావడం వల్ల, అంబేద్కర్ బ్రాహ్మణులకు ఇంటి అల్లుడు అని, ఆయనను మేము తగు రీతిలో గౌరవించుకుంటూనే ఉంటామని తిరుపతి బ్రాహ్మణ సంఘం నాయకులు రాఘవన్ అజయ్ కుమార్-ప్రమీలమ్మల ఆధ్వర్యంలో తిరుపతి పట్టణంలో తొలిసారి అంబేద్కర్ 127వ పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. స్వార్థపరులైన కొందరు రాజకీయ నాయకులు అంబేద్కర్‌కు బ్రాహ్మణ సంఘాలకు మధ్య వివాదాలు సృష్టిస్తున్నారని-అన్నారు. అంబేద్కర్ పై చదువుల కోసం ఆనాడు ఓ బ్రాహ్మణుడు తన ఇంటిని అమ్మి ఆయన్ను విదేశాలకు పంపారనీ.. ఆ వ్యక్తిని అంబేద్కర్ గురువుగా భావించే వారనీ అన్నారు. నిజమే కావచ్చు- కానీ, వైదిక/హిందూ-మతవాదులు, మను వాదులు చేసిన దాష్టీకం గురించి అంబేద్కర్ ఎన్నో రచనలు చేశారు. ఎన్నో ప్రసంగాలు చేశారు. చివరకు ఆయన హిందూ మతాన్ని వదిలి, బౌద్ధం స్వీకరించారు. బుద్ధుణ్ణి హిందూ మతంలో కలుపుకున్నట్లు, దశావతారాల్లో ఒకడిగా చేసుకున్నట్లు-ముస్లిం అయిన సాయిబాబాను హిందూ దేవుడిగా ఆరాధిస్తున్నట్టు - రేపు అంబేద్కర్‌ను కూడా దేవుణ్ణి చేసే ప్రమాదం ఉంది. మనిషిని మనిషిగా ఉండనివ్వండి రా బాబూ-మీ స్వార్థ ప్రయోజనాల కోసం, మీ పొట్ట కూటి కోసం ఎందుకు మనుషుల్ని దేవుళ్లగా చేస్తారూ? ఇక్కడ బ్రాహ్మణులను గురించి డా.బి.ఆర్.అంబేద్కర్ ఏమన్నారో చూద్దాం- "బ్రాహ్మణుడికి మతం వల్ల ఉపాధి లభిస్తుంది. కాబట్టి అతను మతం గురించే గొప్పగా మాట్లాడుతాడు. దళితులకు రాజ్యాంగం వల్ల ఉపాధి లభిస్తుంది కాబట్టి వాళ్లు రాజ్యాంగం గొప్పతనం గురించే మాట్లాడాలి. మతం గొప్పతనం గురించి కాదు-రాజ్యాంగాన్ని నమ్ముకుంటే నిన్ను చెప్రాసి నుంచి రాష్ట్రపతిని చేస్తుంది. ఒక వేళ దళితులు మతాన్ని నమ్ముకుంటే అది మళ్లీ వాళ్లను అంటరాని వాళ్లుగా- శూద్రులుగా, నిరక్షరాస్యులుగా, బానిసలుగా చేస్తుంది". మనువాదుల వల్ల, వారి కొమ్ముకాస్తున్న బహుజనుల వల్ల సమకాలీనంలో అనేక అనర్థాలు జరుగుతున్నాయి. మనిషి కేంద్రంగా, రాజ్యాంగం కేంద్రంగా నిర్ణయాలు, ఆచరణలూ ఉండి ఉంటే, దేశంలో పరిస్థితి మరో రకంగా ఉండి ఉండేది. స్వాతంత్ర్య సమరంలో ముందు నిలిచిన గాంధీజీయే, మతం విషయంలో మనువాదులను అనుసరించాడు. జస్టిస్ మార్కండేయ ఖట్జూ గాంధీజీ గురించి చెప్పిన మాటల్లో యదార్థమెంత ఉందో విశ్లేషించుకోవాలి. ఆయన "ఈశ్వర్ అల్లా తేరే నామ్'-అంటూ మత సామర స్యానికి పాటు పడ్డారే గానీ, మతాన్ని నిరసించలేదు. వైజ్ఞానిక అవగాహన గూర్చి మాట్లాడలేదు. ఆ పని, తర్వాత కాలంలో పండిట్ నెహ్రూ చేసుకుంటూ వచ్చారు.

> మతం-ఆధ్యాత్మికత-సైన్సుల పరిధులేమిటో తెలుసుకోవడానికి ఇక్కడ ఒక దృశ్యం చూపెడతాను-ఒక మత గురువు చిన్న గోచి గుడ్డ తప్ప మరేమీ లేకుండా అంటే దాదాపు నగ్నంగా కూర్చుని భక్తులకు మతం-ఆధ్యాత్మికత-దైవభక్తి గూర్చి బోధిస్తున్నాడు. అయితే అతను కళ్ళజోడు పెట్టుకుని ఉన్నాడు. మరి అది ఎందుకూ? తన ఆత్మశక్తితో ఎదురుగా కూర్చుని ఉన్న భక్తజనాన్ని చూడొచ్చు కదా? ఇక్కడ మనం అర్థం చేసుకోవాల్సిందేమంటే-మత పిచ్చి అతని గుడ్డలిప్పదీసి నగ్నంగా కూర్చోబెట్టింది. మతం అతణ్ణి అనాగరి కుణ్ణి చేసింది. ఇక కళ్ళజోడు అంటే సైన్సు-అతనికి చూపునిచ్చింది. మత పిచ్చితో గుడ్డివాడైన వాడు కూడా సైన్సుపై ఆధారపడక తప్పలేదు. ఎదురుగా ఉన్న మైకు, కళ్ళద్దాలు తీసేసి జనానికి ఏమైనా బోధించగలడా? ఆలోచించుకోవాలి! మతం గొప్పదా? విజ్ఞాన శాస్త్రం గొప్పదా అనేది అర్థం చేసుకునే వాడికి, విషయం చెప్పకుండానే అర్థమవుతుంది!

మతం-ఆధ్యాత్మికత-సైన్సుల పరిధులేమిటో తెలుసుకోవడానికి ఇక్కడ ఒక దృశ్యం చూపెడతాను-ఒక మత గురువు చిన్న గోచి గుడ్డ తప్ప మరేమీ లేకుండా అంటే దాదాపు నగ్నంగా కూర్చుని భక్తులకు మతం-ఆధ్యాత్మికత-దైవభక్తి గూర్చి బోధిస్తున్నాడు. అయితే అతను కళ్ళజోడు పెట్టుకుని ఉన్నాడు. మరి అది ఎందుకూ? తన ఆత్మశక్తితో ఎదురుగా కూర్చుని ఉన్న భక్తజనాన్ని చూడొచ్చు కదా? ఇక్కడ మనం అర్థం చేసుకోవాల్సిందేమంటే-మత పిచ్చి అతని గుడ్డలిప్పదీసి నగ్నంగా కూర్చోబెట్టింది. మతం అతణ్ణి అనాగరి కుణ్ణి చేసింది. ఇక కళ్ళజోడు అంటే సైన్సు-అతనికి చూపునిచ్చింది. మత పిచ్చితో గుడ్డివాడైన వాడు కూడా సైన్సుపై ఆధారపడక తప్పలేదు. ఎదురుగా ఉన్న మైకు, కళ్ళద్దాలు తీసేసి జనానికి ఏమైనా బోధించగలడా? ఆలోచించుకోవాలి! మతం గొప్పదా? విజ్ఞాన శాస్త్రం గొప్పదా అనేది అర్థం చేసుకునే వాడికి, విషయం చెప్పకుండానే అర్థమవుతుంది!

మతం ఆధారంగా అధికారంలో కొనసాగుతున్న నేటి కేంద్ర ప్రభుత్వ హయాంలో దేశంలో జరుగుతున్న దురాగతాలు ఎన్నని చెప్పగలం? ఎటు చూస్తే అటు లెక్కలేనన్ని ఉన్నాయి. రైల్వే-రక్షణ దళానికి చెందిన ఒక కానిస్టేబుల్ కదులుతున్న రైల్లో ముగ్గురు ముస్లింలను కాల్చి చంపాడు. మరోచోట ఒక ముస్లిం విద్యార్థిని వరుసగా క్లాసులోని తోటి విద్యార్థులంతా చెంపపై కొట్టాలంటూ ముజఫర్‌నగర్‌లో ఒక స్కూలు టీచర్ తన విద్యార్థులను ఆదేశించారు. దేశవ్యాప్తంగా కాషాయ మూకలు ముస్లిం వ్యతిరేక ప్రసంగాలు చేయడం, ముస్లింలపై దాడులకు దిగడం జరుగుతున్న నేపథ్యంలో బిదూరీ విద్వేష ప్రసంగాలను కూడా చూడాల్సి ఉంది. ముస్లింలను సమూలంగా నిర్మూలించాలంటూ 'ధర్మ సంసద్'లు పిలుపునివ్వడం, గోవులను అక్రమంగా రవాణా చేస్తున్నారని లేదా గొడ్డు మాంసాన్ని తీసుకెళుతున్నారనే నెపంతో ముస్లింలను వేధించి కొట్టి చంపడమనేది హర్యానా, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర వంటి బిజెపి పాలిత రాష్ట్రాల్లో నిత్యం జరుగుతున్న విషయం-దేశ ప్రజలు గమనిస్తున్నారు. ప్రభుత్వం దేశంలో శాంతి భద్రతలు కాపాడటమంటే ఇదేనా? అని ప్రశ్నిస్తున్నారు. ఉగ్రవాదాన్ని యూరపు దేశాల్లో 'టెర్రరిజం' అని అంటారు. ముస్లిం దేశాల్లో 'జీహద్' అని అంటారు. దాన్నే సమకాలీన భారత దేశంలో 'సనాతన ధర్మం' అంటారని ఈ దేశ ప్రజలు నిర్వచించుకుంటున్నారు.

ప్రపంచంలో మతాల ప్రాబల్యం తగ్గుముఖంలో ఉంటే, మన దేశంలో మాత్రం అధికారంలో ఉన్న ప్రభుత్వం-'మతమే దేశభక్తి' అని చెబుతోంది. క్రిస్టియానిటీని ప్రపంచంపై బలవంతంగా రుద్దిన ఇంగ్లాండ్‌లో-ఇప్పుడు అదే క్రిస్టియానిటీ-తగ్గు ముఖం పడుతోంది! ఇంగ్లాండ్‌లో క్రిస్టియన్ల సంఖ్య అరవై శాతం నుండి నలభై ఆరు శాతానికి పడిపోయింది. అలాగే ఏ మతాన్నీ పాటించని వారి సంఖ్య 26 నుండి 38 శాతానికి పెరిగింది. మరో దశాబ్దం నాటికి ఆ మతం మైనార్టీ స్థాయికి వచ్చినా ఆశ్చర్యపోనక్కర లేదు. అయితే మత ప్రాతిపదికన సామాజిక శత్రుత్వాలు పెరిగిపోయిన దేశాల్లో మన దేశం అగ్రస్థానంలో ఉంది. భారత దేశం 9.4, నైజీరి యా 8.5, ఆఫ్ఘనిస్తాన్ 8, ఇజ్రాయిల్ 8, మాలి 7.9, పాకిస్తాన్ 7.5, ఈజిప్టు, లిబియా, సిరియా7.4. ఇందులో తక్కువ స్కోరు ఉంటే అక్కడ సుహృద్భావ వాతావరణం బావుందని అర్థం! అందువల్ల మతం పేరుతో విద్వేషాలు రెచ్చగొట్టే వారిని, మూఢ విశ్వాసాలు ప్రచారం చేసే వారిని తక్షణం బహిష్కరించాలి. ఇది దేశ ప్రజలందరూ చేపట్టాల్సిన కార్యక్రమం!

/ వ్యాసకర్త సుప్రసిద్ధ సాహితీవేత్త, విశ్రాంత బయాలజీ ప్రొఫెసర్- మెల్బోర్న్ నుంచి /

కవిత్వం

మంచోళ్ళే కావాలి

వచ్చేశాయ్
వచ్చేశాయ్
ఎన్నికలు,
మొదలయ్యాయ్
మొదలయ్యాయ్
కప్పదాటులు,
ఇటు నుంచి అటు
అటు నుంచి ఇటు,
సీటిస్తే మంచోడు
లేపోతే చెడ్డోడు
నిన్నటి దాకా చెడ్డోడు
నేడు మంచోడు,
నీతి లేదు
నియమం లేదు
నైతికత అసలే లేదు
మతంతో రాజకీయం
కులంతో కుర్చీ
అదే సామాజిక న్యాయం,
వ్యాపారం కోసం పదవి
నోట్లతో ఓట్ల కొనుగోలు
పదవితో వ్యాపారం,
ఎన్నికల ముందు హామీలే హామీలు
గెలిచిన తరువాత గాలికే
అడిగితే నిర్బంధమే.
ఛీ ఛీ
ఇలాంటోళ్లా మనను ఉద్ధరించేది?
వద్దు వద్దు
మనకొద్దు ఇలాంటోళ్లు
మంచోళ్ళే కావాలి.

- ఎ. అజ శర్మ

కొత్త జతగాడు...!

గత కాలం వెళ్ళి పోయింది
పాత కాలపు మిత్రుడిలా ...!
నూతన సంవత్సరమొచ్చింది
కొత్త స్నేహితుడి చిరునవ్వులా..!!
పాత ఏడాది అంతా రిత్త కాదు
కొత్తది మాత్రం సరికొత్త అవ్వదు
కొత్త పాత మేలు కలయికతోనే
కాల రేఖ కొత్త పుంతలు తొక్కుతుంది
జీవిత నౌకను సవ్యంగా నడిపిస్తుంది..!
గడిచిన ఏడాది అనుభవాల పేటిక
పొడిచిన సంవత్సరం అనుభూతుల వేదిక
గత కాలం చేదు జ్ఞాపకాలయితే
వర్తమానం స్వాదు ఫలాల సాదృశ్యం ..!
గతం ఆత్మీయుడిలా నిన్ను పెనవేసుకుని
వుంటే
అతిథిలా సాదరంగా స్వాగతం పలుకుతున్నాడు
కొత్త సంవత్సరం జతగాడు నీకు..!!

- జి.సూర్యనారాయణ,
సెల్ : 6281725659.

కష్టజీవి

పొద్దేకే సాప సుట్టేసి
పై సూరొంక ఒకతూరి
కళ్ళార్పకుండా సూడాలి
సెదలెక్కిన కట్టెద్దుని
ఓదార్చి దొడ్లోకి అడుగెయ్యాల.
కష్టజీవంటే
ఉత్తుత్తి మాటలెక్కనగాదు
రాళ్ళ ధాటికి
మునిగిపోయిన సెలకని
సదును చేసి నవ్వించాలి
బొట్లు బొట్లుగా
రాలిపడతాండే సెమట సుక్కల్తో
మొక్కను బతికించాల.
రాళ్ళను మలిచి
బొమ్మలెక్కన పాణం పొయ్యాల
నాలుగంచులా రాతిని కూర్చి
గూడుకు పునాదులెయ్యాల
నారపోగుల్ని ఏకం చేసి
బారెడు పగ్గాన్ని నూనె పూయాల
కష్టజీవంటే
ఓట్లకు నోటి మాటల్కి
నోట్ల కట్టల్కి బలిపశువు కాదు
నిఖార్సైన శ్రమజీవి.
నాల్గు మెతుకులకు
వీళ్ళే పాలనాధికారులు
ఆకల్ని చంపేసే రక్షణాధికారులు.
కలుపు మొక్కల ఎక్కిరింతల్ని
ఓపిగ్గా భరించాల
పీచకాయల తండ్లాట చూసి
కన్నీటికి ఆనకట్టలెయ్యాల
అరువు బరువుని నెత్తినెట్టుకుని
అడుగుల్ని సాగదీయాల
కష్టజీవులంటే
కాళ్ళు మడచని యంత్రంలాంటోళ్ళు.

- నరెద్దుల రాజారెడ్డి,
సెల్ : 9666016636

జనవాక్యం

విజయవాడకు లోకాయుక్త కార్యాలయం

పిల్లి ఈనిన తరువాత తన పిల్లలను ఏడు చోట్లకు మారుస్తదట. అలా ఉంది లోకాయుక్త పరిస్థితి. రాష్ట్రం ఏర్పడిన తరువాత చాలారోజులు హైదరాబాద్ లోనే ఉంది. విజయవాడ మారుస్తామని విజయవాడ బందరు రోడ్డులోని హెచ్‌ఓడి లో ఒక కార్యాలయాన్ని తయారు చేస్తున్నామని, ఒక రోజు మాత్రం అక్కడ కోర్టు పెట్టి సాయంత్రానికి మరలా హైదరాబాద్ మార్చారు. తరువాత కర్నూలుకు మర్చారు. ముఖ్యమైన కార్యాలయాలు అమరావతిలో ఉంటే రాష్ట్ర ప్రజలకు అనుకూలంగా ఉంటుంది. ఇపుడు శ్రీకాకుళం, విశాఖ వాళ్ళు కర్నూలు రావాలంటే రెండు రోజుల ముందుగా ప్రయాణం పెట్టుకోవాలి. డైరెక్ట్ ట్రైను లేదు. ఇబ్బందులు పడుతూ రావాలి. పక్క జిల్లా వారు ప్రకాశం జిల్లావారు రావాలన్నా నల్లమల అడవులు దాటుకుంటూ ఒక రాత్రల్లా నిద్దరలేకుండా ప్రయాణం చెయ్యాలి. అందులో కర్నూలులో పెట్టిన కార్యాలయం కూడా నెలకు రూ. ఆరు లక్షలు అద్దె కొంపలో పెట్టారు. ఎవరికోసం? అదే విజయవాడ, అమరావతిలో ప్రభుత్వ భవనాలు ఎన్నో ఖాళీగా ఉన్నాయి. మంగళగిరిలో కూడా చాలా కార్యాలయాలు అద్దె భవనాలలో ఉన్నాయి. వాటిని అమరావతికి మారిస్తే ముందు రాష్ట్ర ప్రజలకు అనుకూలంగా ఉంటుంది, రెండోది కోట్లాది రూపాయలు అద్దె చెల్లింపులు తగ్గి, ప్రభుత్వానికి ఆర్థిక భారం కూడా తప్పుతుంది. ముందు వెంటనే లోకాయుక్తను విజయవాడకు మార్చండి.

- నార్నె వెంకట సుబ్బయ్య,
ఎ.పి హేతువాద సంఘం అధ్యక్షుడు.

మీ వ్యాసాలు 5000 క్యారెక్టర్లు లేదా 700 పదాలు వుండాలి పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com

ఇరాన్ పేలుళ్లు దేనికి సంకేతం?

పశ్చిమాసియాలో గత రెండు మూడు రోజుల్లో జరిగిన పరిణామాల పర్యవసానాల గురించి ఆందోళన కలుగుతోంది. గాజాలో ఇజ్రాయిల్ ప్రారంభించిన జాతి హననం మూడవ నెలలో ప్రవేశిస్తున్నది. హమాస్ సాయుధుల ఏరివేత అంటూ ప్రారంభించిన దాడుల్లో ఇరవై రెండు వేలకు పైగా సామాన్య పాలస్తీనియన్లు మరణించటం తప్ప జరిగిందేమీ లేదు. కొన్ని నెలల పాటు దాడులు కొనసాగిస్తామని చెప్పటం గాజాలో విఫలమైనట్లు అంగీకరించటమే. అందువల్లనే ఉగ్రవాద చర్యల ద్వారా హత్యలకు తెరలేపి రెచ్చగొట్టేందుకు పూనుకున్నట్లు స్పష్టమైంది. బుధవారం నాడు ఇరాన్‌లో పేలుళ్లతో 103 మందిని చంపటం, 211 మందిని గాయపర్చటం, అంతకు ముందు లెబనాన్ రాజధాని బీరుట్ శివార్లలో హమాస్ సీనియర్ నేత సాలె అల్ అరౌరీని చంపటం వాటిలో భాగమే. గాజా నుంచి మిలిటరీని ఉపసంహరిస్తున్నట్లు ప్రకటించి ప్రపంచ దృష్టిని మళ్లించి అక్కడ దాడుల తీవ్రతను పెంచటం, ఉగ్రవాద చర్యలకు పాల్పడటం అమెరికా, ఇజ్రాయిల్ వాటి మిత్రదేశాల పథకం తప్ప మరొకటి కాదు. దీనికి ప్రతీకార చర్యలు జరిగితే ఆ పేరుతో మంటను మరింత రాజేయటం, మధ్య ప్రాచ్యం, పశ్చిమాసియాలో ప్రాంతీయ యుద్ధాన్ని ప్రారంభించేందుకే ఇదంతా అన్నది స్పష్టం. వివిధ విశ్లేషణల పూర్వరంగంలో ఇవి ఎటు దారితీసేదీ అప్పుడే చెప్పలేము.

2020 జనవరి మూడున బాగ్దాద్ పర్యటనలో ఉన్న ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ జనరల్ ఖాసిం సులేమానిని డ్రోన్ దాడితో అమెరికన్లు హత్యచేశారు. నాలుగవ వర్ధంతి సందర్భంగా బుధవారంనాడు కెర్మాన్ పట్టణంలోని సులేమాని సమాధి సమీపంలో రెండు బాంబు పేలుళ్ల జరిపి అనేక మందిని బలిగొన్నారు. ఎర్ర సముద్రంలో అమెరికా యుద్ధ నౌకలకు పోటీగా ఇరాన్ నౌక లంగరు వేయటంతో ప్రతీకారంగానే ఈ దాడి జరిగిందన్నది స్పష్టం. బాధ్యత తమదే అని ఇంతవరకు ఏ సంస్థా ప్రకటించనప్పటికీ అమెరికా, ఇజ్రాయిల్ హంతక దళాల పనే అన్నది వేరే చెప్పనవసరం లేదు. తగిన ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ ప్రకటించింది. మంగళవారం నాడు లెబనాన్ రాజధాని బీరుట్ శివారు పట్టణమైన ధివేలో హమాస్ అగ్రనేతలలో ఒకడైన అరౌరీ కార్యాలయాన్ని పేల్చివేసి హత్య చేశారు. మరుసటి రోజు ఇజ్రాయిల్ మొసాద్ (అమెరికా సిఐఎ వంటిది) అధిపతి డేవిడ్ బారెనె హమాస్ నేతలు ఎక్కడ ఉన్నా వారిని మట్టు పెడతామని బుధవారం నాడు ప్రకటించటానికి అర్థం తామే అరౌరీని చంపేసినట్లు చెప్పటమే. అదే రోజు లెబనాన్ లోని హిజబుల్లా కేంద్రాలపై ఇజ్రాయిల్ జరిపిన దాడిలో తొమ్మిది మంది మరణించారు.

> హమాస్ సాయుధుల ఏరివేత అంటూ ప్రారంభించిన దాడుల్లో ఇరవై రెండు వేలకు పైగా సామాన్య పాలస్తీనియన్లు మరణించటం తప్ప జరిగిందేమీ లేదు. కొన్ని నెలల పాటు దాడులు కొనసాగిస్తామని చెప్పటం గాజాలో విఫలమైనట్లు అంగీకరించటమే. అందువల్లనే ఉగ్రవాద చర్యల ద్వారా హత్యలకు తెరలేపి రెచ్చగొట్టేందుకు పూనుకున్నట్లు స్పష్టమైంది. బుధవారం నాడు ఇరాన్‌లో పేలుళ్లతో 103 మందిని చంపటం, 211 మందిని గాయపర్చటం, అంతకు ముందు లెబనాన్ రాజధాని బీరుట్ శివార్లలో హమాస్ సీనియర్ నేత సాలెఅల్ అరౌరీని చంపటం వాటిలో భాగమే.

హమాస్‌ను అణచివేయలేకపోవటం, వారి దగ్గర బందీలుగా ఉన్న తమ వారిని విడిపించుకోలేకపోయామన్న అసహనం, జనంలో పెరుగుతున్న అసంతృప్తి, దిగజారుతున్న ఆర్థిక స్థితి యూదు దురహంకారులకు మింగుడు పడటం లేదు. అమెరికా ఆశించినట్లు ప్రాంతీయ యుద్ధాన్ని తీసుకురావటంలో కూడా విఫలమైనట్లు పరిగణిస్తున్నారు. ఇవన్నీ జో బైడెన్ ఎన్నికల మీద ప్రతికూల ప్రభావం చూపవచ్చని అంచనా. అమెరికా రూపొందించిన పథకంలో భాగంగా మూడు నెలల కాలంలో ఒకటి, రెండవ దశలను అమలు జరిపిన ఇజ్రాయిల్ ఇప్పుడు మూడవ దశకు తీసుకుపోయేందుకు పూనుకుంది. దానిలో భాగంగానే తమ మిలిటరీని ఉపసంహరిస్తున్న ట్లు ప్రకటించటం అంటే అతి పెద్ద దాడికి పూనుకోనున్నట్లు లేదా లెబనాన్ మీద దాడులకు దిగుతామని సంకేతం పంపటంగాను, దాన్లో భాగంగానే అరౌరీ హత్య జరిగిందని కొందరి విశ్లేషణ. అయితే గాజా ఉత్తర ప్రాంతాన్ని ధ్వంసం చేసినప్పటికీ అక్కడ తమ మిలిటరీకి ముప్పు తొలగలేదని ఇజ్రాయిల్ భావిస్తున్నది. ప్రతి ఇంటిని, ప్రతి సొరంగాన్ని తనిఖీ చేయాలంటే సంవత్సరాలు పడుతుందని, అందువలన పరిమిత స్థాయిలో దీర్ఘకాలం పాటు దాడులను కొనసాగించేందుకు చూస్తున్నదని మరికొందరి భావన. దానిలో భాగంగా లెబనాన్ మీద దాడులను ప్రారంభించటం కూడా ఒకటని అంటున్నారు. లెబనాన్ హిజబుల్లా గతం కంటే మెరుగైన సమాచార వ్యవస్థ, ఆధునిక ఆయుధాలను, నైపుణ్యాలను సంపాదించుకొని ఇజ్రాయిల్ మీద దాడులకు సిద్ధం అవుతున్నదన్న వార్తలు కూడా ఉన్నాయి. ఆ సంస్థ మీద ఒత్తిడి పెంచి వెనక్కు తగ్గేట్లు చేయాలన్న ఎత్తుగడలో భాగంగా కూడా హమాస్ నేత అరౌరీని హత్య జరిగిందని కూడ ఒక కథనం. భిన్న విశ్లేషణలు ఎలా ఉన్నప్పటికీ గాజా నుంచి పూర్తిగా సేనల ఉపసంహరణ, మారణకాండను నిలిపివేసే అవకాశం లేదు. అమెరికా తన ప్రయోజనాలకే పెద్ద పీట వేస్తుంది. అది రాజకీయ నేతల లబ్ధి, కార్పొరేట్లకు కాసులు కురిపించటం ఏదైనా కావచ్చు.

- ఫీచర్స్ అండ్ పాలిటిక్స్

పెద్దల సభ నుంచి 68 మంది ఎంపీల నిష్క్రమణ

- ఈ ఏడాదిలో ముగియనున్న పదవీకాలం

న్యూఢిల్లీ. ఈ ఏడాది రాజ్యసభ నుంచి 68 మంది ఎంపీలు నిష్క్రమించనున్నారు. వీరిలో తొమ్మిది మంది కేంద్ర మంత్రులు కూడా ఉన్నారు. అయితే ఉత్తర్‌ప్రదేశ్ నుంచి గరిష్టంగా పది సీట్లు ఖాళీ కానున్నాయి. ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, హర్యానా, సిక్కిం, ఛత్తీస్‌గఢ్‌లలో కనీసం ఒక సీటు ఖాళీ కానున్నది. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ సహా బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, సుధాన్షు త్రివేది కలిపి 68 మంది నేతల పదవీకాలం ముగియనున్నది. పదవీకాలం ముగియనున్న ఎంపీల్లో కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, పర్యావరణ మంత్రి భూపేంద్ర యాదవ్, ఆరోగ్య మంత్రి మన్సుఖ్ మాండ్యా ఉన్నారు. వీరి పదవీకాలం ఏప్రిల్‌లో పూర్తికానుంది.

ఉత్తరప్రదేశ్‌లో గరిష్టంగా 10 సీట్లు ఖాళీ అవుతాయి. దీని తర్వాత మహారాష్ట్ర, బీహార్‌లో ఆరు, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌లో ఐదు, కర్నాటక, గుజరాత్‌లో నాలుగు, ఢిల్లీ, ఒడిశా, తెలంగాణ, కేరళ, ఆంధ్రప్రదేశ్‌లో మూడు చొప్పున, జార్ఖండ్, రాజస్థాన్‌లో రెండేసి చొప్పున, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, హర్యానా, సిక్కిం,

ఛత్తీస్‌గఢ్‌లలో ఒక్కొక్కటి ఖాళీగా ఉంటాయి.

ఢిల్లీలో మూడు స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఇక్కడ జైలు శిక్ష అనుభవిస్తున్న ఆప్ నేతలు సంజయ్ సింగ్, నారాయణ్ దాస్ గుప్తా, సుశీల్ కుమార్ గుప్తాల పదవీకాలం జనవరి 27తో ముగియనుంది. సిక్కింలోని ఏకైక రాజ్యసభ స్థానానికి కూడా ఎన్నికలు జరగనున్నాయి. సిక్కిం డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎస్‌డీఎఫ్) ఎంపీ హిషే లచుంగ్పా ఫిబ్రవరి 23న పదవీ విరమణ చేయనున్నారు.

పదవీ విరమణ చేస్తున్న సభ్యుల్లో మన్మోహన్ సింగ్, భూపేంద్ర యాదవ్ (రాజస్థాన్), అశ్విని వైష్ణవ్, బీజేడీ ఎంపీలు ప్రశాంత్ నందా, అమర్ పట్నాయక్ (ఒడిశా), బీజేపీ అధికార ప్రతినిధి అనిల్ బలూని (ఉత్తరాఖండ్), మన్సుఖ్ మాండవ్య, మత్స్యశాఖ మంత్రి పుర్షోత్తం రూపాలా, గుజరాత్‌కు చెందిన కాంగ్రెస్ ఎంపీ అమీ యాగ్నిక్‌తో పాటు నారన్‌భాయ్ రాత్వా కూడా ఉన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో...

ఆంధ్రప్రదేశ్ నుంచి టీడీపీ ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్, బీజేపీ ఎంపీ సీఎం రమేష్, వైఎస్సార్సీపీ ఎంపీ ప్రభాకర్ రెడ్డి వేమిరెడ్డి రాజ్యసభ నుంచి రిటైర్ అవుతున్నారు.

ఛత్తీస్‌గఢ్, హర్యానా నుంచి బీజేపీ ఎంపీలు సరోజ్ పాండే, డీపీ వాట్స్ పదవీ విరమణ చేస్తున్నారు. జార్ఖండ్‌లో బీజేపీ ఎంపీ సమీర్ ఓరాన్, కాంగ్రెస్ ఎంపీ ధీరజ్ ప్రసాద్ సాహు మేలో పార్లమెంట్ ఎగువ సభ నుంచి పదవీ విరమణ చేస్తున్నారు.

కేరళలో...

కేరళలో సిపిఎం ఎంపీ ఎలమారం కరీం, సీపీఐ ఎంపీ బినోయ్ విశ్వం, కేసీ(ఎం) ఎంపీ జోస్ కె మణి జులైలో పదవీ విరమణ చేయనున్నారు. నలుగురు నామినేటెడ్ ఎంపీలు కూడా జులైలో పదవీ విరమణ చేయనున్నారు.వీరిలో బీజేపీకి చెందిన మహేశ్ జెఠ్మలానీ, సోనాల్ మాన్‌సింగ్, రామ్ షకల్, రాకేష్ సిన్హా ఉన్నారు.

9, 10 తేదీల్లో కేంద్ర ఎన్నికల సంఘం పర్యటన

- లోక్‌సభ ఎన్నికల సన్నాహాలపై సమీక్ష

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశవ్యాప్తంగా ఎన్నికల సన్నద్ధతపై ముగ్గురు సభ్యుల ప్యానెల్ సమీక్షను ప్రారంభించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం వచ్చే వారం ఆంధ్రప్రదేశ్, తమిళనాడును సందర్శించనుంది. ప్రధాన ఎన్నికల కమిషనరు రాజీవ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు అనుప్ చంద్ర పాండే, అరుణ్ గోయెల్ జనవరి 9, 10 తేదీల్లో ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించనున్నట్లు ఇసి వర్గాలు తెలిపాయి. అంతకముందు జనవరి 7, 8 తేదీల్లో తమిళనాడులో పర్యటించనున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని 25 స్థానాలు, తమిళనాడులోని 39 లోక్‌సభ స్థానాలకు సంబంధించిన సన్నాహాలను ఇసి సమీక్షించనుంది. లోక్‌సభ ఎన్నికలతోపాటు ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల సన్నాహాలను కూడా ఇసి సమీక్షిస్తుంది. ఇసి సందర్శనలకు ముందు, సీనియర్ ఇసి అధికారుల బృందాలు గత కొన్ని నెలలుగా సన్నాహాలను సమీక్షించాయి. ఏప్రిల్, మే నెలల్లో లోక్‌సభ ఎన్నికలు జరగాల్సి ఉంది. 2019లో అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో పర్యటనలను పూర్తి చేసిన తరువాత, మార్చి 10న ఎన్నికల షెడ్యూల్‌ను ఇసి ప్రకటించింది.

'మొహల్లా క్లినిక్'లపై సిబిఐ విచారణకు ఆదేశం

న్యూఢిల్లీ : ఆప్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన మొహల్లా క్లినిక్‌ల్లో దర్యాప్తు చేపట్టాల్సిందిగా సిబిఐను లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ఆదేశించినట్లు సమాచారం. ఈ ఆస్పత్రుల్లోని పరీక్షా కేంద్రాల్లో అవకతవకలు జరుగుతున్నాయనే ఆరోపణలపై విచారణ చేయాలని సిబిఐను ఆదేశించినట్లు తెలుస్తోంది. ప్రజలకు నాణ్యమైన ఉచిత వైద్యం అందించేందుకు ఆప్ ప్రభుత్వం మొహల్లా క్లినిక్‌లను ఏర్పాటు చేసింది. అయితే రోగులు లేకపోయినప్పటికీ రేడియాలజీ, పాథాలజీ పరీక్షలు నిర్వహించినట్లు నకిలీ పత్రాలు సృష్టిస్తున్నారని ఎల్‌జి వీకే సక్సేనా దృష్టికి వచ్చింది. అలాగే, కొందరు డాక్టర్లు ఆలస్యంగా విధులకు వెళుతూ వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని. మరికొందరు అసలు క్లినిక్‌కు రాకుండానే వచ్చినట్లు ఫేక్ రిపోర్టులు తయారు చేస్తున్నారని సక్సేనా దృష్టికి వచ్చింది.

కాగా, గతంలో ఢిల్లీ ప్రభుత్వ ఆస్పత్రుల్లో నాసిరకం మందులు సరఫరా అవుతున్నాయనే ఆరోపణలపైనా సిబిఐ దర్యాప్తునకు ఎల్జీ సక్సేనా ఆదేశించారు.

పవన్ ఖేరాపై కేసుల కొట్టివేతకు సుప్రీం 'నో'

న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోడీని అవమానించేలా వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణపై కాంగ్రెస్ ప్రతినిధి పవన్ ఖేరాపై చేపట్టిన క్రిమినల్ చర్యలను కొట్టివేసేందుకు సుప్రీంకోర్టు గురువారం నిరాకరించింది. ఖేరా గత సంవత్సరం ఫిబ్రవరిలో పత్రికా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీని 'నరేంద్ర గౌతమ్‌దాస్ మోడీ'గా సంబోధించారు. పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీతో ప్రధాని మోడీకి ఉన్న సంబంధాలను ఎత్తిచూపుతూ ఆయన ఈ మాట అన్నారు. అదానీ గ్రూపుపై అమెరికా సంస్థ హిండెన్‌బర్గ్ రిసెర్చ్ సంస్థ రూపొందించిన నివేదికపై నెలకొన్న సంక్షోభం నేపథ్యంలో మోడీ ప్రభుత్వాన్ని ఖేరా ఆ సందర్భంలో విమర్శించారు. ఖేరాను ఫిబ్రవరి 23న అస్సాం పోలీసులు ఢిల్లీ విమానాశ్రయంలో అరెస్ట్ చేశారు. అయితే ఆయనకు సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. ఉత్తరప్రదేశ్, అస్సాం రాష్ట్రాలలో ఖేరాపై ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి.

9న రాజ్యసభ ప్రివిలేజ్ కమిటీ భేటీ

- ఎంపిల సస్పెన్షన్‌పై చర్చ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాజ్యసభ ప్రివిలేజెస్ కమిటీ సమావేశం ఈ నెల 9న ఎంపి హరివంశ్ అధ్యక్షతన జరగనున్నది. ఇటీవల ముగిసిన శీతాకాల సమావేశాల్లో 11 మంది ఎంపిల సస్పెన్షన్‌కు సంబంధించిన కేసుతో సహా పలు అంశాలపై కమిటీ నిర్ణయం తీసుకోనున్నది. శీతాకాల సమావేశాల్లోనే 46 మంది సభ్యులను రాజ్యసభ నుంచి కూడా సస్పెండ్ చేయడం తెలిసిందే. ఇందులో 11 మందిపై సభ ప్రివిలేజ్ కమిటీకి పంపారు. ఈ కమిటీకి డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్ నేతృత్వం వహించనున్నారు. సస్పెన్షన్ వ్యవహారంపై రాజ్యసభ కమిటీ సమావేశం ఇంకా పెండింగ్‌లో ఉంది. ప్రివిలేజ్ కమిటీ నివేదిక వచ్చే వరకు ప్రతిపక్ష పార్టీల ఎంపిలు జెబి మాథర్ హిషామ్, హనుమంతయ్య, నీరజ్ డాంగి, రాజమణి పటేల్, కుమార్ కేత్కర్, జిసి చంద్రశేఖర్, బినోయ్ విశ్వం, సంతోష్ కుమార్, ఎం మహ్మద్ అబ్దుల్లా, జాన్ బ్రిట్టాస్, ఎఎ రహీం సస్పెండయ్యారు.

మేమే దాడి చేశాం

- ఇరాన్‌లో జంట పేలుళ్లపై ఐసిస్

టెహ్రాన్: బుధవారం ఇరాన్‌లో వందమందికిపైగా పౌరులను బలి తీసుకున్న జంట పేలుళ్ల తమ పనేనని ఇస్లామిక్ స్టేట్ (ఐసిస్) ఉగ్రవాద సంస్థ వెల్లడించింది. ఇరాన్ రివల్యూషనరీ గార్డు మాజీ జనరల్ ఖాసిమ్ సులేమని వర్ధంతి సందర్భంగా తమ సంస్థకు చెందిన ఇద్దరు సభ్యులు ఈ పేలుళ్ల జరిపారని ఐసిస్ టెలిగ్రామ్‌లో విడుదలజేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. తమ అణు శాస్త్రవేత్తలను, ఉన్నతాధికారులను లక్ష్యంగా చేసుకుని వరుసగా జరుగుతున్న దాడుల వెనక ఇజ్రాయిల్, అమెరికా హస్తం ఉందని ఇరాన్ ప్రభుత్వం ఆరోపించింది.

రక్తం అమ్మకానికి కాదు : కేంద్రం

న్యూఢిల్లీ : రోగులకు అవసరమైన రక్తాన్ని కొన్ని బ్లడ్ బ్యాంకులు, ఆసుపత్రులు అధిక ధరలకు అమ్ముకుంటున్నాయని ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో వీటికి అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రక్తానికి వసూలు చేస్తున్న అన్ని రకాల ఫీజులను రద్దు చేయాలని నిర్ణయించినట్లు డ్రగ్స్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా (డిసిజిఐ) వెల్లడించింది. 'రక్తం అమ్మకానికి కాదు' అనే ఉద్దేశ్యంతోనే ఈ నిర్ణయం తీసుకున్నామని.. ఆసుపత్రులు, బ్లడ్ బ్యాంకులు కేవలం ప్రాసెసింగ్ ఫీజు మాత్రమే వసూలు చేయాలని సూచించింది."రక్తానికి అధిక రుసుం అంశంపై గతేడాది సెప్టెంబరులో నిర్వహించిన డ్రగ్స్ కన్సల్టేటివ్ కమిటీ 62వ సమావేశంలో అధికారులు పూర్తిస్థాయిలో చర్చలు జరిపారు. 'రక్తం అమ్మకానికి కాదు' అనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ.. దాన్ని సరఫరా మాత్రమే చేయాలని నిర్ణయించారు. బ్లడ్ బ్యాంకులు కేవలం ప్రాసెసింగ్ రుసుం వసూలు చేయాలని సిఫార్సు చేశారు' అని డిసెంబర్ 26నాటి లేఖలో డిసిజిఐ పేర్కొంది. ఈ విషయాన్ని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ఔషధ నియంత్రణ విభాగాలకు తెలియజేసినట్లు తెలిపింది.

కాగా, కేంద్రం తాజా మార్గదర్శకాల ప్రకారం రక్తం లేదా రక్తం విభాగాలకు (ప్లాస్మా, తెల్లరక్తకణాలు వంటివి) రూ.250 నుంచి రూ.1550 వరకు మాత్రమే వసూలు చేయాలి. ఈ నిబంధనలకు కట్టుబడి ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్ని రాష్ట్రాల ఔషధ నియంత్రణ అధికారులకు డిసిజిఐ సూచించింది. కొన్ని ఆసుపత్రులు, బ్లడ్ బ్యాంకులు అధిక రుసుం వసూలు చేస్తున్నాయనే విమర్శలున్నాయి. రక్తదానం చేయని పక్షంలో ఒక్కో యూనిట్‌కు రూ.3000 నుంచి రూ.8వేల వరకు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. రక్తం కొరత, అరుదైన గ్రూపు అవసరమైన సమయంలో ఈ ధర మరింత ఎక్కువ ఉంటోంది.

ఇంటర్‌నెట్‌తో కేరళ హైటెక్ పాఠశాలల అనుసంధానం

తిరువనంతపురం : రాష్ట్రంలోని అన్ని హైటెక్ పాఠశాలలకు ఈ వారంలో ఇంటర్‌నెట్ బ్రాడ్‌బాండ్ సదుపాయాన్ని కేరళ ప్రభుత్వం కల్పించనుంది. కె-ఫాన్ పబ్లిక్ బ్రాడ్‌బాండ్ ప్రాజెక్టులో భాగంగా ఈ చర్య తీసుకోనున్నారు.సార్వజనీన ఇంటర్‌నెట్ సదుపాయాన్ని పెంపొందించేందుకు, కార్పొరేట్ టెలికం రంగానికి ప్రత్యామ్నాయంగా గత జూన్‌లో కె-ఫాన్‌ను ప్రారంభించారు. ప్రైవేటు రంగ కేబుల్ నెట్‌వర్క్‌లు, మొబైల్ సర్వీస్ ప్రొవైడర్ల దోపిడీ నుండి ప్రజలను కాపాడేందుకే ఈ ప్రాజెక్టు ప్రారంభించినట్లు ముఖ్యమంత్రి పినరయి విజయన్ తెలిపారు.

దారిద్ర్య రేఖకు దిగువున గల 20లక్షల కుటుంబాలకు ఉచిత ఇంటర్‌నెట్‌ను సకాలంలో అందచేసి, డిజిటల్ అంతరాన్ని పోగొడతామని చెప్పారు. దారిద్ర్య రేఖకు ఎగువున గల కుటుంబాలు చార్జీలు చెల్లించాల్సి వుంటుంది. అయితే కమర్షియల్ రేట్ల కన్నా తక్కువగానే వుంటాయి. రాష్ట్రవ్యాప్తంగా 2వేల పబ్లిక్ ప్రదేశాల్లో ఉచిత వైఫై అందుబాటులో వుంచారు. అన్ని ప్రభుత్వ, స్థానిక కార్యాలయాలు ఈ సర్వీస్‌ను ఉపయోగించు కుంటాయి. అయితే కేరళ పాఠశాలలను అనుసంధానం చేయడం పదే పదే జాప్యమవుతూ వచ్చింది. ఆర్థికపరమైన కారణాలే ఇందుకు దోహదపడ్డాయి. అయితే కె-ఫాన్ ప్రాజెక్టు నిర్వహణకు సరిపడా ఆదాయం ఆ ప్రాజెక్టు వల్లనే వస్తుందని ప్రభుత్వం చెబుతోంది.

మహారాష్ట్రలో తొలి మహిళా డిజిపి

- వివాదాస్పద పోలీసు అధికారిణికి రాష్ట్ర ఉన్నత పదవి

ముంబయి : మహారాష్ట్రలో తొలి మహిళా డిజిపిగా 1988 బ్యాచ్ ఐపిఎస్ రష్మి శుక్లాను నియమించారు. డిజిపిగా గతవారంలో పదవీ విరమణ చేసిన రజనీష్ సేథ్ స్థానంలో కొత్త పోలీస్ బాస్‌గా రష్మీ శుక్లాను నియమిస్తున్నట్లు మహారాష్ట్ర ప్రభుత్వం గురువారం ప్రకటించింది. దీంతో మహారాష్ట్రలో తొలి మహిళా డిజిపిగా రష్మి శుక్లాను రికార్డులకెక్కారు. ప్రస్తుతం సరిహద్దు రక్షణ దళం సశాస్త్ర సీమా బాల్ (ఎస్ఎస్‌బి) అధిపతిగా కేంద్రం డిప్యూటేషన్‌లో శుక్లా వున్నారు. కాగా, మహారాష్ట్రంలో తొలి మహిళా డిజిపిగా నియమించబడిన శుక్లాపై అనేక వివాదాలు ఉన్నాయి. గతంలో మహారాష్ట్ర రాష్ట్ర నిఘా విభాగం (ఎస్ఐడి) కమిషనర్‌గా ఉన్న సమయంలో అప్పటి దేవేంద్ర ఫడ్నవీస్ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం సన్నిహితంగా ఉన్నారని, శివసేన, కాంగ్రెస్‌లకు చెందిన నాయకులు ఫోన్లను రహస్యంగా ట్యాప్ చేశారని శుక్లాపై ఆరోపణలు ఉన్నాయి. తరువాత మహాకూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కూడా ఎస్ఐడి నుంచి సమాచారాన్ని ఫడ్నవీస్‌కు లీక్ చేశారని కూడా శుక్లాపై అభియోగాలు ఉన్నాయి. ఈ ఆరోపణలతో శుక్లా మూడు కేసుల్లో నిందితులుగా ఉన్నారు. దీంతో శుక్లాను సివిల్ డిఫెన్స్‌కు మహాకూటమి ప్రభుత్వం బదిలీ చేసింది. అయితే మహారాష్ట్రలో ఏక్‌నాథ్ షిండే ప్రభుత్వం ఏర్పడిన తరువాత నుంచీ కూడా శుక్లా మళ్లీ రాష్ట్రానికి తిరిగివస్తారనే వార్తలు వస్తున్నాయి. ఇప్పుడు అవే నిజయ్యాయి. అలాగే శుక్లా ఈ జూన్‌లో పదవీ విరమణ చేయాల్సి ఉంది. అయితే ఆమె పదవీ కాలాన్ని ప్రస్తుత ప్రభుత్వం పొడిగిస్తుందనే వార్తలు కూడా వస్తున్నాయి

గాజా, ఉక్రెయిన్‌లపై పశ్చిమ దేశాల కపటత్వం

- టర్కీ విదేశాంగ మంత్రి

అంకార : ప్రస్తుత యుద్ధ సమయాల్లో ఉక్రెయిన్ పైన ఒక వైఖరి, గాజాపైన దానికి పూర్తిగా భిన్నమైన వైఖరి తీసుకుంటున్న పశ్చిమ దేశాలకు నీతి, నియమాల గురించి మాట్లాడే హక్కు ఏమాత్రం లేదని టర్కీ విదేశాంగ మంత్రి హకన్ ఫిదన్ ఆరోపించారు. గాజాలో జరుగుతున్న యుద్ధం, లెబనాన్ పైన ఇజ్రాయిలీ దాడి, ఎర్ర సముద్రాన్ని యెమెనీ మిలిటెంట్లయిన హౌతీలు దిగ్బంధించటం వంటి విషయాల గురించి ఆయన ఒక పత్రికా సమావేశంలో మాట్లాడిన సందర్భంలో పై విధంగా వ్యాఖ్యానించారు. "గాజాలో జరుగుతున్నమానవ హననంవల్ల పశ్చిమ దేశాలు, యూరోపియన్లు తాము కూడబెట్టుకున్న గౌరవాన్ని, ప్రతిష్టను ఆకస్మికంగా పోగొట్టుకున్నారు. మానవాళి దృష్టిలో ముఖ్యంగా మన తరంలో వాళ్ళుతమ ప్రతిష్ట ను పూర్తిగా కోల్పోయారు." అని ఫిదన్ పాత్రికేయులతో అన్నారు. అలాగే, పోయిన ప్రతిష్ట వాళ్ళకు తిరిగి రాదని కూడా ఆయన విమర్శించారు. గాజాపైన ఇజ్రాయిల్ చేస్తున్న దారుణ మారణకాండపైన, ఉక్రెయిన్ లో జరుగుతున్న యుద్ధంపైన పశ్చిమ దేశాల ప్రకటితఅధికార వైఖరిని పోల్చినప్పుడు వారి కపటత్వం శిఖరాగ్రానికి చేరిందనేది సుస్పష్టం. నీతి, నియమాలను పట్టించుకోని వారికి వాటిని గురించి మాట్లాడటం సాధ్యపడదని, ఇదంతా ఒక పెద్ద భౌగోళిక వ్యూహ సంబంధిత సంక్షోభానికి దారితీస్తుందని ఫిదన్ పేర్కొన్నారు. ఒకవైపు అమెరికా, ఇతర పశ్చిమ దేశాలు గాజాలో ఇజ్రాయిల్ చేస్తున్న నరమేధానికి ఎటువంటి షరతులులేకుండా మద్దతు తెలుపుతుండగా రష్యా, చైనాల వైఖరి వేరుగా వుంది. . గాజా సమస్యని శాంతియుతంగా పరిష్కరించటానికి, వారి విధానాన్ని సమన్వయం చేయటానికి టర్కీ తో పాటు మధ్య ప్రాచ్యంలోని అనేక ముస్లిం దేశాలు ఒక 'కాంటాక్ట్ గ్రూప్'ను ఏర్పాటుచేశాయని ఫిదన్ రిపోర్టర్లలకు గుర్తుచేశారు. టర్కీలో ఇజ్రాయిల్ కోసం గూఢచర్యం జరుపుతున్న 33మంది ఏజంట్లను అరెస్టు చేసిన మరుసటి రోజు టర్కీ విదేశాంగ మంత్రి ఈవ్యాఖ్యలు చేయటం గమనార్హం. ఇప్పటికే ఇజ్రాయిల్ ప్రధాని బెన్జమిన్ నేతాన్యాహు 'హిట్లర్ కన్నా నీచుడు' అని ఎర్డోగాన్ విమర్శించారు.

ఛత్తీస్‌గఢ్‌లో భారీగా ఐఎఎస్ అధికారుల బదిలీ

రాయ్‌పూర్ : ఛత్తీస్‌గఢ్‌లో కొత్తగా ఎన్నికైన బిజెపి ప్రభుత్వం 88 మంది ఐఎఎస్ అధికారులను, ఓ ఐపిఎస్ అధికారిని బదిలీ చేసింది. బదిలీ అయిన వారిలో 19 జిల్లాల కలెక్టర్లు కూడా ఉన్నారు. బుధవారం అర్ధరాత్రి సాధారణ పరిపాలనా శాఖ ఈ ఉత్తర్వులను జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. ఆదేశాల ప్రకారం.. రాయ్‌పూర్, మనేంద్రగర్- చిర్మిరి-భరత్‌పూర్ (ఎంసిబి), కాంకేర్, కోర్బా, రాజ్‌నంద్‌గావ్, బెమెతర, కొండగావ్, దుర్గ్, సూరజ్‌పూర్, నారాయణ్‌పూర్, దంతెవాడ, బీజాపూర్, సుర్గుజా, జంజ్‌గిరి-చంపా, బలోద్, ధామ్‌తరి, సారన్‌ఘరి-బిలైఘర్, ఖైరాగఢ్-చుయిఖదన్-గండై మరియు గరియాబండ్ జిల్లాల కలెక్టర్లను మార్చినట్లు అధికారులు తెలిపారు. డిసెంబర్ 19న 2006 బ్యాచ్‌కి చెందిన ఐఎస్ అధికారి పి. దయానంద్‌ను సిఎం సెక్రటరీగా నియమించిన సంగతి తెలిసిందే. 2006బ్యాచ్‌కి చెందిన మరో ఐపిఎస్ అధికారి మయాంక్ శ్రీవాస్తవను కమీషనర్, ప్రజా సంబంధాల శాఖ డైరెక్టర్‌గా నియమించింది.

అమెరికాలో క్యాపిటల్ భవనాలకు బాంబు బెదిరింపులు

వాషింగ్టన్ : అమెరికాలో బాంబు బెదిరింపులు తీవ్ర కలకలం రేపుతున్నాయి. పలు రాష్ట్రాల క్యాపిటల్ భవనాలకు ఈ బెదిరింపులు రావడంతో అప్రమత్తమైన పోలీసులు వాటిని ఖాళీ చేయించారు. ఇరాన్‌లో భీకర పేలుళ్ల వేళ ఈ పరిణామాలు చోటుచేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. జార్జియా, కనెక్టికట్, కెంటుకీ, మిషిగాన్, మిన్నెసోటా, మిసిసిపీ, మోంటానా, మైన్, హవాయి రాష్ట్రాల క్యాపిటల్ భవనాలకు బుధవారం ఉదయం (అమెరికా కాలమానం ప్రకారం) ఈ బాంబు బెదిరింపులు వచ్చాయి. గుర్తుతెలియని ఈ-మెయిల్ ఐడి నుండి ఒకేసారి అన్ని ఆఫీసులకు ఈ బెదిరింపులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. దీంతో వెంటనే భవనాలను ఖాళీ చేయించి డాగ్ స్క్వాడ్‌లతో తనిఖీలు చేపట్టారు. ఎక్కడా ఎలాంటి పేలుడు పదార్థాలు లభించలేదని ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బిఐ) తెలిపింది. ఇరాన్‌లో బుధవారం జంట పేలుళ్లు సంభవించిన సంగతి తెలిసిందే. ఇరాన్ సైనిక ఉన్నతాధికారి సంస్మరణ కార్యక్రమంలో సంభవించిన జంట పేలుళ్ళలో వంద మందికిపైగా మరణించారు. మరో 141మంది గాయపడ్డారు. మతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందన్నారు.

జూనియర్ డాక్టర్ల డిమాండ్ల పరిష్కారానికి
బ్రిటన్ ప్రభుత్వం సుముఖత?

లండన్ : అనూహ్యమైన రీతిలో ఆరు రోజుల పాటు సమ్మెను చేపట్టిన జూనియర్ డాక్టర్ల డిమాండ్లను పరిష్కరించేందుకు బ్రిటన్ ప్రభుత్వం సుముఖంగా వుందని ఎన్‌హెచ్ఎస్ నేత సూచనప్రాయంగా గురువారం తెలిపారు. సమ్మె నేపథ్యంలో పెరుగుతున్న ఒత్తిడే ఇందుకు ప్రధాన కారణంగా వుంది. మరోపక్క సమ్మెలో వున్న జూనియర్ డాక్టర్లకు సంఘీభావంగా ప్రజల నుండి మద్దతు పెరుగుతోంది. దీంతో ప్రభుత్వం దిగిరాక తప్పని పరిస్థితి ఏర్పడుతోంది. ఎన్‌హెచ్ఎస్ ట్రస్ట్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఎన్‌హెచ్ఎస్ సమాఖ్య చీఫ్ ఎగ్జిక్యూటివ్ మాథ్యూ టేలర్ రేడియో 4తో మాట్లాడుతూ, వివాదాన్ని పరిష్కరించే దిశగా పురోగతి వుందనడానికి ప్రాతిపదిక వుందని భావిస్తున్నట్లు చెప్పారు. ఇదిలావుండగా, గంటకు 15 పౌండ్ స్టెర్లింగ్‌ల నుండి 21కి తక్షణమే పెంచాలని తాము కోరడం లేదని బిఎంఎ సహ అధ్యక్షుడు డాక్టర్ వివేక్ త్రివేది పదే పదే చెబుతూ వస్తున్నారు. 2008 స్థాయికి వేతనాలను పునరుద్ధరించాలని కోరామని, ప్రభుత్వం అందుకు సుముఖంగా లేదని చెప్పారు. అయితే ప్రభుత్వం జాప్యందారీ ఎత్తుగడలు అనుసరిస్తే మరింత కఠినమైన కార్యాచరణ వుంటుందని ఆయన స్పష్టం చేశారు. సమ్మె ముగిసేలోగా ప్రభుత్వం చర్చలకు సిద్ధం కావాలన్నారు.

- ఇజ్రాయిల్‌వ్యాప్తంగా పలు నగరాల్లో వేలాదిమంది ప్రదర్శనలు

నెతన్యాహు వైదొలగాలి

టెల్ అవీవ్ : గాజాపై గత మూడు మాసాలుగా దాడులను కొనసాగిస్తున్న ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహును తక్షణమే పదవి నుండి వైదొలగాలంటూ వేలాదిమంది ఆందోళనకారులు డిమాండ్ చేశారు. కొత్తగా ఎన్నికలను నిర్వహించాలని కోరారు. ఇజ్రాయిల్ మితవాద ప్రభుత్వానికి వ్యతిరేకంగా టెల్అవీవ్‌లోని హబీమా స్క్వేర్ వద్దకు వేలాదిమంది ప్రదర్శకులు గుమిగూడారు. తక్షణమే ఎన్నికలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కేవలం టెల్ అవీవ్‌లోనే కాకుండా జెరూసలేం, హైఫా, కార్కుర్, కైఫర్ సావా, తదితర నగరాల్లో ఇదే తరహాలో ప్రదర్శనలు, ఆందోళనలు ఈ నెల 2న జరిగాయి. రాడికల్ బ్లాక్ కార్యకర్తలు, హదష్ (డెమోక్రటిక్ ఫ్రంట్ ఫర్ పీస్ అండ్ సాలిడారిటీ) సభ్యులు, ఇజ్రాయిల్ కమ్యూనిస్టు పార్టీ సభ్యులు వేల సంఖ్యలో యుద్ధాన్ని నిరసిస్తూ ప్రదర్శన చేశారు. నెతన్యాహు, ఆయన ఫాసిస్ట్ కూటమిని లక్ష్యంగా చేసుకుని అనేకమంది బ్యానర్లు ప్రదర్శించారు. నెతన్యాహు పాలనలో పరిస్థితులు ఈ విధంగా వున్నాయని, ఒక విపత్తు తర్వాత మరొకటి తలెత్తుతునే వుందని ప్రదర్శకులు నినాదాలు చేశారు. మరింత మెరుగైన భవితవ్యం కోసం మనం ఈ సందర్భంగా తీర్మానించాలని కోరారు. గాజాలో శాశ్వత కాల్పుల విరమణ జరగాలన్నదే కొత్త సంవత్సరం తీర్మానమని వారు స్పష్టం చేశారు. అమెరికాలో కూడా న్యూయార్క్, బోస్టన్, వాషింగ్టన్ సహా పలు నగరాల్లో ప్రదర్శనలు జరిగాయి. కాల్పుల విరమణ జరగాలని ప్రదర్శకులు డిమాండ్ చేశారు. ప్రస్తుతమున్న దయనీయ పరిస్థితులను పరిష్కరించాలంటే ముందుగా శాశ్వత కాల్పుల విరమణ జరగాలని, అది అనివార్యమని వారు పేర్కొన్నారు.

విభేదాలు పక్కన పెట్టి ముందుకెళ్లాలి

- కాంగ్రెస్ సమావేశంలో అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే
- రాహుల్ గాంధీ యాత్రలో స్వల్ప మార్పులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించాలంటే నాయకులు విభేదాలు పక్కనపెట్టి, ముందుకు వెళ్లాలని ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హితబోధ చేశారు. రాబోయే మూడు నెలల పాటు పార్టీని గెలిపించడానికి కట్టుబడి ఉండాలని సూచించారు. మీడియాలో అంతర్గత సమస్యలను లేవనెత్తడం మానుకోవాలని పార్టీ నేతలకు సూచించారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో గురువారం నాడిక్కడ ఏఐసిసి కార్యాలయంలో మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శులు, ఇంచార్జ్, పిసిసి అధ్యక్షులు, సిఎల్పీ నేతలతో సమావేశం జరిగింది. దాదాపు మూడున్నర గంటలు జరిగిన ఈ సమావేశంలో 2024 లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, ఇండియా కూటమి పొత్తులు, భారత్ జోడో న్యాయ యాత్రపై చర్చించారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ "పగలు, రాత్రి కష్టపడి పనిచేస్తేనే లోక్‌సభ ఎన్నికల తరువాత ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని అందించగలుగుతాము" అని అన్నారు.

'గత పదేళ్లలో తన ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు బిజెపి భావోద్వేగ సమస్యలను తెరపైకి తెస్తోంది. వారు ఉద్దేశపూర్వకంగానే ప్రతి విషయంలోనూ కాంగ్రెస్‌ను లాగుతున్నారు' అని విమర్శించారు. 'ఆధునిక భారతదేశ నిర్మాణానికి కాంగ్రెస్ చేస్తున్న సహకారాన్ని విస్మరించేందుకు నరేంద్ర మోడీ ప్రభుత్వం నిరంతరం ప్రయత్నిస్తోంది. మేము వారికి తగిన సమాధానం ఇస్తాం" అని ఖర్గే అన్నారు.

14 నుంచి భారత్ జోడో న్యాయ యాత్ర

రాహుల్ గాంధీ నేతృత్వంలో జనవరి 14 నుంచి భారత్ జోడో న్యాయ యాత్ర ప్రారంభంకానుంది. మణిపూర్ నుండి ముంబాయి వరకు 6,713 కిలో మీటర్ల మేర సాగే ఈ యాత్ర మార్చి 20న ముగుస్తుందన్నారు. మొత్తం 15 రాష్ట్రాలు, 110 జిల్లాల మీదుగా 66 రోజుల పాటు 100 లోక్‌సభ నియోజకవర్గాల్లో సాగనుంది. ఇందులో 337 అసెంబ్లీ నియోజకవర్గాలు కూడా కలుస్తాయి.గత ఏడాది కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు 4 వేల కిలోమీటర్ల మేర భారత్ జోడో యాత్రను రాహుల్ గాంధీ చేపట్టారు. 136 రోజుల పాటు ఆ యాత్ర కొనసాగింది. ఇప్పుడు భారత్ జోడో న్యాయ్ యాత్ర చేపడుతున్నారు. యాత్ర పేరు ముందు భారత్ న్యాయ్ యాత్ర అని ఉండేది. తరువాత దానికి జోడో చేర్చారు. అలాగే ముందుగా 14 రాష్ట్రాల్లో యాత్రను షెడ్యూల్ చేయగా, ఇప్పుడు మరో రాష్ట్రాన్ని చేర్చారు. అలాగే, ఈయాత్రలో సామాజిక, ఆర్థిక అంశాలు గురించి రాహుల్ గాంధీ లేవనెత్తుతారని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేష్ తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
రహదారులు మరియు భవనముల శాఖ
టెండరు షార్ట్ నోటీసు

నెం.27(2)/టి.ఓ/2023-24, తేది : 02.01.2024

2023-24 సం॥నకు ఇన్‌స్పెక్షన్ భవనాలు మరమ్మత్తులు నిమిత్తం 2 పనులకు గాను అంచనా విలువ : రూ.60.90 లక్షలకు టెండర్లు కోరబడుచున్నవి. టెండరు షెడ్యూల్ డౌన్‌లోడ్ చేసుకొనుటకు తేది : 08.01.2024, సా.3గం.ల నుండి. ఇతర వివరాలను ఈ కార్యాలయములో పొందవచ్చును. ఫోన్ :08672-252500.

సం/- కార్యనిర్వాహక ఇంజనీరు, (ర.భ) శాఖ, మచిలీపట్నం
DIPRNo.12293/CL/ADVT/1/1/2021-22

यूनियन बैंक ऑफ इंडिया भारत सरकार का उपक्रम
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భారత ప్రభుత్వ రంగ సంస్థ
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
ప్రాంతీయ కార్యాలయము, మచిలీపట్నం.

బంగారు నగల వేలం ప్రకటన

ఈ క్రింద ఉదహరించిన ఖాతాదార్లులు మా బ్యాంకు నందు బంగారు నగలు తనఖా పెట్టి అప్పు తీసుకొని తిరిగి చెల్లించమని నోటీసులు పంపిననూ తిరిగి చెల్లించని కారణంగా బ్యాంకు నిబంధనల ప్రకారం **ది. 10-01-2024, బుధవారం, సా॥ 4.00 గంటలకు బ్రాంచి ఆవరణలో బహిరంగవేలం వేయబడును.** వేలం వేసినా బకాయి రద్దు కాని యెడల వారిపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకొని మిగిలిన బకాయి వసూలు చేయబడును. ఈ దిగువ ఖాతాదారు ఎవరైనా మరణించిన యెడల వారి వారసులకు ఈ వేలం నోటీసు వర్తిస్తుంది. అప్పు నోటీసులు అందని వారికి మరియు నోటీసులను తిరస్కరించిన వారికి పత్రికా ముఖమున చివరిసారిగా ఈ నోటీసు ద్వారా తెలియజేయడమైనది.

వ. సం.	ఖాతా నెం.	ఋణగ్రహీత పేరు	స్థూల బరువు (గ్రాములలో)
		హనుమాన్ జంక్షన్ బ్రాంచి	
1.	020016540004477	పర్వతనేని విష్ణుమోహన్, తండ్రి : సీతారామస్వామి, హెచ్.నెం. 7-139, సి.ఐ. ఆఫీస్ దగ్గర, హనుమాన్ జంక్షన్, బాపులపాడు, కృష్ణా జిల్లా-521105	52.00
2.	020016540004478		39.00
		పోరంకి బ్రాంచి	
3.	330006540219695	కుక్కల భానుమతి, భర్త : వీరరాఘవులు, డి.నెం. 2-128, తూముల సెంటర్, పోరంకి, కృష్ణా జిల్లా - 521137	11.20
4.	330006540219865		41.30
5.	330006530000255		15.70
		ఉయ్యూరు - యుబిఐ బ్రాంచి	
6.	639606540012184	కొడాలి రాజశేఖర్, తండ్రి : పుష్పానందం, 12-50, 12వ వార్డు, మెయిన్ రోడ్డు, కాటూరు, కృష్ణా జిల్లా - 521164	42.00
		ఉయ్యూరు - ఎ.బి. బ్రాంచి	
7.	061116540002943	ఆళ్ళ రామచంద్రారెడ్డి, తండ్రి:సత్యనారాయణ, 8-163, 8వ వార్డు, బద్రిరాజుపాలెం, కృష్ణా - 521163	13.00

షరతులు : 1) వేలంలో పాల్గొనువారు **రూ. 5,000/- (అక్షరాల ఐదు వేల రూపాయలు మాత్రమే)** ధరావత్తు చెల్లించవలెను. **2)** వేలంలో ఆభరణములు పొందినవారు ధరావత్తు సొమ్ము మినహా మిగిలిన సొమ్మును వెంటనే చెల్లించి ఆభరణములను పొందవలెను. వేలంలో ఆభరణములు పొందని వారికి ధరావత్తు సొమ్ము వేలం అనంతరం తిరిగి చెల్లించబడును. **3)** ఏ స్థితిలోనైనా వేలం నిలుపుదల చేయుటకు గాని, నియమ నిబంధనలు మార్చుటకు గాని బ్యాంకు వారికి పూర్తి అధికారం కలదు. **4)** వేలంలో పాడిన సొమ్మును అంగీకరించుటకు లేక తిరస్కరించుటకు బ్యాంకు వారికి పూర్తి అధికారం కలదు. **5)** వేలంలో పాల్గొను వారు ఆధార్ మరియు పాన్‌కార్డు కాపీలను సమకూర్చవలెను.

ది. 04-01-2024 సం/- అధీకృత అధికారి

इंडियन बैंक ఇండియన్ బ్యాంక్ इलाहाबाद ALLAHABAD
గుజ్జనగుండ్ల బ్రాంచి : గుంటూరు, గుంటూరు జిల్లా.

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన
APPENDIX- IV-A" [See proviso to rule 8 (6)]

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(6) లోని నిబంధనలతో చదువుకోవలసిన సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకము కొరకు ఈ-వేలం అమ్మకం ప్రకటన)

సెక్యూర్డ్ క్రెడిటార్స్ ఇండియన్ బ్యాంక్ వారికి **1) శ్రీమతి తురుమెళ్ళ లావణ్య, భర్త : మడె ప్రకాశ్ కుమార్ (ఋణగ్రహీత & తనఖాదారు) 2) శ్రీ మడె ప్రకాశ్ కుమార్, తండ్రి : మడె ఆనందకుమార్ (సహ ఋణగ్రహీత)** వారు ది. 03-01-2024 నాటికి చెల్లించవలసిన బకాయి మొత్తము **రూ. 10,68,301/-** (అక్షరాల పది లక్షల అరవై ఎనిమిది వేల మూడు వందల ఒక్క రూపాయి మాత్రమే) మరింత వడ్డీ, ఖర్చులు, ఇతర ఛార్జీలు వసూలు కొరకు సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన ఇండియన్ బ్యాంక్, గుజ్జనగుండ్ల బ్రాంచి యొక్క అధీకృత అధికారి వారిచే ది. 03-01-2023న లాంఛనాత్మక స్వాధీనత పరచుకోబడి, బ్యాంక్ తనఖా / ఆధీనంలో ఉన్న దిగువ వివరించిన స్థిరాస్తులను **"ఎక్కడ ఎలా ఉన్నది అలానే" "ఏది ఎలా ఉంటే అలానే" మరియు "అక్కడ ఏది ఉన్నదో అది"** పద్ధతిపై విక్రయించబడునని యావన్మంది ప్రజానీకానికి మరియు ప్రత్యేకంగా ఋణగ్రహీత (లు) మరియు హామీదారు (లు) **1) శ్రీమతి తురుమెళ్ళ లావణ్య, భర్త : మడె ప్రకాశ్ కుమార్ (ఋణగ్రహీత & తనఖాదారు) 2) శ్రీ మడె ప్రకాశ్ కుమార్, తండ్రి : మడె ఆనందకుమార్ (సహ ఋణగ్రహీత)** ఇందు మూలముగా సూచించడమైనది.

ఈ-వేలం ద్వారా విక్రయించడానికి ఉద్దేశించిన ఆస్తి వివరాలు క్రింద వివరించబడ్డాయి.

స్థిరాస్తి వివరములు

గుంటూరు జిల్లా, ఫిరంగిపురం మండలం, అమీనాబాద్ గ్రామ పంచాయితీ, డి.నెం. 485-1, 485-1ఎ, 476-1, 484-1, 484-1ఎ మరియు 476 వద్ద ఎకరా 10.98 సెంట్ల విస్తీర్ణంలోని "కల్లం వారి గ్రీన్ సిటీ" నందు డెవలప్‌మెంట్ చేసిన వేరియాలో గల ప్లాట్ నెం. 3కి చెందిన 133 చ॥గ॥ల విస్తీర్ణంలోని స్థలము. దానికి చెందిన ఎపి రేరా రిజిస్ట్రేషన్ నెం. పి07240080470. **హద్దులు : తూర్పు :** 40 అ॥ వెడల్పు రోడ్డు, **దక్షిణం :** ప్లాట్ నెం. 4కి చెందిన ఆస్తి, **పడమర :** ఇతరులకి చెందిన స్థలము, **ఉత్తరం :** ప్లాట్ నెం. 2కి చెందిన ఆస్తి.

ఇంతకముందు తాకట్టు రుణభారాలు : లేవు	రిజర్వ్‌ధర : రూ. 6,78,300/-
ధరావత్తు : 68,000/-	బిడ్ పెంపుదల మొత్తం : 10,000/-
ఈ-వేలం తేది మరియు సమయం : 24-01-2024 - ఉ. 10 గం. నుండి మ॥ 2 గం.లకు	
ఈ ఆక్షన్ కొరకు బిడ్స్ సమర్పించుటకు ఆఖరు తేదీ & సమయం : ది. 23-01-2024, సా॥ 5.00 గం. వరకు	
ప్రాపర్టీ ఐడి నెం. : IDIB6830491749A	

వేలం నందు పాల్గొనువారు సంబంధిత సర్వీసు ప్రొవైడర్ MSTC Ltd వారి వెబ్‌సైట్‌ను సందర్శించి (www.mstcecommerce.com) వేలం నందు పాల్గొదలచినవారు టెక్నికల్ సహాయం కొరకు MSTC హెల్ప్‌డెస్క్ వారి నెంబరు 033-22901004 మరియు ఇతర హెల్ప్‌లైన్ నెంబర్లు సర్వీసు ప్రొవైడర్లు హెల్ప్‌డెస్క్ నందు అందుబాటులో కలవు. రిజిస్ట్రేషన్ సౌలభ్యం కొరకు MSTC Ltd Mail ID : ibapiop@mstcecommerce.com మరియు EMD స్థితిని తెలుసుకొనుటకు ఈ క్రింది Email ID : ibapifin@mstcecommerce.com వారిని సంప్రదించగలరు.

ఆస్తి వివరాలు, ఆస్తికి సంబంధించిన ఫోటోలు మరియు వేలం నియమ నిబంధనలు కొరకు https://ibapi.in ను సంప్రదించవలసిన వారు మరియు పోర్టల్‌కు సంబంధించిన వివరణల కొరకు ఫోన్ నెంబర్లు : 18001025026, 011-41106131.

బిడ్డర్లు ఆస్తికి సంబంధించిన ఐడి నెంబరు ఉపయోగించి వెబ్‌సైట్ **https://ibapi.in** మరియు **www.mstcecommerce.com** నందు సంప్రదించగలరు.

తేది : 03-01-2024 సం/- అధీకృత అధికారి
ప్రదేశం : గుజ్జనగుండ్ల ఇండియన్ బ్యాంక్

మీ కోసం

న్యూస్‌పేపర్‌ని రోల్‌లా చుట్టి దానిపై కొంచెం నీళ్లు చల్లుకోవాలి. తడిగా ఉన్న ఆ రోల్‌ని రాత్రంతా ఫ్రిజ్‌లో ఉంచి తీస్తే ఫ్రిజ్ నుంచి వచ్చే వాసనలు పోతాయి.

జీవన సౌరభం

మనిషి సాధించిన విజయాలు
సమాజ అభివృద్ధికి
ఉపయోగపడితే
అవి నిజమైన విజయాలు.

ముసలవ్వ మనవడు

రామంచ అనే ఊరిలో ఒక ముసలవ్వ ఉన్నది. ఆమె రొట్టెలు అమ్ముతూ బతుకుతోంది. ఆమెకు రవి అనే ఒక మనవడు ఉన్నాడు. ముసలవ్వ చేసిన రొట్టెలను రవి ఇంటింటికి తిరిగి అమ్మేవాడు. ఒకరోజు రొట్టెలు అమ్ముతూ, బడికి వెళ్తున్న పిల్లలను చూసాడు.

'నేను కూడా చదువుకుంటే ఎంత బాగుండు' అనుకుని ఇంటికి వచ్చి ముసలవ్వతో 'బడికి వెళ్తాన'ని అడిగాడు. 'మన దగ్గర అంత డబ్బు లేదు. వద్దు బిడ్డా' అని ముసలవ్వ బుజ్జగించింది.'అవ్వా, నేను సర్కారు బడిలో చదువుకుంటాను. అక్కడ పుస్తకాలు, బట్టలు ఉచితంగా ఇస్తారు. భోజనం, టిఫిన్ ఇస్తారు. చదువు మంచిగా చెబుతారు' అన్నాడు రవి. ముసలవ్వ సరేనని రవిని సర్కారు బడిలో చేర్పించింది. రవి కష్టపడి చదివాడు. సాయంత్రం వేళల్లో రొట్టెలు అమ్ముతూ ముసలవ్వకు సహాయ పడుతున్నాడు. కొంతమంది రొట్టెలు అమ్ముతాడని ఎగతాళి చేసినా తను పట్టించుకోలేదు. ఉపాధ్యాయులు ఏ రోజు చెప్పిన పనిని ఆ రోజే పూర్తి చేసి మంచి పేరు తెచ్చుకున్నాడు. పదో తరగతిలో జిల్లాలోనే మొదటి స్థానం సంపాదించి అందరి మెప్పు పొందాడు. రవి ప్రతిభ చూసిన ఒక సేవా సంస్థ, అతన్ని ఉన్నత తరగతులు చదివించడానికి తగిన ఖర్చులు భరిస్తామని ముందుకు వచ్చింది. మనవడు భవిష్యత్తు బాగుపడుతుందని ముసలవ్వ ఎంతో సంతోషించింది.

– నిమ్మల రిత్విక్,
6వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
జక్కాపూర్, సిద్దిపేట జిల్లా.

దారి కనిపెట్టండి

పిల్లలూ, ఇక్కడ కనిపిస్తున్న బొమ్మలో ఉన్న కోతిపిల్ల దాని ఆహారం అరటిపళ్లను చేరుకునే దారి కనిపెట్టండి.

నేను గీసిన బొమ్మ

ఇషాన్
3వ తరగతి

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఆ ఇద్దరూ ఎందరినో కదిలించారు ...

కొత్త సంవత్సరం రోజు ఏం చేయాలి? ఆ రోజంతా స్నేహితులతో గడిపేయాలి. మంచి సినిమా చూడాలి. నచ్చిన వంట వండుకోవాలి. ఇష్టమైన ప్రదేశానికి వెళ్లాలి.. ఇలా ఒక్కొక్కరు ఒక్కో రకంగా నూతన సంవత్సరాన్ని ప్రారంభించి ఉంటారు. అయితే ముంబయికి చెందిన ఈ ఇద్దరు స్నేహితులు మాత్రం కాస్త భిన్నంగా ఆలోచించారు. తమతో కలసివచ్చిన స్నేహితులతో కలసి జనవరి 1న ముంబై బీచ్‌లో ఏకంగా 4 లక్షల 50 వేల కేజీల చెత్తను ఏరిపారేశారు. మొత్తం 25 వేల మంది వాలంటీర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అక్షత్ షాహ్, శుభ మెహతా 12వ తరగతి చదివేటప్పుడు అంటే 2019లో 'చేంజ్ ఈజ్ అస్' పేరుతో వారాంతాల్లో బీచ్ శుభ్రం చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇద్దరితోనే ఇది ప్రారంభమైంది. ముంబయి గిర్‌గావ్ చౌపతి బీచ్‌లో 450 టన్నుల చెత్తను మొట్టమొదట ఏరిపారేసింది ఈ మిత్రద్వయం. సోషల్ మీడియాలో చురుకుగా ఉంటూ ఎప్పటికప్పుడు తమ కార్యకలాపాలను మిత్రులతో పంచుకోవడం వీళ్ల హాబీ.

'నేను ఒకసారి సోషల్ మీడియాలో గ్రేటా థన్‌బర్గ్ పర్యావరణంపై చేసిన ఉపన్యాసం విన్నాను. 'ఈ భూమి మనది. దీనిని కాపాడుకోవడం మన బాధ్యత' అంటున్న ఆమె ఆ లక్ష్యం నెరవేరడం కోసం దేశవిదేశాల ప్రతినిధులతో పోరాడడం నన్ను ఆశ్చర్యానికి గురిచేసింది. గొప్పగా ప్రభావితం చేసింది. అప్పటి నుండి పర్యావరణాన్ని పరిశీలించడం ప్రారంభించాను. బీచ్‌లో 'పేరుకుపోతున్న ప్లాస్టిక్ నా దృష్టిని ఆకర్షించింది. కొన్ని నెలల పాటు ముంబై బీచ్‌లన్నీ తిరిగాను. అక్కడ కొంతమంది స్వచ్ఛందంగా చెత్త ఏరే పనులను చేస్తున్నారు. వారాంతాల్లో కొంతమంది, ఏదైనా ప్రత్యేక కార్యక్రమం పెట్టుకుని మరికొంతమంది ఈ పనిని చేస్తున్నట్లు నాతో చెప్పారు. అప్పుడే నేను కూడా ఒక నిర్ణయం తీసుకున్నాను. శుభ్‌తో ఈ విషయం పంచుకున్నాను. తను కూడా నాతో చేయి కలిపాడు' అంటున్నాడు అక్షత్. ప్రస్తుతం స్నేహితులిద్దరూ ఇంజినీరింగ్ చేస్తున్నారు.

ఈ బృందంలో ఉన్న మొత్తం వాలంటీర్లలో 10 ఏళ్ల నుండి 75 ఏళ్ల వారు ఉన్నారు. 'మా చిన్నప్పుడు కూడా బీచ్‌లో చెత్త ఉండేది. అయితే అదంతా ఆహార వ్యర్థాలు. కానీ ఇప్పుడు అలా లేదు. ప్లాస్టిక్ సంచులు, సీసాలు, ఇంకా ఇతర వ్యర్థాలతో బీచ్ అంతా నిండిపోయింది. ఎన్నో ఆహ్లాదకర సాయంత్రాలను ఇక్కడ గడిపాం. కానీ ఇప్పుడు ఇక్కడికి రావాలంటేనే భయంగా ఉంటోంది. అందుకే వీళ్లు చేస్తున్న పనిలో భాగం కావాలనుకుని వీళ్లతో చేయి కలిపాను' అంటోంది 75 ఏళ్ల కుంతీ ఓజా. జమీలా సాలేమ్ (18) ఏడు నెలలుగా ఈ కార్యక్రమంలో భాగమైంది. 'మొదట నేను ఒక్కదాన్నే వచ్చాను. తరువాత నా స్నేహితులను కూడా తీసుకొచ్చాను. ఇప్పుడు మేమంతా క్రమం తప్పకుండా బీచ్‌ని శుభ్రం చేస్తున్నాం' అంటోంది. 55 ఏళ్ల క్రాంతీ సాల్వీ ట్రెక్కింగ్, నడక, పరుగుపోటీలు వంటివి నిర్వహిస్తుంటారు. 'బాధ్యతాయుతమైన ఈ పనిని చేయడం నాకు చాలా సంతోషంగా ఉంటుంది. ఈ గ్రహాన్ని రక్షించడంలో నా బాధ్యత నెరవేరుస్తున్నానని తృప్తిగా ఉంటుంది' అని చెబుతున్నారు ఆమె.

'చాలా మంది యువత ఈ పనిలో భాగమవుతున్నారు. మేమంతా ఒక ప్రాంతాన్ని నిర్దేశించుకుని వీలున్న సమయంలో అక్కడ కార్యక్రమం చేస్తాం. మొదట్లో మేమిద్దరమే ఈ పని చేస్తుంటే అందరూ మమ్మల్ని అదోలా చూసేవాళ్లు. ఇప్పుడు వేలాదిమందితో కలసి చేస్తుంటే అక్కడ ఉన్న వారు కూడా మాతో చేతులు కలుపుతున్నారు. చాలా సంతోషంగా ఉంటోంది' అంటున్నాడు శుభ్.

'2019 జులైలో 18 మంది వాలంటీర్లతో మొదటి క్లీనప్ ప్రోగ్రామ్ చేశాం. ఇప్పుడు 25 వేల మందిమి కలసి పనిచేస్తున్నాం. ప్రతి డ్రైవ్‌ని మేము ఎంతో బాధ్యతాయుతంగా చేయడమే కాదు, ఈ బాధ్యత అందరిదీ అని సోషల్ మీడియా వేదికగా తెలియజేస్తాం' అంటున్నారు మిత్రులిద్దరూ.

రంగవల్లి



స్వీటీ,
రాజమండ్రి.

15 చుక్కలు 8 వచ్చేవరకు (మధ్య చుక్క)

ముగ్గులు పంపవల్సిన మా చిరునామా :
మెయిల్ ఐడి : jeevanapageps@gmail.com
వాట్సాప్ : 83329 25496

రెండోటెస్ట్ రెండు రోజుల్లోనే..

- 642బంతుల్లోనే టెస్ట్ ఫలితంతో టీమిండియా రికార్డు
- దక్షిణాఫ్రికాపై ఏడు వికెట్ల తేడాతో గెలుపు
- సిరీస్ 1-1తో సమం

కేప్‌టౌన్: దక్షిణాఫ్రికా పర్యటనను టీమిండియా దిగ్విజయంగా ముగించింది. వన్డే, టి20 సిరీస్‌లను చేజిక్కించుకున్న భారతజట్టు.. టెస్ట్ సిరీస్‌ను 1-1తో డ్రా చేసుకొని దిగ్విజయంగా ముగించింది. తొలి టెస్టులో ఇన్నింగ్స్ 34పరుగుల తేడాతో చిత్తుగా ఓడిన రోహిత్ సేన.. రెండో టెస్ట్‌లో ఆతిథ్యజట్టుపై 7వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. కేప్‌టౌన్‌లోని న్యూలాండ్స్ మైదానంలో జరిగిన రెండోటెస్ట్ కేవలం ఒకటిన్నర రోజుల్లోనే ఫలితం వచ్చింది. దీంతో కేవలం 642బంతుల్లోనే టెస్ట్ ఫలితం రాబట్టిన జట్టుగా టీమిండియా ఓ రికార్డును తనపేర లిఖించుకొంది. రెండో ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా నిర్దేశించిన 79 పరుగుల లక్ష్యాన్ని టీమిండియా 12ఓవర్లలో 3వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఓపెనర్ యశస్వి జైస్వాల్(28), కెప్టెన్ రోహిత్ శర్మ(17నాటౌట్); శుభ్‌మన్ గిల్(10), విరాట్ కోహ్లి(12), శ్రేయాస్ అయ్యర్(4నాటౌట్) బ్యాటింగ్‌లో రాణించారు. దక్షిణాఫ్రికా బౌలర్లలో రబడా, నాండ్రే బర్గర్, మార్కో యన్సెన్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. ఈ విజయంతో రెండు టెస్టుల సిరీస్‌ను టీమిండియా డ్రా చేసింది.

ఓవర్‌నైట్ స్కోరు మూడు వికెట్ల నష్టానికి 62పరుగులతో రెండో రోజు రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన దక్షిణాఫ్రికా మరో 114 పరుగులు జోడించి మిగతా ఏడు వికెట్లు కోల్పోయింది. 36 పరుగుల వ్యక్తిగత స్కోరుతో ఆడిన మార్‌క్రమ్ (106; 103బంతుల్లో 17ఫోర్లు, 2సిక్సులు) సెంచరీతో ఆదుకున్నాడు. జస్‌ప్రీత్ బుమ్రా(6/61) విజృంభణతో ఆతిథ్య జట్టు మొదటి 10 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయింది. ఓ వైపు మిగతా బ్యాటర్ల నుంచి సరైన సహకారం లభించకున్నా మార్‌క్రమ్ మాత్రం ధనాధన్ ఇన్నింగ్స్ ఆడాడు. ముకేశ్ కుమార్‌కు రెండు, సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణకు ఒక్కో వికెట్ దక్కాయి. దీంతో టీమిండియా తొలి ఇన్నింగ్స్ ఆధిక్యత 98పరుగులు పోను 79పరుగుల లక్ష్యాన్ని ఛేదించాల్సి వచ్చింది. ఆ లక్ష్యాన్ని భారత్ 12ఓవర్లలో 3వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఈ మ్యాచ్‌లో విజయం సాధించి టెస్టు కెరీర్‌కు ఘనంగా వీడ్కోలు పలుకుదామనుకున్న డీన్ ఎల్గర్‌కు నిరాశే ఎదురైంది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ మహ్మద్ సిరాజ్‌కు, ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ బుమ్రా, ఎల్గర్‌కు దక్కాయి.

స్కోర్‌బోర్డు..

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 55ఆలౌట్
భారత్ తొలి ఇన్నింగ్స్ : 153

దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్: మార్‌క్రమ్ (సి)రోహిత్ (బి)సిరాజ్ 106, ఎల్గర్ (సి)కోహ్లి (బి)ముఖేశ్ 12, జోర్జి (సి)రాహుల్ (బి)ముఖేష్ 1, స్టబ్స్ (సి)రాహుల్ (బి)బుమ్రా 1, బెడింగ్హామ్ (సి)రాహుల్ (బి)బుమ్రా 11, వెర్రెయనె (సి)సిరాజ్ (బి)బుమ్రా 9, జాన్సెన్ (సి అండ్ బి)బుమ్రా 11, మహరాజ్ (సి)శ్రేయస్ (బి)బుమ్రా 3, రబడా (సి)రోహిత్ (బి)ప్రసిధ్ 2, బర్గర్ (నాటౌట్) 6, ఎన్గిడి (సి)జైస్వాల్ (బి)బుమ్రా 8, అదనం 6. (36.5ఓవర్లలో ఆలౌట్) 176పరుగులు. **వికెట్ల పతనం:** 1/37, 2/41, 3/45, 4/66, 5/85, 6/103, 7/111, 8/162, 9/162, 10/176 **బౌలింగ్:** బుమ్రా 13.5-0-61-6, సిరాజ్ 9-3-31-1, ముఖేశ్ 10-2-56-2, ప్రసిధ్ 4-1-27-1.

భారత్ రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (సి)స్టబ్స్ (బి)బర్గర్ 28, రోహిత్ (నాటౌట్) 17, శుభ్‌మన్ (బి)రబడా 10, కోహ్లి (సి)వెర్రెయనె (బి)జాన్సెన్ 12, శ్రేయస్ (నాటౌట్) 4, అదనం 9, (12ఓవర్లలో 3వికెట్ల నష్టానికి) 80పరుగులు. **వికెట్ల పతనం:** 1/44, 2/57, 3/75 **బౌలింగ్:** రబడా 6-0-34-1, బర్గర్ 4-0-29-1, జాన్సెన్ 2-0-15-1.

తక్కువ బంతుల్లోనే ఫలితంతో టీమిండియా రికార్డు..

టెస్ట్ క్రికెట్ చరిత్రలో అతి తక్కువ బంతుల్లో ఫలితం వచ్చిన టెస్టుల్లో భారత్-దక్షిణాఫ్రికా జట్ల మధ్య జరిగిన రెండో టెస్ట్ నిలిచింది. ఈ రెండుజట్ల మధ్య జరిగిన రెండోటెస్ట్ ఫలితం కేవలం 642బంతుల్లో రాగా.. అంతకుముందు 1932లో ఆస్ట్రేలియా-దక్షిణాఫ్రికా జట్ల మధ్య జరిగిన ఓ టెస్ట్ ఫలితం 656బంతుల్లోనే వచ్చింది. తాజాగా ఆ రికార్డును భారత్-దక్షిణాఫ్రికా రెండోటెస్ట్ బ్రేక్ చేసింది.

తక్కువ బంతుల్లో ఫలితం వచ్చిన మ్యాచ్‌లు..

642బంతులు : భారత్ గెలుపు (దక్షిణాఫ్రికాపై 7వికెట్ల తేడాతో; 2023-కేప్‌టౌన్)
656బంతులు : ఆస్ట్రేలియా గెలుపు (దక్షిణాఫ్రికాపై ఇన్నింగ్స్ 72పరుగులు; 1932-మెల్‌బోర్న్)
672బంతులు : ఇంగ్లండ్ గెలుపు (వెస్టిండీస్‌పై నాలుగు వికెట్ల తేడాతో గెలుపు; 1935-బ్రిడ్జ్‌టౌన్)
788బంతులు : ఇంగ్లండ్ గెలుపు (ఆస్ట్రేలియాపై ఇన్నింగ్స్ 21పరుగులు; 1888-మాంచెస్టర్)
792బంతులు : ఆస్ట్రేలియా గెలుపు (ఇంగ్లండ్‌పై 61పరుగుల తేడాతో గెలుపు; 1888-లార్డ్స్)

నాదల్ పునరాగమనం అదుర్స్..

బ్రిస్బేన్ ఇంటర్నేషన్ టెన్నిస్ టోర్నీ క్వార్టర్స్‌కు

బ్రిస్బేన్: బ్రిస్బేన్ ఇంటర్నేషనల్ ఏటిపి-250లో బరిలోకి దిగిన మాజీ నంబర్ వన్ ఆటగాడు, స్పెయిన్ బుల్ రఫెల్ నాదల్ తొలి మ్యాచ్‌లోనే సత్తా చాటాడు. గురువారం జరిగిన పోటీలో నాదల్ 6-1, 6-2తో కూబ్లెర్‌ను వరుససెట్లలో చిత్తుచేశాడు. సుమారు 12 నెలలుగా గాయంతో కోర్టు మైదానంలోకి దిగని నాదల్.. పునరాగమనం మ్యాచ్‌లో ఆకట్టుకున్నాడు. ఈ మ్యాచ్‌ను నాధల్ కేవలం 83 నిమిషాల్లోనే ముగించాడు. త్వరలో ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ ప్రారంభం కానుండగా.. నాదల్ ఈ టోర్నమెంట్ బరిలోకి రాణించడం ఖాయంగా కనబడుతోంది.

ఆంధ్రకు కఠిన పరీక్ష

నేటినుంచి రంజీట్రోఫీ టోర్నమెంట్

విశాఖపట్నం: రంజీట్రోఫీ సీజన్-2024కు రంగం సిద్ధమైంది. విశాఖపట్నంలోని డా.వైఎస్ రాజశేఖరరెడ్డి ఇంటర్నేషనల్ స్టేడియంలో జరిగే తొలి గ్రూప్ లీగ్ మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు పటిష్ట బెంగాల్‌తో తలపడనుంది. ఆంధ్ర జట్టుకు కెప్టెన్‌గా టీమిండియా టెస్ట్ ఆటగాడు హనుమ విహారి వ్యవహరించనున్నాడు. అశ్విన్ హెబ్బర్, జ్ఞానేశ్వర్, రికీ బుయ్‌లతో ఆంధ్ర పట్టు పటిష్టంగా ఉన్న బెంగాల్‌ను ఏమాత్రం తక్కువ అంచనా వేయడానికి వీల్లేదు. ఆంధ్ర జట్టు ఎలైట్ గ్రూప్ దాటి నాకౌట్‌కు చేరాలంటే ప్రతి మ్యాచ్‌లో గెలుపు తప్పనిసరి. ఇదే గ్రూప్‌లో ముంబయి, బీహార్, అస్సాం, ఛత్తీస్‌గడ్, ఉత్తరప్రదేశ్, కేరళ జట్లు ఉన్నాయి.

'ఈగల్'.. సంక్రాంతికి లేదు

సంక్రాంతి సినిమాల జాబితా నుంచి 'ఈగల్' తప్పుకున్నట్లు తెలుస్తోంది. తెలుగు ఫిలిం ఛాంబర్ అధ్యక్షుడు దిల్ రాజు నేతృత్వంలో కొన్ని రోజులుగా చిత్ర నిర్మాతలతో చర్చలు నడుస్తున్నాయి. వరుసగా ఐదు పెద్ద సినిమాలు విడుదలకు సిద్ధమైన నేపథ్యంలో 'ఈగల్' విడుదల వాయిదా పడింది. ఇది జనవరి 26న వస్తున్నట్టుగా సమాచారం. అదే రోజు రవి తేజ పుట్టినరోజు కావటం, రిపబ్లిక్ దినోత్సవం కూడా కావడంతో 'ఈగల్' సినిమాకి ఎక్కువ థియేటర్లు దొరికేటట్టుగా చేస్తామని హామీ ఇవ్వడంతో ఈ చిత్ర నిర్మాతలు వెనక్కి తగ్గారు.

'గుంటూరు కారం' రాజీ

మహేష్ బాబు, త్రివిక్రమ్ కాంబినేషనల్లో వస్తోన్న 'గుంటూరు కారం' చిత్రం నుంచి మీనాక్షి చౌదరి లుక్‌ను గురువారం విడుదల చేశారు. ఇందులో ఆమె పాత్ర పేరు రాజి. మహేష్ బాబు మరదలుగా నటిస్తోంది. ఈ సినిమా నుంచి ఇప్పటి వరకు మూడు పాటలు విడుదల చేశారు. ఇక ఈ చిత్రంలో ప్రకాష్ రాజ్, మహేష్ బాబు తాతగా కనిపించబోతున్నారు. రమ్యకృష్ణ, జయరాం, రావు రమేష్, మురళి శర్మ, బ్రహ్మాజీ, వెన్నెల కిశోర్ తదితరులు నటిస్తున్నారు. జనవరి 12న ఈ చిత్రం విడుదలవుతోంది.

అమీర్ ఖాన్ ఇంట పెళ్లిసందడి

బాలీవుడ్ నటుడు అమీర్‌ఖాన్, రీనా దత్తల కుమార్తె ఐరా ఖాన్ వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. బంధువులు, స్నేహితుల సమక్షంలో తన ప్రియుడు, ఫిట్‌నెస్ ట్రైనర్ నుపుర్ శిఖరేను ఆమె వివాహమాడారు. ముంబయిలోని ఓ హెూటల్ జనవరి 3 రాత్రి ఈ వివాహ వేడుక నిర్వహించారు. రిజిస్టర్ మ్యారేజీతో ఈ జంట ఒక్కటయ్యారు. వివాహం అనంతరం అదే హోటల్‌లో రిసెప్షన్ జరిగింది. ఐరా ఖాన్ సినీ ప్రియులకు సుపరిచితమే. 'మెంటల్ హెల్త్ సపోర్ట్ ఆర్గనైజేషన్' సంస్థ వ్యవస్థాపకురాలు, సీఈవో అయిన ఆమె తరచూ మానసిక ఆరోగ్యంపై సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతుంటారు. ఈ వివాహానికి ముందు నుపుర్ తన నివాసం నుంచి జాగింగ్ చేస్తూ హోటల్‌కు చేరుకున్నారు. జాగింగ్ దుస్తుల్లోనే ఐరాను వివాహం చేసుకున్నారు. ఈ నెల 8న రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో ఈ జంట మరోసారి వివాహ వేడుక జరుపుకోనుంది. జనవరి 13న ముంబయిలో వివాహ విందు ఏర్పాటు చేయనున్నారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68